# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి:01 | సంచిక:42 | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | గురువారం, అక్టోబర్,08, 2026 | పేజీలు:12 | వెల:10రూ/-


**ఎన్ఎఫ్‌సీతో సులువుగా చెల్లింపులు**



2 లో



## అక్టోబర్ 15 నుంచి యూపీఐ ఛార్జీలు

- ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు
- రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై అక్టోబర్ 15 నుంచి ఛార్జీలు
- ఈ ఛార్జీల వల్ల లావాదేవీల పరిమాణం తగ్గదని ఆర్బీఐ గవర్నర్ స్పష్టత
- ఈ రుసుముల వల్ల కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని కేంద్రం వెల్లడి

# మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలి

**వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి లోకేశ్ ప్రత్యేక పూజలు**

- ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి
- మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థన
- ప్రధానిని 'ఆధునిక ఉక్కు మనిషి'గా అభివర్ణించిన లోకేశ్
- వికసిత్ భారత్ సంకల్పం నెరవేరాలని ఆకాంక్ష



అమరావతి, ట్రైనెట్ న్యూస్:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25

మిగతాది 2లో

# విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయికి చేరిందది

- యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్.. రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!
- బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ
- గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్:: తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయికి చేరిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. "20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం. కొందరు నేతలు తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళపరు స్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. అవసరాలకు తగ్గట్టు విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

మిగతాది 2లో



## ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

- కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు భూసేకరణ పూర్తయిందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురం ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ధీమా
- విశాఖ ఎకనామిక్ రీజియన్ త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందన్న కేంద్ర మంత్రి

మిగతాది 2లో

# ఫారమ్-6పై దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం

- వెనక్కి తగ్గిన కేంద్ర ఎన్నికల సంఘం!

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** ఎస్ఐఆర్ రద్దు, కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ల నేపథ్యంలో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగుతోంది. ముఖ్యంగా 13.39 కోట్ల ఓట్ల తొలగింపుపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. మరోవైపు, కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే 'ఫారం-6'లో నిబంధనల మార్పుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఈ వివాదంపై మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫారం-6తో పాటు అదనపు డిక్లరేషన్‌ను (పూర్వీకుల వివరాలు తదితర షరతులు) తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. చట్టబద్ధమైన ఈ ఫారమ్‌లో మార్పులు చేయడానికి ఎవరు అనుమతి ఇచ్చారు? దీని వెనుక ఎవరున్నారు? అంటూ నిలదీసింది.అయితే, ఎస్ఐఆర్ నిబంధనల ప్రకారమే ఆ అదనపు వివరాలు కోరామని ఈసీ వాదించినప్పటికీ.. వివాదం ముదరడంతో కొన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ పోర్టల్ నుంచి ఆ అదనపు డిక్లరేషన్ ఆప్షన్‌ను ఈసీ వెనక్కి తీసుకుంది.



**ఏఎస్‌డీడీ కేటగిరీలో ఉన్నవారందరూ తొలగించినట్లేనా?**

ఈసీ వర్గాల సమాచారం ప్రకారం.. ముసాయిదా జాబితాలో గుర్తించిన సుమారు 13.39 కోట్ల ఎంట్రీలను వివిధ కారణాల రీత్యా 'ఏఎస్‌డీడీ' కింద వర్గీకరించారు. ఇందులో ఒక్కో వర్గానికి సంబంధించిన లెక్కలు ఇలా ఉన్నాయి.

శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు : 6.30 కోట్లు
గైర్హాజరైనవారు,ఆచూకీ లభించని ఓటర్లు : 3.01 కోట్లు
మరణించిన ఓటర్లు: 2.80 కోట్లు
డూప్లికేట్ (నకిలీ) ఓటర్లు: 1.02 కోట్లు
ఇతర కేటగిరీలకు చెందిన ఓటర్లు : 0.26 కోట్లు.

అయితే, ఈ ఓటర్లను ఓట్ల జాబితా నుంచి

మిగతాది 2లో

# ఓ వైపు కరెంటు కోతలు.. మరోవైపు జనంపై బిల్లుల వాతలు

- ట్రూ అప్ చార్జీల పేరిట రూ.5,420 కోట్ల వసూలు దుర్మార్గం
- విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి జనంపై భారం
- బిల్లుల పెంపు ఉపసంహరించకుంటే బీఆర్ఎస్ పోరు: హరీశ్‌రావు



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్:: ఓ వైపు కరెంటు కోతలు, మరో వైపు విద్యుత్ బిల్లుల వాతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల పెంపుతో పిడుగు వేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్షం డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రూ అప్ చార్జీల పేరిట రూ.5,420 కోట్లు ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేయాలనే దుర్మార్గ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ప్రజలపై రూ.5 వేల కోట్ల భారాన్ని మోపాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమానికి శ్రీకారం

మిగతాది 2లో

# భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారు

- పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం



**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది.తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది.అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది.

## ప్రతి ఎఫ్ఐఆర్ ఒక మెడల్..వంద నా టార్గెట్

- రాహుల్ గాంధీ



**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** విపక్ష ఎంపీల సమావేశం ముగిసిన అనంతరం దిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. మరోసారి ఈసీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రతిపక్ష ఎంపీలు సిద్ధమయ్యారు. దీంతో ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. మోదీ, అమిత్‌షాలు జ్ఞానేశ్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడితే తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. వాటిని పతకాలుగానే భావిస్తానన్నారు. ఇప్పటి వరకు తనపై 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని.. వంద సాధించడమే తన లక్ష్యమని అన్నారు. 'లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలవాలనుకున్నాం. అందుకే మంగళవారం ఈసీని కలుద్దామని 300మంది ఎంపీలం వెళ్లాం. మాకు అనుమతి నిరాకరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదు. మా దృష్టిలో ఆయన చట్టబద్ధమైన అధికారి కాదు. అందుకే పదవి దిగిపోవాలని కోరుతున్నాం. దేశ ద్రోహులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు.



## తమిళనాడు సీఎం విజయ్‌తో ఏపీసీసీ చీఫ్ షర్మిల భేటీ

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు.

# విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయికి చేరిందది

మొదటి పేజీ తరువాయి

లేదు. విద్యుత్ సంస్థలను లిస్టెడ్ కంపెనీలుగా మార్చే ప్రతిపాదన లేదు. పదేళ్లు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు అలా మాట్లాడటం సరికాదు. విద్యుత్ సిబ్బందిని కించపరిచే విధంగా రాజకీయ నేతలు విమర్శలు చేస్తున్నారు. ఊహించుకుని మాట్లాడటం వల్ల రాష్ట్రానికే నష్టం. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల భారీగా విద్యుత్ డిమాండ్ పెరిగింది. యాదాద్రి పవర్ ప్లాంట్ పాపం ఎవరిది? ఒక పవర్ ప్లాంట్ పెట్టేముందు.. అవసరమైన కోల్ చూసుకుని పెడతారు. సింగరేణి నుంచి యాదాద్రికి గ్రేడ్ 9 కోల్ సప్లయ్ చేస్తామని చెప్పారు. బొగ్గు సరఫరాకు ఒప్పందం చేసుకుని సప్లయ్ చేయలేదు. మొదటి నుంచి కోల్ అలాట్‌మెంట్ లేకుండానే యాదాద్రి పవర్ ప్లాంట్ కట్టారు" అని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు.ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

# ఓ వైపు కరెంటు కోతలు.. మరోవైపు జనంపై బిల్లుల వాతలు

మొదటి పేజీ తరువాయి



చుట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తమను ఆదేశించారన్నారు.'విద్యుత్ ఛార్జీల పెంపుదలపై ఉద్యమించిన వారిపై నాటి చంద్రబాబు ప్రభుత్వం కాల్పులు జరిపిన ఘటనకు 26 ఏళ్లు నిండాయి. ఈ కాల్పుల ఘటన నేపథ్యంలో తెలంగాణ కరెంటు కష్టాలకు చరమగీతం పాడేందుకు ప్రత్యేక రాష్ట్రమే పరిష్కారమని కేసీఆర్ తన పదవులకు రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ వస్తే అంధకారం అలుముకుంటుందనే విమర్శలు, అనుమానాలను పటాపంచలు చేస్తూ కేసీఆర్ రాష్ట్రంలో విద్యుత్ వెలుగులు నింపారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో రేవంత్ తుగ్లక్ పాలనలో విద్యుత్ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతుంది.

కాంగ్రెస్ తన తప్పిదాలతో విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి ప్రజలపై భారాన్ని వేస్తోంది'అని హరీశ్‌రావు మండిపడ్డారు. 'పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.12,718.40 కోట్లు ట్రూ అప్ చార్జీలు విధించాలని ఈఆర్సీ కోరినా కేసీఆర్ ప్రజలపై భారం మోపేందుకు కేసీఆర్ అనుమతించలేదు. రూ.91 వేల కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం జెన్‌కో, ట్రాన్స్‌కో సహా మౌలిక వసతులను బలోపేతం చేశారు. అన్ని రంగాలకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేలా రాష్ట్రాన్ని 'పవర్ ఫుల్'గా తీర్చిదిద్దారు. కానీ రేవంత్ ప్రభుత్వం గడిచిన మూడేళ్లలో విద్యుత్ రంగంలో కొత్త పనులేవీ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటుకు కరోనా సోకినట్లుగా విద్యుత్ రంగం పరిస్థితి తయారైంది.కరోనా, ఎల్‌నినో కంటే కాంగ్రెస్ పాలన డేంజర్ అన్నట్లుగా పరిస్థితి తయారైంది. అవకాశమున్నా ప్రభుత్వం నీళ్లను లిఫ్ట్ చేయకుండా, బొగ్గు ఉన్నా కరెంటును ఉత్పత్తి చేయకుండా పాలన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కుంటిసాకులు చెప్తోంది. సింగరేణి బొగ్గు సంస్థ ఉండి కూడా సింగరేణి థర్మల్ ప్లాంటుకు బొగ్గు సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. రూ. 1,600 కోట్ల విలువ చేసే 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు మాయం అయ్యాయని, అదో పెద్ద కుంభకోణం అని మేం ముందు నుంచే హెచ్చరించాం'అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.'ట్రాన్స్‌కో, జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే రేవంత్ ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణను అడ్డుకోవాలి.

# 'నిద్రపోవద్దు.. మాకు మీరు కావాలి'..

- పైలట్ స్మిత్‌ను ఎలా కాపాడారంటే..!
- స్మిత్‌ను 45 నిమిషాలు కాపాడిన డెంటిస్ట్
- టీషర్ట్‌లు, ఐస్‌తో రక్తస్రావం నియంత్రణ
- ప్రమాదకరంగా పడిపోయిన పైలట్ పల్స్
- స్పృహలో ఉంచేందుకు కుటుంబం గురించి మాటలు
- మందులు ఇవ్వకుండా గాయాలు

### కదలకుండా జాగ్రత్త

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** విమానంలో దాడికి గురై తీవ్రంగా గాయపడిన భారత పైలట్ స్మిత్ మచ్ఛర్‌ను కాపాడేందుకు ఓ డెంటిస్ట్ తీవ్రంగా శ్రమించినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. 45 నిమిషాల పాటు స్మిత్ ప్రాణాలతో పోరాడినట్లు తెలుస్తోంది. "నిద్రపోవద్దు.. మాకు మీరు కావాలి" అంటూ పైలట్‌ను ధైర్యంగా ఉంచేందుకు ప్రయత్నించారు. గాయాలతో రక్తస్రావం అవుతున్న స్మిత్‌కు విమానంలోనే ప్రాథమిక చికిత్స అందించారు.సెప్టెంబర్ 30న టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో కోపైలట్ హమామ్ అల్ హమ్మామీ దాడికి పాల్పడిదన విషయం తెలిసిందే. ఈ ఘటనలో స్మిత్ తల, మెడ, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. దాడి అనంతరం ఆయన కాక్‌పిట్‌లో నేలపై పడిపోయారు.



టీషర్ట్‌లతో కట్టుకట్టి..

విమానంలో ఉన్న జార్జియా దేశానికి చెందిన డెంటిస్ట్ డాక్టర్ ఘటా ముసావ్ వెంటనే స్మిత్ వద్దకు వెళ్లారు. ఆయనే విమానంలో ఉన్న ఏకైక వైద్యుడు. స్మిత్ తల, ఎడమ చేతి నుంచి తీవ్రంగా రక్తం కారుతుండటంతో టీషర్ట్‌లను ఉపయోగించి గాయాలపై కవర్ చేశారు. రక్తస్రావం తగ్గకపోవడంతో సిబ్బంది నుంచి ఐస్ ప్యాకెట్లు తెప్పించారు.ప్రతిసారీ గాయాన్ని పరిశీలించేందుకు కట్టు తొలగిస్తే రక్తస్రావం మళ్లీ పెరిగేదని ముసావ్ తెలిపారు. దీంతో 45 నిమిషాల పాటు అలాగే ఉంచారు. స్మిత్ పల్స్ ఓ దశలో ప్రమాదకర స్థాయికి పడిపోయింది. వెంటనే కాళ్లు పైకి ఎత్తడంతో పల్స్ తిరిగి సాధారణ స్థాయికి వచ్చింది.

### 'మీవాళ్ల దగ్గరకు వెళ్తారు'

స్మిత్ స్పృహ కోల్పోకుండా ఉండేలా ముసావ్ ఆయనతో మాట్లాడుతూనే ఉన్నారు. కుటుంబం, పిల్లల గురించి అడిగారు. "భయపడకండి.. మీరు మీ ఫ్యామిలీ దగ్గరకు వెళ్తారు. విమానం త్వరలో ల్యాండ్ అవుతుంది" అంటూ ధైర్యం చెప్పారు.ఓ దశలో స్మిత్ "నన్ను కాపాడండి.. ఇక్కడ చనిపోవాలని లేదు" అంటూ వేడుకున్నారని ముసావ్ తెలిపారు. ఆయన పెదాలు నీలంగా మారడంతో విమాన సిబ్బందిని త్వరగా ల్యాండింగ్ చేయాలని కోరారు.స్మిత్‌కు నొప్పి నివారణ మందులు ఇవ్వాలని కొందరు సూచించినా ముసావ్ అంగీకరించలేదు. గాయాలు మరింత తీవ్రం కావొచ్చని భావించి కదిలించకుండా ఉంచారు. కొద్దికొద్దిగా నీరు ఇచ్చారు. ఆయన మాట్లాడుతున్నారా? స్పృహలో ఉన్నారా? పల్స్ ఎలా ఉంది? పెదాల రంగు ఎలా ఉందన్న అంశాలను గమనిస్తూ ఉన్నారు.

### 'స్మిత్ మా ప్రాణాలు కాపాడారు'

విమానం సౌదీ అరేబియాలో ల్యాండ్ అయిన తర్వాత స్మిత్‌ను వైద్యులకు అప్పగించారు. "గుడ్‌లక్ మై ఫ్రెండ్.. అంతా బాగుంటుంది" అంటూ ముసావ్ వీడ్కోలు చెప్పారు.ఈ ఘటన తర్వాత ముసావ్, ఆయన భార్య మానసిక ఒత్తిడికి గురయ్యారు. అయినా స్మిత్ తమ ప్రాణాలను కాపాడారని ఆయన అన్నారు. "ఆయన మా ప్రాణాలు కాపాడారు. మేం ఆయన ప్రాణాలు కాపాడాం. ఇది కర్మ" అని చెప్పారు.ప్రస్తుతం స్మిత్ యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం మంగళవారం తెలిపింది.

# మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలి



మొదటి పేజీ తరువాయి

సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అమరావతిలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయన, ప్రధాని మోదీ పేరు మీద అర్చన జరిపించి స్వామివారిని దర్శించుకున్నారు.2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రస్థానం ప్రారంభమై, నేటితో 25 ఏళ్లు (రజతోత్సవం) పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో లోకేశ్ పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ శ్రేయస్సు, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రధానికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఆయన తలపెట్టిన 'వికసిత్ భారత్' వజ్రసంకల్పం నెరవేరాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ప్రధాని మోదీని 'ఆధునిక ఉక్కు మనిషి'గా అభివర్ణించిన లోకేశ్, ప్రపంచంలోనే దేశాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలపాలనే లక్ష్యంతో ఆయన నిస్వార్థంగా పనిచేస్తున్నారని అన్నారు. ఆయనకు దేవుడు మరిన్ని శక్తియుక్తులు ప్రసాదించాలని ఆకాంక్షించారు. మోదీ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ యాత్ర' నిర్వహించడం దేశాభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు.

# ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

మొదటి పేజీ తరువాయి

ఏపీలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం, కుప్పం, నాగార్జున సాగర్ సమీపంలో, అమరావతి వంటి ప్రాంతాల్లో ఈ నూతన విమానాశ్రయాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం, కుప్పం ఎయిర్‌పోర్టులకు భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక మినీ ఎకనామిక్ సిటీగా రూపాంతరం చెందనుందని కేంద్ర మంత్రి అన్నారు. ఈ ఎయిర్‌పోర్టు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని, వలసలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఉత్తరాంధ్రలో భారీ పారిశ్రామిక అభివృద్ధి జరగనుందని, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'విశాఖ ఎకనామిక్ రీజియన్' కూడా త్వరలోనే వాస్తవరూపం దాల్చనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

# ఫారమ్-6పై దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం

మొదటి పేజీ తరువాయి

తొలగించినట్లు భావించరాదని, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన తదనంతరం నిబంధనల ప్రకారమే తుది చర్యలు ఉంటాయని ఈసీ స్పష్టం చేసింది. ఈసీఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి ఏకపక్ష ధోరణి లేదని, పూర్తి పారదర్శకత పాటిస్తున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. దేశవ్యాప్తంగా మూడు దశల్లో మొత్తం 95.40 కోట్ల మంది ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పక్కాగా జాబితాలు సిద్ధం చేసేందుకు 10 లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) శ్రమించారు. అలాగే, పూర్తి పారదర్శకత కోసం 22 లక్షలకు పైగా రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులకు (బీఎల్‌ఏలు) జాబితాలను అందజేశారు.ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు,పేర్ల నమోదు కోసం ప్రత్యేకంగా ఒక నెల రోజుల గడువు ఇవ్వడం జరిగిందని ఈసీ గుర్తుచేసింది. ఈ ప్రత్యేక పరిశీలన, సవరణ ప్రక్రియలో ఎవరి పేరైనా పొరపాటున జాబితా నుంచి తొలగించినా, కొత్తగా పేరు నమోదు చేసుకోవాలనుకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకుని తమ ఓటు హక్కును పునరుద్ధరించుకోవచ్చు. లేదంటే కొత్తగా నమోదు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# ఎన్‌ఎఫ్‌సీతో సులువుగా చెల్లింపులు



### ట్యాప్ చెయ్.. చెల్లించెయ్

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** సునీల్.. ఇంట్లో సరకుల కోసమని సూపర్ మార్కెట్‌కు వెళ్లాడు. షాపింగ్ పూర్తయ్యాక కౌంటర్‌లో బిల్లు చెల్లిద్దామని చూస్తే.. హడావుడిలో పర్సు, ఫోను రెండూ ఇంటి వద్దే మర్చిపోయాడు. ఏం చేయాలా..? అని ఆలోచిస్తుంటే.. ఠక్కున ఓ ఆలోచన వచ్చింది. తన స్మార్ట్‌వాచ్ ఓపెన్ చేశాడు. ఎన్‌ఎఫ్‌సీ ఆన్ చేశాడు. అందులో క్రెడిట్ కార్డును ఎంపిక చేసుకుని.. పీవోఎస్ టెర్మినల్ పక్కన స్మార్ట్‌వాచ్ ఉంచి, పిన్ ఎంటర్ చేశాడు. బీప్ శబ్దం వచ్చింది. క్షణాల్లో చెల్లింపు జరిగిపోయింది.మీ ఫోన్, స్మార్ట్ వాచ్‌లో ఎన్‌ఎఫ్‌సీ చిప్ ఉంటే చాలు.. పర్సులో డెబిట్, క్రెడిట్ కార్డులు తీసుకెళ్లాల్సిన అవసరం ఏమాత్రం లేదు. చెల్లింపులు చాలా వేగంగా చేయొచ్చు.

### ఎన్‌ఎఫ్‌సీ అంటే ఏంటి?

ఎన్‌ఎఫ్‌సీ అంటే.. నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్. పేరులోనే సమాధానం ఉంది. రెండు ఎలక్ట్రానిక్ పరికరాలు అత్యంత దగ్గరగా.. అంటే సుమారు 4 సెంటీమీటర్ల కంటే తక్కువ దూరంలో ఉంచినప్పుడు, ఒకదానితో మరొకటి సమాచారాన్ని మార్పిడి చేసుకునే పరిజ్ఞానమే ఇది. ఆర్‌ఎఫ్‌ఐడీ అనే పాత టెక్నాలజీకి ఇది అడ్వాన్స్‌డ్ వెర్షన్. కార్యాలయాల్లో ఐడీ కార్డులను తలుపు దగ్గర టచ్ చేస్తే తెరుచుకుంటుంది కదా. అదే పరిజ్ఞానం స్మార్ట్‌ఫోన్‌లోకి వచ్చేసింది.

### ఫోన్, వాచ్‌లో ఎలా పని చేస్తుంది?

కాంటాక్ట్‌లెస్ చెల్లింపును ప్రారంభించినప్పుడు.. దీనిని ప్రాసెస్ చేసేందుకు ఫోన్ లేదా వాచ్‌ను పీవోఎస్ టెర్మినల్ సమీపంలో ఉంచాలి. ఎన్‌క్రిప్ట్ చేసిన సమాచారాన్ని ఇలా ఒకదానికొకటి పంపుకొంటాయి. కొన్ని క్షణాల తర్వాత చెల్లింపు పూర్తవుతుంది. నగదు, చిప్ కార్డ్ ఉన్న డెబిట్, క్రెడిట్ కార్డు లావాదేవీల కంటే ఎన్‌ఎఫ్‌సీ చెల్లింపులు చాలా వేగంగా జరుగుతాయి.

### ఇలా ఎనేబుల్ చేసుకోవాలి

ఆండ్రాయిడ్‌లో.. ఎన్‌ఎఫ్‌సీని మీ ఫోన్ లేదా వాచ్‌లో ఎనేబుల్ చేసుకోవాలంటే.. ఆండ్రాయిడ్ పరికరాల్లో.. సెట్టింగ్స్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అందులో ఎన్‌ఎఫ్‌సీ అండ్ కాంటాక్ట్‌లెస్ పేమెంట్ ఆప్షన్‌పై క్లిక్‌చేసి ఎనేబుల్ చేసుకోవాలి. అనంతరం డిఫాల్ట్ వ్యాలెట్ యాప్‌పై క్లిక్ చేయాలి. అందులో కనిపించే సామ్‌సంగ్ వ్యాలెట్, గూగుల్ పే, ఫోన్‌పే.. తదితర వాటిల్లో ఒక దానిని ఎంచుకోవాలి. ఆ వ్యాలెట్‌లోకి వెళ్లి.. మన వద్ద ఉన్న డెబిట్, క్రెడిట్ కార్డులను యాడ్ చేయాలి. వేలిముద్ర, పిన్ నంబరుతో ధ్రువీకరించాలి. దీంతో ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది. ఇక చెల్లింపులకు సిద్ధమవుతుంది.

### యాపిల్ పే..

ఇదే పద్ధతిలో యాపిల్ ఫోన్లలోనూ కార్డులను యాడ్ చేసుకోవచ్చు. ఎన్‌ఎఫ్‌సీ ఎప్పుడూ ఆన్‌లోనే ఉంటుంది. ఐఫోన్‌లో యాపిల్ వ్యాలెట్ యాప్‌ను ఓపెన్ చేయాలి. అనంతరం కుడి వైపున కనిపించే ప్లస్ సింబల్‌ను క్లిక్ చేయాలి. తర్వాత డెబిట్ లేదా క్రెడిట్ కార్డు అన్న ఆప్షన్‌ను ఎంచుకుని.. 'కంటిన్యూ'పై క్లిక్ చేసి కార్డులను యాడ్ చేసుకుని బ్యాంకు నుంచి ధ్రువీకరణ పూర్తి చేసుకోవాలి. యాపిల్ వాచ్‌లో కూడా ఇదే రీతిలో యాడ్ చేసుకోవాలి. కాకపోతే మన దేశంలో ఇంకా పూర్తి స్థాయిలో యాపిల్ పే అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డులతోనే పనిచేస్తోంది.

### పూర్తిగా సురక్షితం

ఈ రకమైన చెల్లింపుల్లో కార్డ్ వివరాలు దుకాణదారుకు తెలిసిపోతాయేమో అన్న భయం అవసరం లేదు. ఎన్‌ఎఫ్‌సీ టోకనైజేషన్ విధానంలో డేటా బదిలీ అవుతుంది. మీరు ఫోన్ టచ్ చేసినప్పుడు.. కార్డ్ నంబర్ వెళ్లదు. దానికి బదులుగా ఒక డమ్మీ కోడ్ వెళ్తుంది. దీని వల్ల హ్యాకర్లు మీ డేటాను దొంగిలించడం అసాధ్యం. ఫిజికల్ కార్డ్ వాడటం కంటే ఈ రకమైన చెల్లింపులే సురక్షితం.

# అక్టోబర్ 15 నుంచి యూపీఐ ఛార్జీలు

మొదటి పేజీ తరువాయి

యూపీఐ ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై స్వల్పంగా విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీల పై 0.4 శాతం యూజర్ ఛార్జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.బుధవారం ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కొత్త ఛార్జీల వల్ల యూపీఐ లావాదేవీలు తగ్గుతాయా అని ప్రశ్నించగా, "ప్రస్తుతానికి లావాదేవీల పరిమాణంలో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. ఈ స్వల్ప రుసుము వల్ల వాల్యూమ్‌పై పెద్ద ప్రభావం ఉంటుందని నేను వ్యక్తిగతంగా భావించడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎండీఆర్‌పై నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని, ఇది యూపీఐ వినియోగాన్ని దెబ్బతీయదని ఆయన వివరించారు.

## ‘చల్తా హై’ నుంచి ‘బదల్ సక్తా హై’ దిశగా భారత్: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 7, ట్రైనెట్ న్యూస్:**

ఇటీవలి సంవత్సరాల్లో భారత్ అభివృద్ధి ప్రయాణంలో వచ్చిన కీలక మార్పు---మార్పు సాధ్యమేనన్న బలమైన నమ్మకమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు రాసిన వ్యాసాన్ని బుధవారం ఆయన సోషల్ మీడియా వేదిక ‘ఎక్స్’లో పంచుకున్నారు.

మోదీ నాయకత్వంలో దేశ ఆలోచనా విధానం సంప్రదాయ ‘చల్తా హై’ ధోరణి నుంచి ‘బదల్ సక్తా హై’---మార్పు సాధ్యమేనన్న దృక్పథం వైపు మారిందని వెంకయ్య నాయుడు తన వ్యాసంలో వివరించారు. బ్యాంకింగ్ రంగ సంస్కరణలు, డిజిటల్ చెల్లింపుల విస్తరణ, పేదరిక నిర్మూలనకు చేపట్టిన చర్యలు ఈ మార్పుకు నిదర్శనమని పేర్కొన్నారు. చాలాకాలంగా పరిష్కారం కాని సవాళ్లను సంకల్పంతో ఎదుర్కొని ఫలితాలు సాధించవచ్చని ఈ చర్యలు చూపించాయని తెలిపారు.

‘వికసిత భారత్’ దిశగా దేశ ప్రయాణాన్ని ప్రభావితం చేస్తున్న ఆలోచనా మార్పును వివరించే ఈ వ్యాసం తప్పక




చదవదగినదని ప్రధాని మోదీ తన పోస్టులో పేర్కొన్నారు.

## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంచుతూ రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 2024 నుంచి డీఏను 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచింది. అలాగే జూలై 2024 నుంచి డీఏను 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా 2015 పే స్కేల్ ఉద్యోగులకు కూడా డీఏను 73.344 శాతం నుంచి 78.06 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జూలై 2024 నుంచి 78.06 శాతం నుంచి 81.728 శాతానికి, 2020 పే స్కేల్ ఉద్యోగులకు డీఏను 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచింది. యూజీసీ, ఏఐసీటీఈ పే స్కేళ్ల ఉద్యోగులకు కూడా డీఏ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2016 పే స్కేల్ ఉద్యోగులకు డీఏను 46 శాతం నుంచి 50 శాతానికి, జూలై 2024 నుంచి డీఏను 50 శాతం నుంచి 53 శాతానికి పెంచింది. అలాగే 2006 పే స్కేల్ ఉద్యోగులకు డీఏను 230 శాతం నుంచి 239 శాతానికి, జూలై 2024 నుంచి 239 శాతం నుంచి 246 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

పెంచిన డీఏను అక్టోబర్ 2026 జీతంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. జనవరి 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకాయిలను 33 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లించనుంది. అదే విధంగా జూలై 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకాయిలను 27 వాయిదాల్లో చెల్లింపులు జరుపనుంది. డీఏ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## 15 నిమిషాలు శ్వాస ఆపి ఆశ్చర్యపరిచిన విద్యుత్ జమ్వాల్




**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**

ముంబైలో జరిగిన ‘స్ట్రీట్ ఫైటర్’ ప్రత్యేక కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు విద్యుత్ జమ్వాల్ అందరినీ ఆశ్చర్యపరిచారు. వేదికపై వరుసగా 15 నిమిషాల పాటు శ్వాసను నియంత్రిస్తూ ధ్యానం చేశారు. ధల్సిమ్ పాత్రలో నటిస్తున్న విద్యుత్ యోగా, కలరిపయట్టు వంటి భారతీయ కళల్లో తనకు ఉన్న నైపుణ్యాన్ని ఈ సందర్భంగా చూపించారు. హాలీవుడ్‌లో విద్యుత్ జమ్వాల్‌కు ‘స్ట్రీట్ ఫైటర్’ తొలి చిత్రం. ఇందులో ఆయన ప్రముఖ గేమింగ్ క్యారెక్టర్ ధల్సిమ్ పాత్రను పోషిస్తున్నారు. యోగా ఆయన సూపర్ పవర్‌గా ఉండే ఈ పాత్రకు విద్యుత్ సరిగ్గా సరిపోతారని ఈ కార్యక్రమం ద్వారా మరోసారి నిరూపించారు.

ధల్సిమ్ వేషధారణలో ఉన్న కాస్ప్లేయర్లతో కలిసి విద్యుత్ వేదికపై 15 నిమిషాల పాటు మౌనంగా ధ్యానం చేశారు. అనంతరం తాను పాటంజలి యోగసూత్రాల్లోని ప్రత్యేకమైన పద్ధతిని ఉపయోగించానని తెలిపారు. ఈ టెక్నిక్ ద్వారా 15 నిమిషాల పాటు శ్వాసను నియంత్రించడంతో పాటు జీవితంలో ఎన్నో లక్ష్యాలను సాధించగలిగానని చెప్పారు. ఈ పద్ధతిని యువతకు కూడా నేర్పిస్తున్నట్లు వెల్లడించారు.

“యువతకు నేను ఒక్కటే చెప్పాలనుకుంటున్నాను. కొంతసేపు ఆగండి. అందరూ ఏదో ఒకటి సాధించేందుకు పరుగులు తీస్తున్నారు. కానీ ఒక్కసారి ఆగి, ప్రశాంతంగా ఉండటం నేర్చుకోండి. ఏమీ చేయకుండా కొంత సమయం ఉండండి. ఈ నైపుణ్యం మిమ్మల్ని జీవితంలో చాలా దూరం తీసుకెళ్తుంది. లక్ష్యాలను సాధించడానికి సమయం పడుతుంది. కానీ పట్టుదలతో కొనసాగితే తప్పకుండా విజయం సాధించవచ్చు” అని విద్యుత్ జమ్వాల్ అన్నారు.

పారామౌంట్ పిక్చర్స్ నిర్మాణంలో తెరకెక్కిన ‘స్ట్రీట్ ఫైటర్’ చిత్రం 2026 అక్టోబర్ 16న భారత్‌లో ఇంగ్లిష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది.

## -ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

## -పెట్టుబడులను ఆకర్షించేందుకు సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**

రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, TGIIC వీణ శశాంక, ITE&C సంయుక్త కార్యదర్శి అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ, ఎండీ, అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# పదేళ్ల పవర్ లక్ష్యంగా రేవంత్, మహేశ్ ఫోకస్

**పార్టీ మధ్య సమన్వయానికి ప్రాధాన్యం**
**గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని హైకమాండ్ సూచన**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 07:**

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పదేళ్ల పాటు పవర్లో ఉంచేలా పనిచేయాలని ఇటీవల హైకమాండ్ కూడా రాష్ట్ర పార్టీని ఆదేశించింది. ఇందుకోసం నేతలంతా వ్యక్తిగతాలు పక్కకు పెట్టి, పార్టీ ప్రయోజనాల కోసమే వర్క్ చేయాలని సూచించింది. మాజీ మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ తర్వాత ఏఐసీసీ ఈ ఆదేశాలను స్పష్టంగా రాష్ట్ర పార్టీకి తెలియజేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ వరుసగా రెండుసార్లు గెలిచినఅంశాన్ని హైకమాండ్ గుర్తు చేసింది. ఇదే క్రమంలో 2004, 2009 తిరుగులేని మెజార్టీతో అధికారంలో కి తెచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి, డి.శ్రీనివాస్ జోడీ స్ట్రాటజీని ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం పునరావృతం చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నది. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కాంబినేషన్తో గత ఫార్ములాను రిపీట్ చేస్తూ పవర్లోకి రావాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు. రాష్ట్రంలో రాబోయే పదేళ్లపాటు కాంగ్రెస్ అధికారాన్ని పదిలంగా నిలబెట్టుకోవడమే ఏకైక లక్ష్యంగా వీరిద్దరూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే ఈ ఇద్దరి నేతలకు హైకమాండ్ తాజాగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పదేళ్ల పాటు తెలుగుదేశం పాలనకు చరమగీతం పాడేందుకు గతంలో కాంగ్రెస్ అధిష్టానం ఒక



స్పష్టమైన సమీకరణాన్ని అమలు పరిచింది. రెడ్డి సామాజికవర్గాని కి చెందిన ప్రజాకర్షణ ఉన్న నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అభ్యర్థిగా, సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లిన నేతగా గుర్తింపు పొందితే, బీసీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నేత డి.శ్రీనివాస్ (డీఎస్) పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ యంత్రాంగాన్ని పకడ్బందీగా నడిపించారు. ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న అద్భుతమైన సమన్వయం, ప్రభుత్వపార్టీల మధ్య సత్సంబంధాలు కాంగ్రెస్ ను తిరుగులేని శక్తిగా నిలబెట్టాయి. ప్రభుత్వం వైపు నుంచి వైఎస్సార్ ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువైతే, పార్టీ పరంగా డీఎస్ సామాజిక సమీకరణాలను సమన్వయం చేస్తూ సంస్థాగత బలాన్ని కాపాడారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్లో సరిగ్గా అదే రకమైన సామాజిక, రాజకీయ సమీకరణం పునరావృతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి , మహేశ్ కుమార్ గౌడ్ లు ప్రయత్నం చేస్తున్నారు. మాస్ ఇమేజ్, ఆకట్టుకునే ప్రసంగాలు, నిరంతరం దూకుడుగా ఉండే నాయకత్వంతో రేవంత్ రెడ్డి సీఎంగా ప్రభుత్వాన్ని నడిపిస్తుంటే, మృదు స్వాభావంతో, వివాదరహితం
గా బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ కార్యవర్గాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ నుంచి డీసీసీ అధ్యక్షుల ఎంపిక, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో పార్టీ కేడర్ భాగస్వా మ్యం వరకు ఇద్దరూ డైలీ సంప్రదింపు లు చేస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిసింది. ఎక్కడా పరస్పర విభేదాలకు తావులేకుండా ఒకరికొకరు తగినంత ప్రాధాన్యత ఇచ్చుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పీచ్లు పరిశీలిస్తే ఇదే స్పష్టమవుతున్నది.

## అంతరాలను పూడ్చి, కట్టుబాట్లను నెరవేర్చి, పారిస్ ఒప్పందం అమలును వేగవంతం చేయాలి: భారత్

## అంతల్యా సదస్సు విజయాన్ని అమలు వేగం, అవసరమైన వారికి అందే మద్దతు, పరిష్కారాల విస్తరణతో కొలవాలి: భూపేందర్ యాదవ్




**న్యూఢిల్లీ, అక్టోబరు 7, ట్రైనెట్ న్యూస్:**

వాతావరణ మార్పులపై అవగాహనలో ఉన్న అంతరాలను గుర్తించి పూడ్చడం, ఇప్పటికే చేసిన కట్టుబాట్లను నెరవేర్చడం, పారిస్ ఒప్పందం అమలును వేగవంతం చేయడంపై జూ్రా31 దృష్టి పెట్టాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. ఫిజీలో ఆస్ట్రేలియా, ఫిజీ, టువాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల చట్ర ఒప్పందం (ఖచీఖీజ-జజ) ప్రీ-జూ్రా31 సమావేశంలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. భారత ప్రతినిధి బృందానికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు.

వాతావరణ మార్పుల సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటున్న టువాలు ప్రజల సంకల్పాన్ని యాదవ్ కొనియాడారు. వారు విజయవంతమైన నమూనాను చూపిస్తూ, వాతావరణ మార్పులపై ఐక్యంగా పోరాడేందుకు ఆశ, విశ్వాసం, నిబద్ధతను పెంచుతున్నారని అన్నారు.

UNFCCC, పారిస్ ఒప్పందం కింద ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలనే లక్ష్యంతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలు ఇప్పటికే నిర్దేశించబడ్డాయని మంత్రి తెలిపారు. ఆ లక్ష్యాలను సాధించాలంటే తగిన అమలు సాధనాలు, వనరులు అవసరమని, వాటిని అందుబాటులోకి తెచ్చి లక్ష్యాల దిశగా ప్రయాణాన్ని ఎలా వేగవంతం చేయాలన్నదే ఇప్పుడు ప్రధానమని పేర్కొన్నారు.

జూ్రా31 అధ్యక్షత వహించే దేశాలు ఏకాభిప్రాయం, నిర్ణయాలు, అమలుపై దృష్టి పెట్టడాన్ని ప్రస్తావిస్తూ, వాతావరణ బహుపాక్షికత దిశ, దీర్ఘకాలిక లక్ష్యాలపై విస్తృత ఏకాభిప్రాయం ఉందని యాదవ్ చెప్పారు. అయితే శాస్త్రీయ పరిజ్ఞానం, సంప్రదాయ జ్ఞానం, సమాజాల ఆచరణల మధ్య; ఆచరణలకు, నైతికతకు మధ్య; అందుబాటులో ఉన్న వనరులకు, ప్రజల అవసరాలకు మధ్య ఉన్న అంతరాలను గుర్తించి, వాటిపై ఏకాభిప్రాయం సాధించాలని అన్నారు. ఈ అవగాహన అంతరాలను పూడ్చేందుకు జూ్రా31 కృషి చేయాలని సూచించారు.

UNFCCC, పారిస్ ఒప్పందం కింద దేశాలు చేసిన కట్టుబాట్లను అక్షరాలా, స్ఫూర్తితో నెరవేర్చడమే పార్టీల ముందున్న కీలక బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ప్రతి దేశం తన బాధ్యతలను నెరవేర్చేందుకు అవసరమైన సహకారం అందించాలని అన్నారు. అవసరం ఎక్కువగా ఉన్న చోట, ఫలితాలు ప్రజలకు స్పష్టంగా కనిపించే రంగాల్లో అమలులోని లోటుపాట్లను పరిష్కరించాలన్నారు. సామర్థ్య నిర్మాణానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, అధిక ప్రభావం చూపే ఉద్గారాల తగ్గింపు, విస్తృత స్థాయి అనుసరణ చర్యలు, అమలుకు అవసరమైన వనరుల సమర్థ పంపిణీకి సంబంధించిన విజయవంతమైన ఉదాహరణలను దేశాలు ప్రతి ఏడాది పంచుకోవాలని పిలుపునిచ్చారు.

ఇలాంటి విజయవంతమైన నమూనాలను నిరంతరం పంచుకుంటూ విస్తరించడం ద్వారా పారిస్ ఒప్పంద లక్ష్యాల సాధనలో క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు వస్తాయని యాదవ్ తెలిపారు.

అంతల్యాలో జరిగే జూ్రా31 విజయాన్ని కొత్త లక్ష్యాలు లేదా ప్రకటనలతో మాత్రమే కొలవకూడదని, అమలు వేగవంతమైందా, అవసరమైన వారికి మద్దతు చేరిందా, ఇప్పటికే ఉన్న పరిష్కారాలను విస్తృత స్థాయికి తీసుకెళ్లగలిగామా అనే అంశాలే ప్రమాణాలని స్పష్టం చేశారు.

ఏటా జరిగే ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల సదస్సుకు కొన్ని వారాల ముందు ప్రీ-జూ్రా సమావేశం నిర్వహిస్తారు. ఈ ఏడాది ప్రధాన సదస్సు నవంబరులో టర్కియేలోని అంతల్యాలో జరగనుంది.

## ఎల్‌నినో ప్రభావం యాసంగిలో వరి బదులు ఆరుతడి పంటలే మేలు

## భూగర్భ జలాలను బట్టే పంట ఎంపిక;

**-వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులకు వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ సూచన**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ , అక్టోబర్ 7:**

ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాలు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నందున, రానున్న యాసంగిలో రైతులు వరికి బదులు తక్కువ నీటితో పండే పంటల వైపు మళ్లేలా చూడాలని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రబీ 2026-27 కార్యాచరణ ప్రణాళికపై ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి లభ్యత తక్కువగా ఉండే పరిస్థితుల్లో వరి సాగు రైతులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలతో పాటు మంచి ఆదాయాన్నిచ్చే కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రైతూ తన ప్రాంతంలోని భూగర్భ జలాల లభ్యతను చూసుకున్న తరువాతే పంటను ఎంచుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**వాతావరణ అంచనాలు**

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్త ఈ యాసంగిలో ఎల్‌నినో వల్ల వాతావరణంలో



చోటుచేసుకునే మార్పులు, వర్షపాత స్థితి, ఉష్ణోగ్రతల అంచనాలను అధికారులకు వివరించారు. శాస్త్రవేత్తల సూచనలు

కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ (క్రిడా) శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన చర్యలను వివరిస్తూ, భూగర్భ జలాల లభ్యత ఆధారంగానే పంటల ఎంపిక, సాగు జరగాలని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలమట్టాలను దృష్టిలో ఉంచుకుని వరికి బదులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. పప్పుధాన్య, నూనెగింజల, కూరగాయల పంటలకు అనువైన విత్తన కాలాలను కూడా వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు ఈ సీజన్‌లో రైతులు సాగు చేయడానికి అనువైన పంట రకాలను సిఫార్సు చేశారు.

విత్తనాలు, ఎరువుల సరఫరాపై సమీక్ష

యాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో, సరిపడా అందుబాటులో ఉండేలా సరఫరా పరిస్థితిని కూడా కమిషనర్ సమీక్షించారు. రాష్ట్రంలో 2025-26లో 26 జిల్లాల్లో నత్రజని (చీ), భాస్వరం (ూ) ఎరువుల వినియోగ నిష్పత్తులు జాతీయ సగటు (9.7 : 3.7 : 1) కంటే అధికంగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు మాత్రమే ఎరువులను వినియోగించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఉద్యానవన శాఖ సంచాలకులు డాక్టర్ యాస్మీన్ బాషా, ఐ.ఏ.ఎస్. పాల్గొన్నారు. వీరితో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు; ఇక్రిశాట్, క్రిడా, ఐఎండీ, ఐఐఆర్ఆర్, ఐఐఎంఆర్, ఐఐఓఆర్ సంస్థల శాస్త్రవేత్తలు; ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయాలకు చెందిన శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయ అధికారులు జిల్లా ఉద్యానవన అధికారులు మార్కెటింగ్ మరియు సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
గురువారం, అక్టోబర్,08, 2026
www.trinetnews.com

## సెంట్రల్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలిగా భాగ్యలక్ష్మి ....

### – పార్టీ బలోపేతానికి కృషి : సిహెచ్ భాగ్యలక్ష్మి....



**ట్రైనెట్ న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 07:**
బీజేపీ సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలిగా సీహెచ్.భాగ్యలక్ష్మి నియ మితులయ్యారు. ఈ మేరకు బుధవారం పార్టీ రాష్ట్ర అధ్య క్షుడు రామచంద్రరావు, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శి ల్పారెడ్డి ఈ నియామకాన్ని ప్రకటించా రు. ఈ సందర్భంగా భాగ్య లక్ష్మి మాట్లా డుతూ తనపై నమ్మ కం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, మహిళా మోర్చా రాష్ట్ర అధ్య క్షురాలు శిల్పారెడ్డి, సిటీ మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి నల్లకుంట మా జీ కార్పొరే టర్ వై. అమృతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతా నికి, మహిళా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తా నని ఆమె పేర్కొ న్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగ్యలక్ష్మికి అభినందనలు తెలిపారు.

## ఆర్టీఐతో పారదర్శక పాలన

### –తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**
సమాచార హక్కు చట్టం ద్వారానే పారదర్శక పాలన అందుతుందని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాలభూపాల్అన్నారు. అధికారులుజవాబుదారీతనంగా వెళ్లాలని, తద్వారా దేశంలో అవినీతి నిర్మూలించబడుతుందన్నారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం --2005 ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సు బుధవారం రవీంద్ర భారతి వేదికగా ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమాన్ని జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్
అధ్యక్షతన వహించగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం--2005 ప్రాధాన్యత, ప్రజలకు సమాచారం పొందే హక్కు, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత జవాబుదారీతనం పెంపొందించడంలో ఆర్టీఐ చట్టం పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, నియోజకవర్గ మరియు గ్రామ స్థాయి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆర్టీఐపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రజల హక్కులకు సంబంధించిన సమస్యలపై నిరంతరం 24ఐ7 పనిచేస్తూ ప్రజా చైతన్యం కోసం కృషి చేస్తోందని జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ తెలిపారు. “ఆర్టీఐ కోసం మా సంస్థ కార్యక్రమం ఒకరోజుకే పరిమితం కాదు... ప్రజల హక్కుల కోసం నిరంతరం 24ఐ7 పనిచేస్తూనే ఉంటాం ” అని డా. చంటి ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ ఉపాధ్యక్షులు గోపీనాథన్ కట్టెకోల, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, రాధ కృష్ణ,జాతీయ సహాయ కార్యదర్శులు అన్నవరం సందీప్ రెడ్డి, వంగల వివేకానంద, మార్క నవీన్ కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ మహేష్, రాష్ట్ర లీగల్ వింగ్ కార్యనిర్వాహక అధ్యక్షులు రవి కుమార్, రాష్ట్ర కన్వీనర్ కిఫాయత్, అధికార ప్రతినిధి సతీష్ కుమార్, కో కన్వీనర్ కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## భారత్--ఘనా మధ్య వ్యవసాయ పరిశోధనపై చారిత్రక ఒప్పందం

### పంట దిగుబడులు, పంట అనంతర మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
వ్యవసాయ పరిశోధన, విద్య, సాంకేతిక పరిజ్ఞాన బదిలీలో సహకారాన్ని విస్తరించేందుకు భారత్, ఘనా కీలక ఒప్పందం చేసుకున్నాయి. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్), ఘనాలోని క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఐఆర్--సీఆర్ఐ) మధ్య ఐదేళ్ల కాలపరిమితితో కూడిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఒప్పంద సంతకాల కార్యక్రమంలో భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, ఘనా విదేశాంగ మంత్రి శామ్యూల్ ఒకుడ్జెటో అబ్లక్వా పాల్గొన్నారు.
సంయుక్త వ్యవసాయ పరిశోధన, శాస్త్రసాంకేతిక మార్పిడి, సామర్థ్య నిర్మాణం, వ్యవసాయ సాంకేతికతల అనువర్తనం, వాణిజ్యీకరణకు ఈ ఒప్పందం మార్గం కల్పించనుంది. నిర్దిష్ట పరిశోధన, వాణిజ్యీకరణ కార్యక్రమాల్లో సీఎస్ఐఆర్--సీఆర్ఐ వాణిజ్య భాగస్వామిగా ఘనాకు చెందిన అరీమా ఫార్మ్స్ లిమిటెడ్ వ్యవహరించనుంది.
తొలి దశలో కూరగాయల పంటల పరిశోధనపై, ముఖ్యంగా టమాటా అభివృద్ధిపై దృష్టి సారిస్తారు. ఇప్పటికే నిరూపితమైన వ్యవసాయ సాంకేతికతలను విస్తరించేందుకు, అధిక దిగుబడినిచ్చే అనువైన టమాటా రకాలను ఘనాలో పరిచయం చేసేందుకు ఐసీఏఆర్ సహకరిస్తుంది. దీంతో ఆ దేశంలో టమాటా ఉత్పత్తిని బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
కసావా, యామ్ తదితర దుంప పంటల ప్రాసెసింగ్, విలువ జోడింపుతో పాటు కోత అనంతర నిర్వహణపైనా భాగస్వామ్యం కొనసాగుతుంది. శీతల గిడ్డంగులు, శీతలీకరణ రవాణా, పంటల వర్గీకరణ, గ్రేడింగ్, ప్రాసెసింగ్ సాంకేతికతల్లో శిక్షణ, సాంకేతిక సహాయం అందించనున్నారు. తద్వారా పంట కోత అనంతర నష్టాలను తగ్గించడమే లక్ష్యం.
శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల మార్పిడి, జన్యు వనరులు, అభివృద్ధి పదార్థాలు, శాస్త్రీయ సమాచారం, పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం, ఉమ్మడి పరిశోధనా ప్రాజెక్టుల అమలుకు కూడా ఎంఓయూలో అవకాశం కల్పించారు. ఇరు దేశాల పరిశోధనా సంస్థలు, కేంద్రాల మధ్య సంస్థాగత అనుసంధానాన్ని బలోపేతం చేయనున్నారు.
ఐసీఏఆర్, సీఎస్ఐఆర్--సీఆర్ఐ ప్రతినిధులతో కూడిన సంయుక్త కార్యాచరణ బృందం సహకార పురోగతిని సమీక్షించి అమలుకు మార్గనిర్దేశం చేస్తుంది. ఈ బృందం న్యూఢిల్లీ, అక్రాలో కాలానుగుణంగా సమావేశమవుతుంది. వ్యవసాయ పరిశోధనను సాంకేతిక అభివృద్ధి, శిక్షణ, వాణిజ్య అనువర్తనంతో అనుసంధానించే ఈ భాగస్వామ్యం ఘనాలో స్థిరమైన వ్యవసాయాభివృద్ధికి, రైతుల జీవనోపాధి మెరుగుదలకు దోహదపడుతుందని భావిస్తున్నారు.

## సామాజిక బహిష్కరణలపై రాష్ట్ర బీ.సీ కమిషన్ కు ఫిర్యాదులు



**నిజామాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 07 :**
సామాజిక బహిష్కరణ ఉదంతాలపై తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కూడిన బృందం బుధవారం నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధితులతో భేటీ అయ్యింది. ఐ.డీ.ఓ.సీకి చేరుకున్న కమిషన్ ప్రతినిధులను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాంఘిక, కుల బహిష్కరణలకు గురైన బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కమిషన్ చైర్మన్, సభ్యులకు లిఖితపూర్వకంగా విజ్ఞాపనలు సమర్పించారు. బాధితులు నిర్భీతితో, స్వేచ్ఛగా వారి అభిప్రాయాలను వెల్లడించేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశారు. దీంతో జిల్లాలోని ఆయా ప్రాంతాలలో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట కొనసాగుతున్న అరాచకాల గురించి, సామాజిక బహిష్కరణ ఘటనలను బాధితులు కమిషన్ కు ఏకరువు పెట్టారు. బీసీ కుల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు, ప్రజా సంఘాల ప్రతినిధులు సైతం హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్ కు అందిస్తూ, మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. సాంఘిక బహిష్కరణలపై ఫిర్యాదులు సమర్పించేందుకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

## అన్నపూర్ణ నిలయం శ్రీవారి క్షేత్రం
## ఆకలికి చోటే లేని పవిత్ర స్థలం తిరుమల

**-రోజుకు దాదాపు 3 లక్షల మంది భక్తులకు ఉచితంగా అన్నప్రసాదం**
**-15.8 టన్నుల బియ్యంతో నిత్యం మహాయజ్ఞంలా కొనసాగుతున్న అన్నప్రసాద సేవ**
**-2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 9 కోట్లకు పైగా సర్వింగ్స్**
**-ఆధునికీకరణతో మరింత విస్తరిస్తున్న టీటీడీ అన్నప్రసాద సేవలు**
**-శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.2900 కోట్లు దాటిన విరాళాలు**







**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 07:**
“వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన, వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి” అన్న దైవ స్తోత్రానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచే తిరుమల పుణ్యక్షేత్రం భక్తుల ఆకలి తీర్చే అన్నపూర్ణ నిలయంగా భాసిల్లుతోంది. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనానికి దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు శ్రీవారి కృపతో పాటు టీటీడీ నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద సేవ అక్షయ పాత్రలా కొనసాగుతోంది.
తిరుమలలో ఆకలితో ఉన్న భక్తుడికి అన్నం అందించడమే లక్ష్యంగా టీటీడీ అన్నప్రసాదం విభాగం 24 గంటలూ నిరంతరం పనిచేస్తోంది. సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుండగా, రద్దీ రోజులు, వారాంతాల్లో ఈ సంఖ్య 3 లక్షలకు మించుతోంది. పానీయాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కలిపి రోజుకు దాదాపు 3 లక్షల సర్వింగ్స్ భక్తులకు అందుతున్నాయి.
1985లో ప్రారంభమైన మహత్తర అన్నదాన సేవ
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు సంకల్పంతో 1985 ఏప్రిల్ 6న తిరుమలలో శ్రీ వేంకటేశ్వర నిత్యాన్నదాన పథకం ప్రారంభమైంది. అనంతరం 1994 ఏప్రిల్ 1న ఈ పథకాన్ని ట్రస్టుగా మార్చారు. ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సేవలు మరింత విస్తృతంగా కొనసాగుతున్నాయి. తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను విస్తరిస్తున్నారు.
మూడు ప్రధాన వంటశాలల్లో 24 గంటల సేవ
తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, శ్రీ అక్షయ వంటశాల, వకుళమాత వంటశాలలు 24 గంటలూ పనిచేస్తూ భక్తులకు ఆహారాన్ని అందిస్తున్నాయి. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో రోజుకు 80 వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందుతోంది. ఇక్కడ ఉదయం ఉప్మా, పొంగలి, చట్నీ, సాంబార్ వంటి అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి అన్నం, కూర, చట్నీ, వడ, సాంబార్, రసం, మజ్జిగ, స్వీట్ పొంగల్ తదితర పదార్థాలను భక్తులకు వడ్డిస్తున్నారు. శ్రీ అక్షయ వంటశాలలో గోధుమ రవ్వ ఉప్మా, సుజీ రవ్వ ఉప్మా, పొంగలి, సాంబారన్నం, పెరుగన్నం, టమోటా రైస్, సుండలు, పాలు, టీ, కాఫీ తదితరాలను తయారు చేస్తున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే పర్వదినాల్లో మజ్జిగ, బాదం పాలు, బిస్కెట్లు, జ్యూస్ ప్యాకెట్లను కూడా పంపిణీ చేస్తున్నారు.
వకుళమాత వంటశాల ద్వారా యాత్రికుల వసతి సముదాయాలు, కేంద్రీయ విచారణ కార్యాలయం, రామ్‌భగీచా అతిథి గృహం, అంజనాద్రి నిలయం తదితర ప్రాంతాల్లోని భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీచేస్తున్నారు. క్యూలైన్లలోనూఅన్నప్రసాదంవైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులతో పాటు నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్ల వెలుపల ఏర్పాటు చేసిన కేంద్రాలు, పీఏసీ అన్నప్రసాద భవనాలు, వివిధ వసతి సముదాయాల్లోని భోజనశాలల ద్వారా భక్తులకు ఆహారం, పానీయాలు అందిస్తున్నారు. భక్తులు దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉన్న సమయంలో కూడా ఆకలితో ఇబ్బంది పడకుండా చూడటమే టీటీడీ అన్నప్రసాద విభాగం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది.
రోజుకు 15.8 టన్నుల బియ్యం వినియోగం
లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు టీటీడీ ప్రతిరోజూ భారీ స్థాయిలో ముడి పదార్థాలను వినియోగిస్తోంది. రోజుకు సుమారు 15,788 కిలోల బియ్యం, 3,110 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్, 2,861 కిలోల కందిపప్పు, 2,832 కిలోల సుజీ రవ్వ, 2,825 కిలోల గోధుమ రవ్వ, 1,729 కిలోల మినప్పప్పు, 1,436 కిలోల ఉప్పు, 1,276 కిలోల బెల్లం, 497 కిలోల చింతపండు వినియోగిస్తున్నారు. అదేవిధంగా రోజుకు సుమారు 4,375 కొబ్బరికాయలు, 430 కిలోల చక్కెర, 309 కిలోల ఎండు మిర్చి, 209 కిలోల ధనియాలు తదితర ముడి పదార్థాలను ఉపయోగిస్తున్నారు.
2026 జనవరి--సెప్టెంబర్ వరకు 9 కోట్లకు పైగా సర్వింగ్స్2026 జనవరి 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు తిరుమలలోని వివిధ అన్నప్రసాద కేంద్రాల ద్వారా 9 కోట్లకు పైగా సర్వింగ్స్ భక్తులకు అందించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు తాజాగా నాణ్యమైన, రుచికరమైన అన్న ప్రసాదాలు తయారు చేస్తూ భక్తులకు పంపిణీ చేయడం జరుగుతోంది.
ఆధునికీకరణతో మరింత విస్తరణ
భక్తులకు అందించే అన్నప్రసాదం నాణ్యతను పెంచడంతో పాటు సేవలను మరింత విస్తరించేందుకు టీటీడీ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. చట్నీలు, కూరల తయారీలో తాజా కొబ్బరికాయల వినియోగాన్ని ప్రవేశపెట్టింది. 2024లో వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ప్రారంభించి అదనంగా 28 ప్రాంతాలకు ఆహార పంపిణీ సేవలను విస్తరించింది. ఏడాది ముందు ప్రారంభించిన పీఏసీ -5 (వెంకటాద్రి నిలయం)లో ఒకేసారి సుమారు 1,500 మంది భోజనం చేసే సామర్థ్యంతో డైనింగ్ హాళ్లు అందుబాటులో ఉన్నాయి. రోజుకు 2 లక్షల మంది భక్తులకు ఆహారం తయారు చేయగల సామర్థ్యంతో కొత్త శాటిలైట్ ఆటోమేటెడ్ కిచెన్ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి.
ఎంటీవాక్ కిచెన్‌లో ఆధునిక వంట పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు, భక్తులు సులభంగా విరాళాలు అందించేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత విరాళాల సేకరణ కియోస్క్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.
అన్నప్రసాద సేవకు భక్తుల విరాళాలే ఆధారం
భక్తుల విరాళాలతో నిర్వహించబడుతున్న శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ వద్ద ప్రస్తుతం రూ.2900 కోట్లకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ నిధులపై వచ్చే ఆదాయంతో లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచితంగా నాణ్యమైన అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. “అన్నదానం మహాదానం” అనే భారతీయ సనాతన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ టీటీడీ నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమం భక్తుల సేవలో ఒక మహత్తర ఆధ్యాత్మిక సేవగా నిలుస్తోంది.
చెరో వెయ్యి మంది అన్న ప్రసాదం సిబ్బంది, శ్రీవారి సేవకుల నిరంతర కృషి
లక్షలాది మంది భక్తులకు ఎటువంటి అంతరాయం లేకుండా అన్నప్రసాదాన్ని అందించేందుకు సుమారు వెయ్యి మందికి పైగా అన్నప్రసాద విభాగం సిబ్బంది, మరో వెయ్యి మందికి పైగా శ్రీవారి సేవకులు నిరంతరం సేవలందిస్తున్నారు. ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు, క్యూలైన్లలోని భక్తుల నుంచి వసతి సముదాయాల్లోని యాత్రికుల వరకు ప్రతి ఒక్కరికీ ఆహారం అందేలా సమన్వయంతో పనిచేస్తున్నారు. శ్రీవారి సన్నిధికి వచ్చే ప్రతి భక్తుడు కడుపు నిండా భోజనం చేసి తృప్తిగా స్వామివారి దర్శనం చేసుకోవాలన్న సంకల్పంతో టీటీడీ కొనసాగిస్తున్న ఈ అన్నప్రసాద సేవ తిరుమలను నిజమైన “అన్నపూర్ణ నిలయం”గా నిలబెడుతోంది.
శ్రీవారి క్షేత్రంలో ఆకలితో వచ్చే భక్తుడికి అన్నం అందించడం కేవలం సేవ మాత్రమే కాదు--- భక్తుడిలో భగవంతుడిని చూసే భారతీయ సనాతన సంప్రదాయానికి ప్రత్యక్ష ప్రతిరూపం.

## శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### – అక్టోబరు 11 నుండి 20వ తేదీ వరకు శ్రీ కామాక్షి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు








**తిరుపతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**
తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో అక్టోబరు 11 నుండి 20వ తేదీ వరకు శ్రీ కామాక్షి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం నిర్వహించారు. ఆ తరువాత ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఈ సందర్భంగా గర్భాలయం, ధ్వజస్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు.
ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**శ్రీ కామాక్షి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు**

శ్రీ కామాక్షి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు అక్టోబరు 11 నుండి 20వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా శ్రీ కామాక్షి అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకోసం ఆలయంలో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని అక్టోబరు 11న సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, నవ కలశ స్థాపన, వాస్తుపూజ నిర్వహిస్తారు. ప్రతి రోజూ ఉదయం 9 - 10 గం.ల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అదేవిధంగా, ఊంజల్ సేవలో భాగంగా అక్టోబరు 11న శ్రీ కామాక్షి దేవి, అక్టోబరు 12న మావడి సేవ అలంకారం, అక్టోబరు 13న శ్రీ ఆదిపరాశక్తి, అక్టోబరు 14న శ్రీ గాయత్రి అలంకారం, అక్టోబరు 15న శ్రీ తపః కామాక్షి అలంకారం, అక్టోబరు 16న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు, అక్టోబరు 17న శ్రీఅన్నపూర్ణాదేవి, అక్టోబరు 18న శ్రీ మహిషాసురమర్ధిని, అక్టోబరు 19న శ్రీ సరస్వతి దేవి, అక్టోబరు 20న శ్రీ శివపార్వతుల అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 20న చివరిరోజు శ్రీ అభయహస్త ఆంజనేయస్వామివారి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు పార్వేట ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భక్తి సంగీతం, దేవి భాగవతంపై పురాణ ప్రవచనం, లలితసహస్రనామ పారాయణం కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# వెంకటాపూర్ లో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం - ప్రారంభించిన భైంసా ఏఎస్పీ సాయి కిరణ్








అక్టోబర్ 07 (ట్రైనెట్ న్యూస్)

ముధోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ప్రారంభించారు.

గ్రామంలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు, ప్రజలకు మరింత భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, గ్రామంలోకి వచ్చే, బయటకు వెళ్లే మార్గాలను కవర్ చేసే విధంగా కెమెరాలను అమర్చారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల భాగస్వామ్యంతో వినియోగించడం ద్వారా గ్రామాల్లో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఏదైనా నేరం లేదా అనుమానాస్పద ఘటన జరిగినప్పుడు సీసీ దృశ్యాలుపోలీసులదర్యాప్తుకుఎంతో ఉపయోగపడతా యని, అంతేకాకుండా నేరాల నివారణకు కూడా దోహదపడతాయని పేర్కొన్నారు.

వెంకటాపూర్ గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించడం అభినందనీయమని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

గ్రామాల్లో భద్రతా చర్యలను బలోపేతం చేయడంలో ప్రజలు, పోలీసుల సమన్వయం కీలకమని, ఇదే విధంగా ఇతర గ్రామాల ప్రజలు కూడా తమ ప్రాంతాల భద్రత కోసం ముందుకు రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బాసర ఎస్హెచ్ఓ పెర్సిస్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ం

# ఆక్రమించిన స్మశానం భూమిని ప్రభుత్వం తరపున స్వాధీనం చేసుకున్న తహశీల్దార్ కె.చిరంజీవి



అక్టోబర్ 07 (ట్రైనెట్ న్యూస్)

మార్కాపురం జిల్లా, మార్కాపురం మండలం, చింతగుంట్ల గ్రామములోని సర్వే నెం.219 నందు ఎ.0.49 సెంట్లు స్మశానం భూమిని అదే గ్రామానికి చెందిన పిట్టమళ్ళ ఆంజనేయులు తండ్రి పెద్ద ఆవులయ్య అనువారు ఆక్రమించారు. ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం, 1905 ప్రకారం ఆక్రమణదారునికి నోటీసులు/ఉత్తరువులు ముందుగానే జారీ చేసినప్పటికీ ఎలాంటి సమాధానం రాలేదు. ఆక్రమణదారునిని సదరు స్మశానం నుండి తొలగించి, జెసిబి సహాయముతో గాడి కొట్టించి అట్టి స్మశాన భూమిని ప్రభుత్వం తరపున తహశీల్దార్ కె.చిరంజీవి స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములును ఆక్రమస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు.

# అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి అండగా నిలిచిన చిలకలగూడ పోలీసులు

అక్టోబర్ 07 (ట్రైనెట్ న్యూస్)



అనారోగ్యంతో రోడ్డుపై నిస్సహాయ స్థితిలో పడివున్న ఓ వ్యక్తిని చేరదీసి చిలకలగూడ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. గత నెల 23న గాంధీ ఆసుపత్రి మెట్రో స్టేషన్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఓ వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కనిపించాడు. వెంటనే సిబ్బంది అతడి వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీయగా, తన పేరు వెంకటేశం (55) అని, మంచిర్యాల జిల్లాకు చెందినవాడినని తెలిపాడు. తనకు భార్య కనకమహాలక్ష్మి, కుమారుడు సతీష్, కుమార్తె శిరీష ఉన్నట్లు వెల్లడించాడు.

దీంతో చిలకలగూడ ఎస్ హెచ్ వో వలిశెట్టి రామకృష్ణ ఆదేశాల మేరకు పోలీసులు వెంకటేశాన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించినప్పటికీ, అతని మానసికంగా ప్రవర్తన సరిగ్గా లేని కారణంగా వారు ఆసుపత్రికి రావడానికి నిరాకరించారు. చికిత్స పూర్తయిన తర్వాత బాధితుడి విజ్ఞప్తి మేరకు, ఎస్ హెచ్ వో వలిశెట్టి రామకృష్ణ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ పూస శ్రీనివాస్ ,ASI దామోదర్ రెడ్డి,సిబ్బంది అతడిని బోయగూడలోని మిషనరీస్ ఆఫ్ చారిటీ ఆశ్రమానికి తరలించి ఆశ్రయం కల్పించారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో వైద్యం, ఆశ్రయం కల్పించిన పోలీసులను స్థానికులు అభినందించారు.

# ఈనెల 17న జిల్లా స్థాయి పద్మశాలి ప్రతిభా పురస్కార్ - 2026 అందజేత



అక్టోబర్ 07 (ట్రైనెట్ న్యూస్)

తొర్రూరు పట్టణ పద్మశాలి సంఘం అనుబంధ సంస్థ మండల పోపా ఆధ్వర్యంలో మానుకోట జిల్లా స్థాయిలో 18 మండలాల ప్రతిభ కలిగిన పద్మశాలి విద్యార్థినీ, 2026 సంవత్సరపు పద్మశాలి పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘం బాధ్యులు జిల్లా పోపా కమిటీ అధ్యక్షులు బుదారపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా మాట్లాడుతూ.పీజీ మెడిసిన్ ఎంబిబిఎస్,బిహెచ్ఎంఎస్, బి.డి.ఎస్ ఐ.ఐ.టి ట్రిపుల్ ఐటి, వారికి మరియు ఇంటర్, 10వ తరగతిలో ఉత్తమ గ్రేడులు సాధించిన ప్రతిభావంతులైన పద్మశాలి విద్యార్థినీ, విద్యార్థులకు 2026 లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు, రాష్ట్ర స్థాయి క్రీడా పథకాలు సాధించిన వారికి "పద్మశాలి ప్రతిభా పురస్కార్- 2026" కార్యక్రమమును ఈనెల 17 శనివారం రోజున ఉదయం 10:00 గంవలకు నితిన్ భవన్ (వందేమాతరం ఫౌండేషన్) తొర్రూరు నిర్వహించబడుతుందని తెలిపారు.ఇట్టి కార్యక్రమములో జిల్లా వివిధ మండలాలలోని పద్మశాలి సంఘ బాధ్యులు, పోపా బాధ్యులు, అనుబంధ సంఘాల బాధ్యులు, కుల బాంధువులు , ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు, మేధావులు విద్యార్థినీ, విద్యార్థులు, ఇదే ఆహ్వానముగా భావించి అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయలని కోరారు. పురస్కారం పొందగోరే అభ్యర్థులు మార్కుల మెమో, ర్యాంక్ కార్డ్ జిరాక్స్ , బయోడెటా, పాస్ ఫోర్ట్ సైజ్ ఫోటో ఈనెల 15 గురువారం సా॥ 5 గం॥ల లోపు సెల్: 9441670810, 9441055082, 9440672321 నెంబర్లకు వాట్సప్ ద్వారా పంపించాలన్నారు. లేదా తొర్రూరు సంధ్య ప్రింటర్స్ – , మహాలక్ష్మి క్లాత్ స్టోర్స్ – తొర్రూరు లో జిరాక్స్ కాపీలు అందజేయాలని అన్నారు.

ఇట్టి సందర్భంగా తొర్రూరు లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో జిల్లా పోపా కమిటీ అధ్యక్షులు బుదారపు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతిభ కలిగిన పద్మశాలి విద్యార్థినీ విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మండల పోపా బాధ్యులు కొండ్లె యాకన్న, చందా రవీంద్ర కుమార్, జంజిరాల రవీందర్, వేముల జగన్, దాసరి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో భోంస్లే నారాయణ్ రావు పటేల్ భేటీ

## రబీకి ముందే విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయాలని వినతి

అక్టోబర్ 07 (ట్రైనెట్ న్యూస్)

ముధోల్ నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణ్ రావు పటేల్ బుధవారం.తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ భేటీలో ముధోల్ నియోజకవర్గంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో పత్తి, సోయా, కంది తదితర పంటల సాగు పరిస్థితులను మంత్రికి వివరించారు. ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అకాల వర్షాలు, తెగుళ్ల కారణంగా దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రానున్న రబీ సీజన్ దృష్ట్యా రైతులకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని కోరారు. గత సీజన్ లో యూరియా, డీఏపీ కొరతతో రైతులు ఇబ్బందులు పడ్డారని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, యూరియాతో పాటు అవసరమైన అన్ని రకాల ఎరువులను సబ్సిడీపై అందుబాటులో ఉంచేలా చూడాలని వినతిపత్రం అందజేశారు.

అదేవిధంగా భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మద్దతు ధరల అమలు, సహకార సంఘాల ద్వారా రుణాల మంజూరు, రైతు భరోసా పథకం అమలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించేలా



అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూస్తామని, ముధోల్ నియోజకవర్గ రైతుల సమస్యలపరిష్కారానికిప్రత్యేకచర్యలుతీసుకుంటామని హామీ ఇచ్చినట్లు భోంస్లే నారాయణ్ రావు పటేల్ తెలిపారు.

# న్యూ కంజర్ భూ సమస్యలకు త్వరలో పరిష్కారం

- చామన్‌పల్లిలో రీ-సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

అక్టోబర్ 07 (ట్రైనెట్ న్యూస్)

లక్ష్మణచందా మండలం న్యూ కంజర్, చామన్‌పల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం పర్యటించి భూ సమస్యలు, రీ-సర్వే పనుల పురోగతిని పరిశీలించారు.

ముందుగా న్యూ కంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు, గ్రామస్తులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో భూముల పట్టాలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో గ్రామస్తుల సహకారం కీలకమని పేర్కొన్నారు. భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భూముల పట్టాలకు సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. గ్రామస్తుల





సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు చొరవతో పరిష్కరించాలని ఆదేశించారు.

అనంతరం చామన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ-సర్వే పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలి ఉన్న కమతాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన రీ-సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రీ-సర్వేలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే బృందం సిబ్బంది పర్యవేక్షణలో, సంబంధిత భూ కమతాల రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని



అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో వనజ, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, లక్ష్మి, ఉప సర్పంచ్‌లు ముత్యం, గంగారెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

## ధ్రువీకరణ పత్రాల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

అక్టోబర్ 07 (ట్రైనెట్ న్యూస్)

నిర్మల్ జిల్లాలో 89 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు, అర్హతల పరిశీలన, ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియలో అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రతి దశను పారదర్శకంగా



నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను పకడ్బందీగా పరిశీలించాలని, ఎలాంటి సందేహాలకు అవకాశం లేకుండా అవసరమైన స్థాయిల్లో పత్రాలను మరోసారి ధ్రువీకరించుకోవాలని ఆదేశించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించిన సమాచారం, తదుపరి దశల వివరాలను దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హత పత్రాల పరిశీలనను పూర్తి చేయాలని తెలిపారు. అంగన్వాడీ టీచర్ల భర్తీ



ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే, పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, భర్తీ చేయిస్తామని చెప్పే వ్యక్తులకు ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని ఆయన సూచించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించి అధికారిక సమాచారం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, సీడీపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలి

- గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలి
- వైఎస్ఆర్ సీపీ క్యాడర్‌కు ఐడీ కార్డుల పంపిణీ

అక్టోబర్ 07 (ట్రైనెట్ న్యూస్)



స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామస్థాయిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

జగ్గయ్యపేట నియోజకవర్గం జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సన్నాహకాలు, నాయకులు మరియు కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై పార్టీ శ్రేణులతో చర్చించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని మరింత పెంచుకోవాలని తెలిపారు.

ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు అనంతరం వైఎస్ఆర్ సీపీ క్యాడర్‌కు ఐడీ కార్డులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మూడు స్వామి, జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు బజార్ సాయి, నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షులు బైరబోయిన బాబు, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి శివరాత్రి పృథ్వీరాజ్, రాష్ట్ర ఎస్టీ సెల్ విభాగ కార్యదర్శి ధారావత్ రవీంద్ర నాయక్, మండల యువజన విభాగ అధ్యక్షులు సయ్యద్ షాబుద్దీన్, సీనియర్ నాయకులు పానుగంటి బ్రహ్మ నాయుడు, గ్రామ మాజీ సర్పంచ్ ఆదిమళ్ళ ముత్యాలు, పిట్టల సత్యనారాయణ, గోపు ప్రకాష్, బజార్ గురవయ్య, పిన్నెల్లి, నాగ, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## పిన్న వయసులోనే న్యాయమూర్తిగా ఎంపికై వడ్డెర కులానికి గర్వకారణంగా నిలిచిన జెరిపిటి కీర్తన

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:




ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నల్లమడ మండలం ముసలకంపల్లి గ్రామానికి చెందిన యువతి జెరిపిటి కీర్తన అత్యంత పిన్న వయసులోనే న్యాయమూర్తిగా (జడ్జిగా) ఎంపికై అరుదైన ఘనత సాధించారు.
కేవలం 23 ఏళ్ల ప్రాయంలోనే ఈ ప్రతిష్టాత్మకమైన జ్యుడీషియల్ పరీక్షల్లో ఉత్తర్ణత సాధించి, న్యాయమూర్తి పదవిని అధిష్టించి తమ వడ్డెర కులానికి దేశవ్యాప్తంగా గర్వకారణంగా నిలిచారు.
విశాఖపట్నంలోని ప్రఖ్యాత దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో ఈమె తన అభ్యసనాన్ని, న్యాయవిద్యను (లా డిగ్రీ) విజయవంతంగా పూర్తి చేశారు.
చిన్న వయసులోనే కఠినమైన న్యాయమూర్తి పరీక్షలను అధిగమించి ఈ స్థాయికి చేరుకోవడం ద్వారా భవిష్యత్తు తరాల యువతకు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల బిడ్డలకు ఈమె గొప్ప స్ఫూర్తిగా నిలిచారు. "చదువుతో లక్ష్యం – పట్టుదలతో విజయం" అనే పదాలకు నిలువెత్తు రూపంగా నిలిచిన జెరిపిటి కీర్తన సాధించిన ఈ విజయం పట్ల ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మరియు వడ్డెర సంఘం ఆధ్వర్యంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు, కుల సంఘ నాయకులు మరియు శ్రేయోభిలాషులు ఆమెకు ఘనంగా అభినందనలు తెలియజేస్తున్నారు.

## రైతు భూమిపై దౌర్జన్యం - బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

నరసరావుపేట మండలం పామిడిమర్రు గ్రామానికి చెందిన రైతు కాలేం ఏడుకొండలకు కోటప్పకొండ సమీపంలోని నంది హిల్స్ వెంచర్ పక్కన ఉన్న 1.86 ఎకరాల వ్యవసాయ భూమిపై దౌర్జన్యం జరుగుతోందని ఆరోపణలు వచ్చాయి.
నంది హిల్స్ కు చెందిన రావెల్ల వెంకటేశ్వర్లు, షేక్ అనీఫ్, బ్రహ్మారెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులు భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ వ్యవసాయానికి అడ్డంకులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతు ఆరోపించారు.
రైతును, అతని కుటుంబాన్ని బెదిరించి "ఇది మా భూమి, మీరు ఇక ఇక్కడికి రావద్దు" అని హెచ్చరించడంతో పాటు పొలంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని బాధితులు వాపోయారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతు కుటుంబం ఆరోపించింది.
ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు రక్షణ కల్పించాలని, భూమిని కబ్జా చేయడానికియత్నిస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## లారీని ఢీకొట్టిన బస్సు.. తప్పిన పెను ప్రమాదం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:




ఏపీలోని కర్నూలు జిల్లా కోడుమూరు సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.
సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీని ప్రైవేటు స్లీపర్ బస్సు ఢీకొట్టింది. హైదరాబాద్ నుంచి బళ్లారి వైపు బస్సు వెళుతుండగా, ఓవర్ టేక్ చేయబోయే క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

## చదువు కోసం ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్న పసిచిన్నారులు – దయనీయ స్థితిలో గిరిజన విద్యార్థుల ప్రయాణం



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం తామరపు లోవ ప్రాంతంలో విద్యా వ్యవస్థ దయనీయ స్థితికి అద్దం పట్టే ఘటన వెలుగు చూసింది. ?స్థానికంగా ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో, ఆ ప్రాంతంలోని పసిచిన్నారులు అక్షర జ్ఞానం కోసం ప్రతిరోజూ నానా అవస్థలు పడుతూ బడికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. బడికి వెళ్లే క్రమంలో చిన్నారులు రోజూ రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణించాల్సి వస్తోంది. అంతేకాకుండా దారి మధ్యలో ఉప్పొంగి ప్రవహిస్తున్న ఉధృతమైన వాగును దాటాల్సి వస్తున్న వైనం అందరినీ కలచివేస్తోంది. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నప్పటికీ, ప్రత్యామ్నాయ మార్గం గానీ, కనీసం వంతెన సౌకర్యం గానీ లేకపోవడంతో చిన్నారులు ప్రాణాలను పణంగా పెట్టి వాగును దాటుతున్నారు.
చిన్నారులు ప్రతిరోజూ బడికి వెళ్లివచ్చే సమయంలో ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని వారి తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ తీవ్ర ఆందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరియు ప్రజాప్రతినిధి వర్గాలు స్పందించి, తామరపు లోవ ప్రాంతంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని లేదా వాగుపై వెంటనే వంతెనను నిర్మించి గిరిజన విద్యార్థుల ప్రాణాలకు భద్రత కల్పించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

## చెత్త బుట్టలో శిశువు మృతదేహం లభ్యం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:



నంద్యాల జిల్లా:
ఆళ్లగడ్డ పట్టణంలో తీవ్ర దిగ్భ్రాంతికరమైన, మానవత్వాన్ని మంటగలిపే ఘటన వెలుగు చూసింది. పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ అయిన ప్రజ్ఞా కాలేజ్ సమీప ప్రాంతంలో దారుణం చోటుచేసుకుంది. అక్కడ రోడ్డు పక్కన ఉన్న చెత్త బుట్టలో ఒక నవజాత శిశువు మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. పూర్తి వివరాల్లోకి వెళితే... చెత్తబుట్టలో పడి ఉన్న ఆ పసికందు మృతదేహాన్ని అటుగా సంచరించే వీధి కుక్కలు గుర్తించి, తినేందుకు ప్రయత్నించాయి. ఆ సమయంలో ఆ మార్గంలో విధుల్లో భాగంగా అటుగా వెళ్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఈ దారుణ దృశ్యాన్ని కళ్లారా చూశారు. వెంటనే వారు తీవ్ర అప్రమత్తతతో వ్యవహరించి, పెద్దపెద్దగా కేకలు వేస్తూ కుక్కలను అక్కడి నుంచి తరిమికొట్టారు.
తర్వాత వారు వెంటనే స్పందించి చెత్తబుట్టలో ఉన్న ఆ పసికందు మృతదేహాన్ని సురక్షితంగా బయటకు వెలికితీశారు. ఈ అమానుష ఘటనపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుడు పోసుకున్న వెంటనే ఆ పసికందును ఇలా చెత్తబుట్టలో పడేసింది ఎవరూ అనే కోణంలో, అలాగే దీని వెనుక ఉన్న క్రూరమైన మనస్తత్వాల గురించి స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపి, చట్టపరమైన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## "కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి అందించిన రేవంత్ రెడ్డి కి పాలన చేతకావడం లేదు".

**-ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి శనీలా పట్టుకున్నారు..కాంగ్రెస్ కు రోజులు దగ్గరపడ్డాయి..ఫోర్త్ సిటీలో అమరవీరుల కుటుంబాలకు**
**కాలనీ నిర్మించాలి..**
**-మూడేళ్లు ఆరోపణలు చేస్తూ.. 3 రూపాయల అవినీతిని కూడా రుజువు చేయలేదు..**
**కేసీఆర్ జీవితం తెరిచిన పుస్తకం..**
**రేవంత్రెడ్డి కి పాలన చేతగాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు..**
**పంటలు కాపాడేందుకు తక్షణమే నీటిని విడుదల చేయాలి..**
**మాజీ మంత్రి వర్యులు, బీ ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటి పర్తి జీవన్ రెడ్డి..**







ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

జగిత్యాల పట్టణం లోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ లో మాజీ మంత్రివర్యులు, బీ ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా పరిషత్ తొలి ఛైర్పర్సన్ దావా వసంత సురేష్, బీ ఆర్ ఎస్ ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం లో మాట్లాడారు.రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం తో సాగు నీరు విద్యుత్ కొరత తో పంటలు తడి ఆరిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాల్సి ఉండగా రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.కన్నెపల్లి నుండి నీటిని ఎతిపోసి ఉంటే,ఉత్తర తెలంగాణ, సాగు నీరు అందే అవకాశం ఉండేది..కేసీఆర్ కు ఎక్కడ పేరు వస్తుందోనని కుట్ర పూరితంగా నీటిని ఎత్తిపోతలేదు..సాగు నీరు అందించలేదు..
కేసీఆర్ రైతు బిడ్డగా సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించారు.2014 నుండి 7700 మెగావాట్ల విద్యుత్ నుండి 19000 మెగావాట్ల కు విద్యుత్ ఉత్పతి కి పెంచారు.దేవాదుల ప్రాజెక్టులో పది పంపు సెట్లు ఉంటే ఐదు మాత్రమే వినియోగిస్తున్నారు..రోజు కు 73.56 క్యూసెక్కుల నీరు చేసే అవకాశం ఉన్న.. కేవలం 38 క్యూసెక్కుల నీరు మాత్రమే ఎత్తిపోస్తున్నారు.
బీ ఆర్ ఎస్ పార్టీ సభ్యులను సస్పెండ్ చేసి 22 ఏ పై చర్చ చేసుకున్నారు.
ఎన్నికల అఫిడవిట్ లో కేసీఆర్ పూర్తి ఆస్తులు పేర్కొన్నారు..కేసీఆర్ ఆస్తులకు అన్నింటికి లెక్కలు ఉన్నాయి..
325 సర్వే నెంబర్ 388 ఎకరాల విస్తీర్ణత ఉంది. గూగుల్ లో వెతికిన లభిస్తుంది..
సాగు విస్తీర్ణత పేరిట అధీనంలో ఉన్న వారికి నోటీస్ లు ఇచ్చి, ఇబ్బందులకు గురి చేయడం ఎందుకు..భూ భారతి అన్ని లెక్కలు మీ దగ్గరే ఉన్నాయి కదా..
కక్ష్య పూరితంగా కెసిఆర్ నోటీసులు ఇస్తామంటున్నారు అని విమర్శించారు.
2009 ఎన్నికల అఫిడవిట్ లో ఆస్తులు పేర్కొన్నారు..
రేవంత్ రెడ్డి నోరు మూతపడ్డది..
ఆస్తుల్లో అవకతవకలు ఉంటే ఎందుకు చర్చకు పెట్టడం లేదు..
కేసీఆర్ ఉద్యమ నాయకత్వంలో అమరవీరుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డది..
ఎర్రవల్లిలో కాదు.. హైదరాబాద్ ఫోర్త్ సిటీ లో అమరవీరుల కుటుంబాలకు కాలనీ నిర్మించాలి..
రేవంత్ రెడ్డి ఏనాడు తెలంగాణ జెండా పట్టినోడు కాదు ..జైలు కెళ్ళినోడు కాదు.. మొదటి నుండి చంద్ర బాబు సంకలోనే ఉన్నాడు.
కేసీఆర్, కేటీఆర్ పై రేవంత్ రెడ్డి ఆరోపణలకు సమాధానంగా ఎన్నికల అఫిడవిట్లో అన్ని వివరాలు పేర్కొన్నారు.
కెసిఆర్ జీవితం తెరిచిన పుస్తకం..
రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల వేల కోట్ల అక్రమ ఆస్తుల వివరాలు మన్నె క్రిషాంక్ బయట పెట్టినా.. రేవంత్ రెడ్డి నుండి సమాధానం లేదు..
మన్నె క్రిషాంక్ పై కేసు పెడితే కోర్టు మొట్టికాయ వేసింది.
ప్రభుత్వానికి ఏ మాత్రం సిగ్గు,లజ్జ ఉన్న రేవంత్ రెడ్డి నైతికంగా రాజీనామా చేసి, పదవి నుండి తొలగాలి..
సిట్టింగ్ జడ్జి తో విచారణ చేపట్టాలని కేటీఆర్ సవాలు విసిరితే.. రేవంత్ రెడ్డి కి విచారణ చేపట్టేందుకు ఎందుకు ధైర్యం లేదు..
మొన్నటి వరకు కాళేశ్వరం పై అవినీతి ఆరోపణలు చేశారు.. ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా వచ్చింది..
మేడి గడ్డ లో కేవలం ఒక బ్లాక్ లో పియర్స్ మాత్రమే రిపేర్ కు ఉన్నాయి..
మూడేళ్ల నుండి ఆరోపణలు చేస్తూ..3 రూపాయల అవినీతి అయినా రుజువు చేశావా అని రేవంత్ రెడ్డి ని నిలదీశారు.
కరెంట్ ఎప్పుడూ వచ్చేది తెలుస్తలేదు.. ఎప్పుడూ పోయేది తెలుస్తలేదు..
24 గంటలు కాదు కనీసం రోజుకు12 గంటలు ఇచిన చాలు..
కన్నెపల్లి పంపు నుండి నీటిని ఎత్తిపో స్తే కేసీఆర్ కు ఎక్కడ పేరు వస్తాధో అని నీటిని ఎత్తిపోయడం లేదు..
దేవాదుల కేవలం విద్యుత్ సరఫరా చేయలేక కేవలం ఐదు మోటర్లు మాత్రమే నడిపిస్తు 6 లక్షల ఎకరాలకు నీరు అందని పరిస్థితి ఉన్నా ఇంకా సోయి లేకపోతే ఎలా అని నిలదీశారు.
భూగర్భ జలం ఇంకిపోయింది.విద్యుత్ సరఫరా లేదు..పంటలు ఎండిపోయే పరిస్థితి లో ఉన్నాయి..తక్షణమే నీటినీ విడుదల చేయాల్సిన అవశ్యకత ఉంది.
ఈ పంట చేతికి రావాలంటే నీరు విడుదల చేయాలి..
తక్షణమే కన్నెపల్లి నుండి నీటిని ఎత్తిపోయాలి.
రేవంత్ రెడ్డి తెలంగాణకు శని లాగ తయారు అయిండు..
కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి అందించిన రేవంత్ రెడ్డి కి పాలన చేతకావడం లేదు.
ఎన్నికల ప్రణాళిక లో పేర్కొన్న హామీలు అమలు చేయాలి..
క్రాప్ హాలిడే ప్రకటించి ఎకరా 20 వేలు ఇవ్వాలి..
కేసీఆర్ కేటీఆర్ పై ఆరోపణలు చేసే ముందు.. నీ కింద గురిగుంజ నలుపు చూసుకో అని హితవు పలికారు.
అధికారం చేతి లో ఉందని కేసులు పెడుతున్నారు.
బీ ఆర్ ఎస్ నాయకుడు పై తాగిన మైఖంలో దాడి చేస్తే, పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు..
పోలీస్ స్టేషన్ కు 50 మీటర్ల దూరంలో జరిగిన దాడిని పోలీసులు పట్టించుకోవడంలేదు..
పోలీసులు శాంతి భద్రతలు కాపాడాలి..
అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదు..
కాంగ్రెస్ పార్టీ కి రోజులు దగ్గర పడ్డాయి..
దాడులతో బీఆర్ఎస్ ను అడ్డుకోలేరు..
పునరావృతం అయితే పరిస్థితుల తీవ్రంగా ఉంటాయి.. అని హెచ్చరించారు.
ప్రభుత్వ భూమి వివాదంలో నిర్మాణాన్ని తొలగించి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినా, అక్రమ దారుడు కి పోలీసులు అండగా ఉండి,అక్రమ కేసు పెట్టీ నిర్భంధించారు.
పోలీస్ల సంక్షేమం పై చిత్తశుద్ధి ఉంటే మూడేళ్లుగా పెండింగ్ లో ఉన్న పెట్రోల్ పంపు ఏర్పాటు చేయండి..
ఎమ్మెల్యే అభివృద్ధి కోసం పార్టీ మారిన అంటాడు.
ప్రభుత్వ ఆస్తులు కాపాడటం ఎమ్మెల్యే బాధ్యత కాదా.. ప్రభుత్వ ఆస్తులు నిర్వీర్యం అవుతుంటే అరికట్టడం నీ బాధ్యత కాదా..
పోలీసుల అండ కావాలి కానీ పోలీసుల సంక్షేమం మాత్రం పట్టించుకోవా..అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను నిలదీశారు..
ఎస్ ఆర్ ఎస్ పి నుండి తక్షణమే నీటిని విడుదల చేయాలి.. పొట్టదశలో ఉన్న వరి పంటను రక్షించేందుకు రెండు తడులు నీటిని విడుదల చేయాలి..కన్నెపల్లి నుండి నీటిని ఎత్తిపోయాలని, రెండో పంటకు నీరు అందించాలని డిమాండ్

## తెలంగాణ రైతుల కు త్రీ పీస్ విద్యుత్ ఇవ్వండి మోటార్లు కాలిపోతున్నాయి - రాయికల్ మాజీ సర్పంచ్ ఎద్దశీడి భూమరెడ్డి

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:



రైతే దేశానికి వెన్నెముక రైతు లేనిదే రాజ్యం లేదు అని జై జవాన్ జై కిసాన్ అలాంటి కిషన్ రైతులు ఈరోజున రోడ్డున పడుతున్నారు ఇలాంటి సమయంలో రైతు కు ఎలినోను ప్రభావంతో పంట పండించడానికి నీళ్లు లేక నూతులలో నీళ్లు ఉండి వాటిని బయటకు రావాలంటే విద్యుత్ అవసరం ఆ విద్యుత్తు మాత్రం రైతులకు అందించక రైతులు గోడున ఏడుస్తున్నారు మేము ఏమి చేస్తే బతుకుతాం ఎలా వ్యవసాయం లేనిది సన్న కారు చిన్న కారు రైతులు పండించే పంటపై ఆధారపడి ఉండడం నిజమే కానీ ప్రభుత్వాలు రైతులు అవసరం ఉన్న విద్యుత్ సరఫరా చేయక రైతులు గొడున ఏడుస్తున్నారని రాయికల్ మాజీ సర్పంచ్ ఏద్దండి భుమరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు
రాష్ట్రంలో విద్యుత్ సరిగా లేక త్రీ పీస్ విద్యుత్ సరిగా రాక మోటర్లు కాలిపోవడం జరుగుతుంది వ్యవసాయం చేస్తే లాభం లేక అలాంటి వ్యవసాయానికి నూతి ఉండి కరెంటు వచ్చిన త్రీఫేస్ రాక విద్యుత్ మోటర్లు కాలిపోతున్నాయి ఈ విషయంలో ప్రభుత్వాలు ఏవైనా ఉండని కానీ రైతులను మాత్రం రోడ్డు ఈడ్చడం బాగోలేదుఉన్న విద్యుత్ అయినా త్రీఫేస్ ఇచ్చి రైతులకు నష్టం జరగకుండా త్రీ పీస్ విద్యుత్ సరఫరా చేయాలని ఎద్దశీడి భుమారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు

## విద్యార్థులు--ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానం, విద్యార్థుల విద్యా ప్రగతి, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను-మల్లాపూర్‌లో గిరిజన మినీ గురుకులం, మోడల్ స్కూల్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని గిరిజన మినీ గురుకులం, టీజీ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు.
పాఠశాలలోనితరగతిగదులు,విద్యార్థులు--ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానం, విద్యార్థుల విద్యా ప్రగతి, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలనుకలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, భోజనం, విద్యా పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు.
విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి,ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులనుఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూబోధనాప్రమాణాలనుమెరుగుపరచాలని, విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపొందింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.
విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.
విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని వసతులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పల్లికొండ నరేష్, జిల్లా విద్యాధికారి కె. రాము, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఎంపీ తండ్రిని పరామర్శించిన జగన్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

వైయస్ఆర్ జిల్లా / చెన్నై:
చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తండ్రి మద్దిల మునికృష్ణయ్యను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మునికృష్ణయ్య ఆరోగ్య పరిస్థితిని ఆయన కుటుంబ సభ్యులను అడిగి వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అంతా మంచి జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శకు సంబంధించిన వివరాలు



స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

# పెట్ షాప్ ప్రొమోషన్ పేరుతో పిలిచి యువతిపై లైంగిక దాడి



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

.మంగళగిరి / విజయవాడ:
రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సోషల్ మీడియా వేదికగా ఏర్పడిన పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఒక యువతిని మోసగించిన దారుణ ఘటన వెలుగు చూసింది. ఇన్స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన కడపకు చెందిన సింగర్ మరియు యాంకర్ అయిన యువతిని, విజయవాడకు చెందిన షేక్ జానీ అనే వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు.

పెట్ షాప్ ప్రొమోషన్ మరియు పెట్ షాప్ రీల్స్ షూటింగ్ పేరుతో ఆమెను విజయవాడకు రప్పించాడు. ఈ ప్రొమోషన్ పనికి సంబంధించి రూ. 30 వేలు ఇస్తానని నమ్మబలికి ఆమెను రప్పించినట్లు బాధితురాలు పేర్కొంది. అయితే విజయవాడకు చేరుకున్న ఆ యువతికి నిందితుడు పథకం ప్రకారమే మత్తుమందు కలిపిన నీళ్లు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ నీళ్లు తాగిన వెంటనే ఆ యువతి స్పృహ కోల్పోయేలా చేశాడని, ఆ తర్వాత ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేసింది.

ఈ అమానుష ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. సోషల్ మీడియా పరిచయాల పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలని, ఈ ఘటనకు సంబంధించి పూర్తి విచారణ జరిపి నిందితుడిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# నేడు ఏపీ కేబినెట్ సమావేశం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

అమరావతి:
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం ఉదయం 10.30 గంటలకు ఏపీ సచివాలయంలో కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ అత్యంత కీలకమైన భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని పలు సంస్థలకు భూ కేటాయింపులు జరపడం, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే తాజా పరిపాలనా అంశాలపై మంత్రివర్గంలో విస్తృతంగా చర్చించనున్నారు. కేబినెట్ సమావేశం అనంతరం సీఎం



చంద్రబాబు మంత్రులతో కలిసి తాజా రాజకీయ పరిణామాలు, రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి తగిన దిశానిర్దేశం చేయనున్నారు.

# చిలకలూరిపేట మండలంలో వైయస్సార్సీపీ నేత ఇంట్లో వేడుకకు హాజరైన మాజీ మంత్రి విడదల రజిని



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

చిలకలూరిపేట మండలంలో వైయస్సార్సీపీ నేత ఇంట్లో వేడుకకు హాజరైన మాజీ మంత్రి విడదల రజిని
పల్నాడు జిల్లా / చిలకలూరిపేట:
చిలకలూరిపేట మండలం కొమటినేనివారిపాలెం గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోరంట్ల సుబ్బయ్య గారి కుమార్తె పుష్పాలంకరణ వేడుక ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు శ్రీమతి విడదల రజిని గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చిన్నారిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తుపాకీ మిస్ ఫైర్.. కానిస్టేబుల్‌కు గాయాలు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

విశాఖపట్నం:విశాఖలోని ఐఎన్ఎస్ దేగా వద్ద తీవ్ర కలకలం రేపిన ఘటన చోటుచేసుకుంది. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ విమాన భద్రతా విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ తుపాకీ అనుకోకుండా మిస్ ఫైర్ అయింది.
ఈ ప్రమాదకర ఘటనలో ఏపీ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ అప్పలకొండ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన ఎడమవైపు ఛాతి కింద భాగంలో గాయమైంది. తుపాకీ పేలిన పెద్ద శబ్దం రావడంతో వెంటనే అప్రమత్తమైన తోటి సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. రక్తమడుగులో ఉన్న అప్పలకొండను వెంటనే అత్యవసర అంబులెన్స్‌లో ఆసుపత్రికి



తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# స్థానిక ఎన్నికల్లో తొలి అభ్యర్థిని ప్రకటించిన జగన్



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:

ఆంధ్రప్రదేశ్:
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక సంచలన ప్రకటన చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ తరఫున తొలి అభ్యర్థిని ఆయన అధికారికంగా ప్రకటించారు.
నెల్లూరు నగర మేయర్ పదవికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరును ఖరారు చేస్తూ ఆయన ఈ ప్రకటన వెలువరించారు. కాగా, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై గత రెండు రోజులుగా జగన్ పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలు మరియు కార్పొరేషన్ల వారీగా పార్టీకి చెందిన కీలక నాయకులతో ముఖాముఖి మంతనాలు జరుపుతూ ఎన్నికలకు సర్వసన్నద్ధం అవుతున్నారు. ఈ రాజకీయ పరిణామాలకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెలువడనున్నాయి.

# ఇప్పపాడ్‌లో నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:
కల్వకుర్తి నియోజకవర్గం ఊర్కొండ మండలం ఇప్పపాడ్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన పంచాయతీ పరిపాలన సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా గ్రామపంచాయతీలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.నూతన గ్రామపంచాయతీ భవనం పూర్తయితే గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులను దశలవారీగా చేపట్టి ఇప్పపాడ్



గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్పాటనాయకులు,కార్యకర్తలు,అధికారులు,( గామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







# రైతుల సంక్షేమం కోసం సహకార సంఘాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలి....

## –ఇటిక్యాల పిఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసీఎస్) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ హాజరై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పిఏసీఎస్ చైర్మన్ మర్రిపల్లి శ్రీనివాస్ గౌడ్ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం సహకార సంఘాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని, రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందించాలని సూచించారు.
రైతుల సమస్యలను పరిష్కరించడంలో పీఏసీఎస్‌లు కీలక పాత్ర పోషించాలని, నూతన కార్యవర్గం రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి,సర్పంచ్ నీరటి శ్రీనివాస్, రాయికల్ ఏఎంసీ చైర్మన్ రవీంద్రరావు, పాక్స్ చైర్మెన్ లు ఏనుగు మల్లారెడ్డి,తంగెళ్ల రమేష్,
మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాన్లు, సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు సురేందర్ నాయక్,ప్రధాన కార్యదర్శి ముఖీద్, పాక్స్ డైరెక్టర్







లు ఎలేటి జలందర్ రెడ్డి, నాగిరెడ్డి నరసరెడ్డి, శంకర్, సిరికొండ శంకర్, బూసవేని రమేష్, సురకంటి రాజు, మారాసు గంగారాజం, మారంపల్లి రాజు, నాయిని దేవయ్య, గుండా వెంకయ్య, జగడం అనంతస్వామి, పోతరాజు గంగారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.
అలాగే రాయికల్ మండల నాయకులు, సర్పంచులు చర్ల కొండాపూర్ సర్పంచ్ దేవుని రవి,ఉపసర్పంచులు, రైతులు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్లీపూర్, కిస్టమ్మేట్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టం పేట గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం నుంచి పోచమ్మ గుడి వరకు ఎస్సీ కాలనీలో రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు.
అనంతరం అల్లిపూర్ గ్రామంలో బైపాస్ రోడ్డులో 10 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.



అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.
ఈకార్యక్రమంలోఎంపీడీవోచిరంజీవి,సర్పంచులు ఆకుల అంజన్న గౌడ్, ఎంబారీ గౌతమి వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తంగెళ్ల రమేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు,రాయికల్‌పీఏసీఎస్‌చైర్మన్‌ఏనుగుమల్లారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ముఖీద్, ,స్పందన సాగర్ రావు,జిల్లా కాంగ్రెస్ నాయకులు తిరుపతి గౌడ్, సత్తయ్య,ఉప సర్పంచ్ లు, మండల, గ్రామ నాయకులు, సర్పంచులు, వివిధ హోదాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మంచి ఉద్యోగమని నమ్మించాడు.. రష్యా ఆర్మీలో చేర్పించాడు... ఏజెంట్‌కు రూ.2.50 లక్షలు చెల్లించి రష్యా వెళ్లిన యువకుడు..––ఉక్రెయిన్ సరిహద్దులో యుద్ధ ప్రాంతానికి పంపించారంటూ భార్య రక్షిత ఆవేదన

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:
వ్యవసాయ రంగంలో విఫలమై సరియైన పని లేక విదేశాలకు బతుకు తెర కొరకు బ్రతుకు తెరువు కొరకు విదేశాలకు వెళ్లిన యువకుడు ఏజెంట్ చెప్పిన పని కాక మిల్టీలో ఆర్బిగా ఆర్మీగా చేర్చిన రష్యా దిన దినము గండంగా బ్రతుకు తాను లేదు అని చెప్పగా భర్తను సురక్షితంగా స్వదేశానికి రప్పించాలని పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ యువకుడిని రష్యాకు పంపించి, అక్కడ బలవంతంగా ఆర్మీలో చేర్పించినట్లు ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన యువకుడు ప్రస్తుతం యుద్ధ వాతావరణంలో చిక్కుకున్నాడని అతడి భార్య పోలీసులను ఆశ్రయించింది.
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ఎస్సై రమేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన దొమ్మాటి కిషన్, రక్షిత దంపతులు గ్రామంలో తమ కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నారు. కిషన్‌కు స్థానికంగా సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో రష్యాలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని సిరిసిల్లకు చెందిన మ్యాన్‌పవర్ ఏజెంట్ దార్నం శ్రీనివాస్ చెప్పినట్లు



సమాచారం.
ఏజెంట్ మాటలు నమ్మిన కిషన్ రూ.2.50 లక్షలు చెల్లించి, గత నెల 5న రష్యాకు వెళ్లాడు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత తన భర్తను ఉద్యోగం పేరుతో మోసం చేశారని భార్య రక్షిత ఆరోపించింది.
బలవంతంగా రష్యా ఆర్మీలో చేర్పించి, ఉక్రెయిన్ సరిహద్దులోని యుద్ధ ప్రాంతానికి పంపించారని తన భర్త ఫోన్ చేసి చెప్పినట్లు ఆమె పోలీసులకు తెలిపింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఆమె.. తన భర్తను సురక్షితంగా భారత్‌కు తీసుకురావాలని, ఉద్యోగం పేరుతో మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది.
బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ గౌడ్ తెలిపారు. యువకుడిని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలపై కూడా అధికారులు దృష్టి

# జాషువా మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**వెల్దండ ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**

వెల్దండ మండల కేంద్రానికి చెందిన జంగిలి జాషువా మరణించిన విషయం తెలుసుకున్న వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ బుధవారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకుండా, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. జాషువా మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొయ్యల పుల్లయ్య, కృపానందం, గుద్దటి కిష్టల్, పసునోజు పురుషోత్తం, మసిగుండ్ల వెంకటేష్, మారేపల్లి శ్రీనివాస్, మట్ట భరత్, రేవల్లి బాలరాజు,ఈదులపల్లి ఆనంద్, డేవిడ్, మట్ట మల్లేష్ తదితరులు ఉన్నారు.

# ఈనెల 22న చిన అమిరంలో ఉచిత కంటి వైద్య శిబిరం .. ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం , ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**

ఈనెల 22వ నుంచి 26వ తేదీన వరకు భీమవరం మండలం చిన అమిరం గ్రామంలో ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఎమ్మెల్యే నివాసం వద్ద బుధవారం కంటి వైద్య శిబిరం పోస్టర్ ను ఆవిష్కరించారు. గొట్టుముక్కల వెంకటరాజు (తాతారాజు) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, శంకర నేత్రాలయ కంటి వైద్య శాల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తెలంగాణ సామాజిక రచయితల సంఘము జిల్లా అధ్యక్షులు గా ఇమ్మడిరాంబాబు.



**మహబూబాబాద్ జిల్లా ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**

తొర్రూరు పట్టణానికి చెందిన అలా అవార్డుల గ్రహీత ప్రముఖ సాహితీవేత్త రచయిత కవి ఇమ్మడి రాంబాబు ను తెలంగాణ సామాజిక రచయిత ల సంగం జిల్లా ప్రెసిడెంట్ గా నియమించిన్నట్లు రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో జరిగిన సమావేశంలో వారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.సతీష్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక సమస్యలు మీద రచనలు చేస్తూ పలు పత్రికలకు వ్యాసాలు వచన కవితలు గేయాలు రాయడం సామాజిక సంస్కృతిక సాహిత్య కార్యక్రమాలు చేపట్టడంలో లో వారు దిట్ట అన్నారు. గత కొన్ని ఏళ్లు గా సాహిత్య సేవ తో పాటు కవులను ప్రోత్సహిస్తున్నందుకు జిల్లాలో మరిన్ని సాయి చేసే వాళ్ళు చేయాలని అభిలాషిస్తూ ఈ నియామకం చేసినట్లు చెప్పారు. సమాజానికి మార్గ దర్శకులు రచయిత లు అని ఒక్క సిరా చుక్క లక్ష మెదల్ల కలయిక ఆని అన్నారు.సామాజిక అంశాల మీద రచయిత లు రచనలు చేయాలని అన్నారు. తనను జిల్లా ప్రెసిడెంట్ గా నియా మకం చేసిన సతీష్ రేడ్డి కీ రాంబాబు కృతజ్ఞతలు తొర్రూర్ డివిజన్ తో పాటు జిల్లాలో మరిన్ని సాహిత్య సేవలు చేస్తానని రాంబాబు అన్నారు తెలిపారు.

# మంతెన,తెన్నేరు,జగన్నాథపురం గ్రామాలకు రూ.65 లక్షలతో రోడ్ల అభివృద్ధి





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**

పల్లె పండుగ 3.0లో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్.కంకిపాడు మండలంలో అభివృద్ధి పనులకు మరో ముందడుగు పడింది, పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా మంతెన,తెన్నేరు, జగన్నాథపురం గ్రామాల్లో రూ.65 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బోడే ప్రసాద్ శంకుస్థాపన చేశారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ...**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు,గత రెండున్నరేళ్లలో మంతెన, తెన్నేరు,జగన్నాథపురం గ్రామాల అభివృద్ధికి ఎన్ ఆర్ జి ఎస్ ద్వారా సుమారు రూ.1 కోటిలి మండల పరిషత్ మరియు గ్రామస్థాయి నిధుల ద్వారా మరో రూ.1.61 కోట్ల వరకు నిధులు ఖర్చు చేసినట్లు వెల్లడించారు,తాజాగా గ్రామాల అభివృద్ధి కోసం మరో రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు,ప్రస్తుతం ఎన్ ఆర్ జి ఎస్ నిధులు కొంత తగ్గిన కారణంగా అన్ని అభివృద్ధి పనులకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేకపోతున్నామని,భవిష్యత్తులో మరిన్ని నిధులు సమీకరించి గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు.

గ్రామాల్లో మెరుగైన రహదారులు,డ్రైనేజీ,ఇతర మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్ స్పష్టం చేశారు,ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ కంకిపాడు మండల పార్టీ అధ్యక్షులు జంపన వెంకటేశ్వరరావు ఏఎంసీ చైర్మన్ అన్నే ధన రామ కోటేశ్వరరావు బొగ్గవరపు శ్రీనివాసరావు యార్లగడ్డ రాజా. లక్ష్మీ కుమారి కూటమి నాయకులు, కార్యకర్తలు,అధికారులు,గ్రామ పెద్దలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వాయు నాణ్యత మెరుగుదలకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల మేరకు ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో శాస్త్రీయ పర్యవేక్షణ, సమగ్ర కార్యాచరణ

**కాలుష్య మూలాల నియంత్రణకు రవాణా, ట్రాఫిక్, మున్సిపల్,వ్యవసాయం,పరిశ్రమలు,పౌరసరఫరాలశాఖలసమన్వయంతోప్రభావవంతమైన చర్యలుస్వచ్ఛ వాయు సర్వేక్షణలో నల్గొండలోని 16వ వార్డు జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించడం పై హర్షం వ్యక్తం చేసిన కమిటి ఛైర్మన్ అహ్మద్ నదీమ్, మెంబర్ కన్వీనర్ రవికాలుష్య మూలాల నిర్మూలనే లక్ష్యంగా టిజిపిసిబి ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్పష్టం చేసిన మెంబర్ సెక్రటరీ రవి**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**

తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ, వాయునాణ్యత మెరుగుదల కోసం ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి(ఎక్యుఎంసి) ఆధ్వర్యంలో చేపడుతున్నకార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ అన్నారు. శాస్త్రీయ పర్యవేక్షణ, కాలుష్య మూలాల గుర్తింపు, నియంత్రణ చర్యలు, పచ్చదనం పెంపు, ప్రజా అవగాహన కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణనుకొనసాగిస్తుండటంఅభినందనీయమ నిపేర్కొన్నారు. బుధవారం సెక్రటేరియట్ లో కమిటి ఛైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి గారు కమిటి మెంబర్ కన్వీనర్ గా నిర్వహించిన ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి సమావేశం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఆమోదించిన ఎక్యుఎంసి కార్యాచరణ ప్రణాళికలోని అంశాల పై చర్చించింది. సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్, ఎన్సీఏపీ నోడల్ ఆఫీసర్ ప్రసాద్, జీహెచ్ఎంసి, సైబరాబాద్ మల్కాజ్గిరి కార్పొరేషన్ల కమిషనర్లు, నల్గొండ కలెక్టర్, సిడిఎంఎ అధికారులు, ట్రాన్స్పోర్ట్ కమిషనర్, టిజిఎస్ ఆర్ టిసి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి ట్రాఫిక్ కమిషనరేట్ల అధికారులు, టిజి ఐఐసి, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాల పై చర్చించిన తర్వాత ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, ఫలితాలను సమావేశం విశ్లేషించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద ఎక్యుఎంసి చేపడుతున్న కార్యక్రమాలను సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ ప్రసాద్ కమిటి ఛైర్మన్ అహ్మద్ నదీమ్, టిజిపిసిబి మెంబర్ సెక్రటరీ, కమిటి మెంబర్ కన్వీనర్ రవి, కమిటి సభ్యులకు వివరించారు.

ఈ సందర్భంగా సమీక్షించిన అంశాలు

**పిఎం 10 స్థాయిలపై నిరంతర పర్యవేక్షణ**

2019--20 నుంచి 2025--26 వరకు నమోదైన వార్షిక సగటు PM10 స్థాయిలను పరిశీలిస్తే హైదరాబాద్‌లో 86 నుంచి 80 కు, సంగారెడ్డిలో 87 నుంచి 78 g/m కు తగ్గుదల నమోదైంది. నల్గొండలో 59 నుంచి 71 g/m గా నమోదైంది. 2025--26లో హైదరాబాద్, నల్గొండ, సంగారెడ్డిలో PM10 సగటు స్థాయిలు వరుసగా 80, 71, 78 g/m గా నమోదయ్యాయి. వాయు నాణ్యత సూచీ (AQI) ప్రధానంగా 'Satisfactory' నుంచి 'Moderate' కేటగిరీలలో ఉన్నట్లు సమీక్షలో నమోదైంది.

వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలోపేతంలి

క్యూర్ ప్రాంతంలో వాయు నాణ్యతను మరింత ఖచ్చితంగా, నిరంతరంగా పర్యవేక్షించేందుకు 13 'నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ (CAAQMS)'ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్నది. పర్యవేక్షణ కేంద్రాల స్థానాలను శాస్త్రీయంగా నిర్ణయించి, ఆయా ప్రాంతాల్లోని వాయు నాణ్యతకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని పొందేలా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు.

CAAQMS\ నుంచి లభించే డేటాను సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడానికి "ఎయిర్ క్వాలిటి డ్యాష్ బోర్డు" అభివృద్ధి ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. సంబంధిత శాఖలకు ౹ామీ అలర్ట్ ల ద్వారా వాయు నాణ్యతకు సంబంధించిన సమాచారం చేరవేస్తారు.

అదేవిధంగా తక్కువ వ్యయంతో వాయు నాణ్యతను పర్యవేక్షించే 'లో కాస్ట్ సెన్సార్ల (౹ాజూ) వినియోగాన్ని కూడా విస్తరిస్తున్నారు. టిజిపిసిబి ఆధ్వర్యంలో బొల్లారం, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇప్పటికే 8 LCSలను ఏర్పాటు చేశారు. రీసైక్లింగ్, క్రషింగ్ తదితర కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో, అలాగే నిర్మాణ, కూల్చివేత ప్రదేశాల్లో ౹ాజూల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

'రోడ్ డస్ట్' నియంత్రణకు ప్రత్యేక దృష్టి

పట్టణ వాయు కాలుష్యంలో ధూళికణాల కాలుష్యాన్ని నియంత్రించేందుకు రోడ్ డస్ట్ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రోడ్ల మెరుగుదల, ఎండ్-టు-ఎండ్ పేవింగ్, మెకానికల్ రోడ్ స్వీపింగ్, బహిరంగ ప్రాంతాల్లో పచ్చదనం పెంపుదల, ట్రాఫిక్ కారిడార్లలో గ్రీన్ కవర్, మినీ ఫారెస్టులు, మియావాకీ ప్లాంటేషన్లు వంటి చర్యలను నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (చీజూ౹ా) కింద చేపడుతున్నారు.

మెకానికల్ రోడ్ స్వీపింగ్‌పై టిజిపిసిబి నిర్వహించిన అధ్యయన ఫలితాలను మూడు పట్టణ స్థానిక సంస్థల అధికారులకు వివరించేందుకు వర్క్ షాప్ నిర్వహించగా, సుమారు 100 మంది అధికారులు పాల్గొన్నారు. అధ్యయన సిఫారసులను రాబోయే సర్వీస్ ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోనున్నారు.

వాహన కాలుష్య నియంత్రణకు చర్యలు

వాహనాల ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, జు౹ం ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, PUC వ్యవస్థ బలోపేతం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ వాహనాల కొనుగోలు, అద్దెకు తీసుకునే వాహనాల్లో జు౹ంలకు ప్రాధాన్యత కల్పించే చర్యలు అమలయ్యాయి. ౹ాఖజ వ్యవస్థను మరింత సమర్థవంతం చేసేందుకు రాష్ట్రంలోని 516 PUC కేంద్రాలను కేంద్ర సర్వర్‌తో అనుసంధానం చేశారు. ఇప్పటివరకు 36,14,208 పరీక్షలు నిర్వహించినట్లు రవాణా శాఖ నివేదించింది. ౹ాఖజ గడువు ముగిసిన వాహనాలపై ఆటోమేటిక్ చలాన్ల విధానం అమలు చేసేందుకు వాహనాల నంబర్ ప్లేట్లను స్వయంచాలకంగా గుర్తించే (ANPR) కెమెరాల ఏర్పాటుకు కూడా చర్యలు చేపడుతున్నారు.

ప్రజా రవాణాలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెంపుహైదరాబాద్‌లో ప్రజా రవాణా రంగంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి. TGSRTC ప్రస్తుతం GHMC పరిధిలో 310 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. అదనంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ౹ావీ జు-ఙతీఱఙవ కింద రాష్ట్రానికి కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా కొనసాగుతున్నది.

కాలుష్య మూలాలను శాస్త్రీయంగా గుర్తించేందుకు కాలుష్య మూలాల అధ్యయనం (Source Apportionment Study)

నల్గొండ, సంగారెడ్డి ప్రాంతాల్లో Source Apportionment Study (SAS) ద్వారా వాయు కాలుష్యానికి కారకమవుతున్న వివిధ మూలాలను శాస్త్రీయంగా గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. IIT బాంబే సమర్పించిన డ్రాఫ్ట్ తుది నివేదికను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా మరింత మెరుగుపరచేందుకు టిజిపిసిబి, ఇతర నిపుణ సంస్థలు సూచనలు అందించాయి. ఈ అధ్యయన ఫలితాలను భవిష్యత్ కాలుష్య నియంత్రణ చర్యలకు ఉపయోగించనున్నారు.

రాష్ట్ర స్థాయి ఉద్గరాల సమగ్ర లెక్కింపు (Emission Inventory)కు చర్యలు

తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ కోసం స్టేట్ యాక్షన్ ప్లాన్ ను మరింత శాస్త్రీయంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి యునైటెడ్ నేషన్ ఎన్విరాన్ మెంట్ ప్రోగ్రామ్ తో కలిసి ఉద్గారాల సమగ్ర లెక్కింపు (Emission Inventory) పై చర్యలు చేపడుతున్నది. వివిధ శాఖల నుంచి అమలు నివేదికలను సేకరించి, రాష్ట్ర స్థాయి కార్యాచరణను మరింత సమర్థవంతంగా రూపొందించే ప్రక్రియ కొనసాగుతున్నది. అన్ని జిల్లాలకు జిల్లా స్థాయి అమలు కమిటీల పరిధిని విస్తరించే చర్యలు కూడా ప్రతిపాదనలు సమర్పించారు.

పరిశ్రమలు, డీజిల్ జనరేటర్ సెట్ల ఉద్గారాల నియంత్రణపారిశ్రామిక ప్రాంతాల్లో వాయు నాణ్యత పర్యవేక్షణను బలోపేతం చేయడంతో పాటు, నిర్మాణ ప్రాంతాలు, ఇతర ప్రధాన కాలుష్య ఉత్పత్తి ప్రాంతాల్లో పర్యవేక్షణకు సెన్సార్ వ్యవస్థలను విస్తరిస్తున్నారు.

డీజిల్ జనరేటర్ సెట్ల నుంచి వెలువడే ఉద్గారాలను నియంత్రించేందుకు ఉద్గార నియంత్రణ పరికరాల అదనపు అమరిక (Retrofit Emission Control Devices (RECD) లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సంబంధిత సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, విద్యుత్ శాఖల సమన్వయంతో =జుజణ అమలుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

బహిరంగ దహనాల పై అవగాహన - వ్యవసాయ అవశేషాల వినియోగానికి కార్యాచరణ

వ్యవసాయ అవశేషాలను బహిరంగంగా దహనం చేయడం వల్ల వాయు కాలుష్యం పెరగకుండా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ అవశేషాలను బ్రికెట్లు, పెల్లెట్లుగా మార్చి సంప్రదాయ ఘన ఇంధనాలకు ప్రత్యామ్నాయ ఇంధనంగా వినియోగించే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బ్రికెట్ తయారీ యూనిట్ల ఏర్పాటు ఇప్పటికే ప్రారంభమైంది.

నిధుల వినియోగం -- కాలుష్య నియంత్రణ చర్యలకు ప్రాధాన్యత

చీజూ౹ా, 15వ ఫైనాన్స్ కమిషన్ కింద విడుదలైన నిధులను నిర్దేశిత వాయు కాలుష్య నియంత్రణ చర్యలకు సమర్థవంతంగా వినియోగించడంపై ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి (౹ాఝవీఱ) ప్రత్యేకంగా సమీక్షించింది. హైదరాబాద్‌లో చీజూ౹ా కింద విడుదలైన నిధుల్లో 90.27 శాతం, నల్గొండలో 82.5 శాతం, పటాన్‌చెరులో 100 శాతం, సంగారెడ్డిలో 76.43 శాతం వినియోగమైనట్లు సమీక్షలో వెల్లడైంది.

2026--27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణలో చీజూ౹ా కింద నల్గొండకు రూ.4.83 కోట్లు, సంగారెడ్డికి రూ.2.42 కోట్లు, మొత్తం రూ.7.25 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో రహదారుల మెరుగుదల, పచ్చదనం, ఎలక్ట్రిక్ క్రిమేటోరియంలు తదితర వాయు నాణ్యత మెరుగుదల చర్యలకు వార్షిక కార్యాచరణ ప్రణాళికలు టిజిపిసిబి సిద్ధం చేసింది.

స్వచ్ఛ వాయు సర్వేక్షణలో తెలంగాణకు గుర్తింపు- కమిటి ఛైర్మన్, మెంబర్ కన్వీనర్ హర్షం

NCAౖా దేశవ్యాప్తంగా 130 నగరాల్లో తొలిసారిగా నిర్వహించిన వార్డు స్థాయి స్వచ్ఛ వాయు పర్యవేక్షణ్ లో తెలంగాణకు గుర్తింపు లభించింది. నల్గొండలోని 16వ వార్డు కేటగిరి 3 (10 వేల జనాభా) కింద జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించి రూ.20 లక్షల పురస్కారం పొందింది. అదేవిధంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్ 215వ వార్డు, గన్‌ఫౌండ్రీ 154వ వార్డు, సంగారెడ్డిలోని 31వ వార్డు రాష్ట్ర స్థాయిలో కేటగిరి 1,2,3 కింద అత్యుత్తమ పనితీరు కనబరిచిన వార్డులుగా నిలిచాయి.

సమన్వయంతో స్వచ్ఛ వాయు లక్ష్య సాధనకు టిజిపిసిబి కృషి - టిజిపిసిబి మెంబర్ సెక్రటరీ రవి రవాణా, మున్సిపల్ పరిపాలన, పరిశ్రమలు, ట్రాఫిక్ వ్యవసాయం, పట్టణాభివృద్ధి తదితర శాఖల సమన్వయంతోనే వాయు కాలుష్యానికి దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ, కమిటి మెంబర్ కన్వీనర్ రవి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అందుబాటులోకి వస్తున్న రియల్‌టైమ్ వాయు నాణ్యత డేటా, కాలుష్య మూలాల అధ్యయన ఫలితాలు, ఉద్గారాల సమగ్ర లెక్కింపు, శాస్త్రీయ అధ్యయనాలు, ఫీల్డ్ లెవల్ చర్యలను సమన్వయం చేసి కాలుష్య మూలాలను లక్ష్యంగా చేసుకుని టిజిపిసిబి చర్యలు చేపడుతున్నదని తెలిపారు.

ప్రజల భాగస్వామ్యం, సంబంధిత శాఖల సమన్వయం, శాస్త్రీయ పర్యవేక్షణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా తెలంగాణలో మెరుగైన వాయు నాణ్యతను సాధించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిరంతరం కృషి చేస్తున్నదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ హైదరాబాద్, సికింద్రాబాద్ లలో సిటి గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ను విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని కమిటి ఛైర్మన్ అహ్మద్ నదీమ్ సంస్థ అధికారులకు సూచించారు.

# తెలంగాణలో "మహిళా శక్తి"కి సరికొత్త వేదికలు




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**
తెలంగాణలో "మహిళా శక్తి"కి సరికొత్త వేదికలు రూపుదిద్దుకున్నాయి. రాష్ట్రంలోని జిల్లాల వారీగా నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి ముస్తాబైన 'ఇందిరా మహిళా శక్తి భవనాలు' మన ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక స్వావలంబనకు సరికొత్త నిలయాలుగా మారబోతున్నాయి! మన స్వయం సహాయక సంఘాల మహిళా సోదరీమణులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. శిక్షణ, ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల తయారీ నుంచి గ్లోబల్ మార్కెట్లలో విక్రయాల వరకు అవసరమైన ప్రతి అవకాశాన్ని ఒకే వేదికపై అందించేందుకు ఈ భవనాలు కీలక కేంద్రాలుగా నిలవనున్నాయి.ఒక ఆడబిడ్డకు అవకాశం లభిస్తే.. ఒక కుటుంబం భవిష్యత్తు మారుతుంది. రాష్ట్రంలో మహిళలకు అవకాశాలు పెరిగితే.. తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుంది!

"మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి" అనే ఆశయంతో.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు మరింత ఊతమిస్తూ, తెలంగాణ ప్రగతి ప్రయాణాన్ని మరింత వేగవంతం చేస్తోంది.

# తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే

## ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం: మంత్రి శ్రీధర్‌బాబు




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7:**
తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు.

జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా (ఐజు రాష్ట్రుఘ) ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు.

హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. "సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి" అని మంత్రి తెలిపారు.

మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు.

"హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

"ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది" అని చెప్పారు.

డిఇ షా నియోపొలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు.

"నియోపొలిస్‌లో డిఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం" అని శ్రీధర్‌బాబు అన్నారు.

కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఈ షా కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

"ఈ విస్తరణను తెలంగాణ స్వాగతిస్తోంది. రానున్న రోజుల్లో డీఈ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నాం" అని మంత్రి చెప్పారు. ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. "డిఇ షా నాయకత్వానికి నేను హామీ ఇస్తున్నాను. మీ వృద్ధి, విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు.

ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన పోరాట ఫలితమే... కోట మాల్యాద్రి..

**అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
అగ్రిగోల్డ్ బాధితుల ఒరిజినల్ బాండ్లు, ధ్రువపత్రాల పరిశీలనకు ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గత 15 సంవత్సరాలుగా సాగించిన నిరంతర పోరాటాల ఫలితమేనని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట మాల్యాద్రి అన్నారు. బుధవారం గుంటూరు సిపిఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలన్న డిమాండ్‌తో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆందోళనలు, పోరాటాలు నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు అసోసియేషన్ నాయకత్వంలో సాగించిన నిరంతర పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం ప్రస్తుతం బాండ్లు, ధ్రువపత్రాల పరిశీలనకు చర్యలు చేపట్టిందన్నారు.ఈ నెల 8వ తేదీ నుంచి గుంటూరు ఎస్పీ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితుల బాండ్లు, ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి




సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. బాధితులు ఒరిజినల్ బాండ్లు, ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, గుర్తింపు కార్డు జిరాక్స్, తాజా పాస్‌పోర్టు సైజు ఫొటోలు తదితర పత్రాలతో హాజరు కావాలని సూచించారు.అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారం కోసం సీపీఐ, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి నుంచి బాధితుల పక్షాన నిలిచి పోరాడుతున్నాయని మాల్యాద్రి తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన బాండ్ల పరిశీలన ప్రక్రియతో బాధితులకు న్యాయం జరిగే దిశగా మరో ముందడుగు పడిందన్నారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు అసోసియేషన్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# జల్ జీవన్ మిషన్--2.0 అమలులో సేవల నాణ్యతకు ప్రాధాన్యం

## నీటి వనరుల స్థిరత్వం, నాణ్యత పర్యవేక్షణను బలోపేతం చేయాలి: తాగునీరు, పారిశుద్ధ్య శాఖ కార్యదర్శి



**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
జల్ జీవన్ మిషన్--2.0 కింద గ్రామీణ తాగునీటి సేవలను మరింత స్థిరంగా, జవాబుదారీతనంతో అందించాలని కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య శాఖ కార్యదర్శి అశోక్ కె.కె. మీనా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకుసూచించారు.బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో బుధవారం నిర్వహించిన ప్రాంతీయ సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జాతీయ జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ కమల్ కిశోర్ సోన్, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మిషన్ రెండో దశలో మౌలిక సదుపాయాల నిర్మాణంతో పాటు, వాటి ద్వారా నిరంతర సేవలు అందేలా చూడటం కీలకమని మీనా అన్నారు. ఆమోదించిన పథకాలను వేగంగా అమలు చేసి, అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేయాలని సూచించారు. ఖర్చు చేసిన నిధులు పూర్తిస్థాయి, పనిచేసే వ్యవస్థలుగా మారాలని, నీటి వనరు నుంచి ప్రతి ఇంటి కుళాయి వరకు అనుసంధానం, విశ్వసనీయ డిజిటల్ రికార్డులు, సమర్థ పర్యవేక్షణ ఉండాలని చెప్పారు.

2019 ఆగస్టులో మిషన్ ప్రారంభమైనప్పుడు దేశంలో 3.27 కోట్ల గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 15.96 కోట్లకు మించిందని కార్యదర్శి తెలిపారు. ఈ పురోగతిని నిలబెట్టేందుకు నీటి వనరుల స్థిరత్వం, ఆర్థిక, నిర్వహణ సామర్థ్యం, నీటి నాణ్యత, ప్రజలకు కేంద్రంగా సేవలందించడంపై జల్ జీవన్ మిషన్--2.0 దృష్టి సారిస్తోందన్నారు.

ఒక గ్రామానికి, పలు గ్రామాలకు నీటిని అందించే పథకాలఅమలును వేగవంతం చేయాలని, ముఖ్యంగా నాణ్యత సమస్యలున్న ప్రాంతాల్లో సకాలంలో చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. జల్ సేవా అధ్యయనం ప్రకారం పైప్‌లైన్ లీకేజీలు, పగుళ్లు నీటి సరఫరానిలిచిపోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. విద్యుత్ అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలూ సరఫరాపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొంటూ, తక్షణ పరిష్కారాలతో పాటు దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని అన్నారు.

గ్రామీణ తాగునీటి వ్యవస్థల్లో సౌరశక్తి వినియోగాన్ని పరిశీలించేందుకు నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖతో చర్చలు జరుగుతున్నాయని మీనా తెలిపారు. సౌరశక్తి ఆధారిత పరిష్కారాలు నిర్వహణ ఖర్చులను తగ్గించి, సేవల విశ్వసనీయతను, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని పెంచగలవని చెప్పారు.

తక్కువ వోల్టేజీ, విద్యుత్ నాణ్యత సమస్యలు పథకాల నిర్వహణను దెబ్బతీస్తున్నాయని కమల్ కిశోర్ సోన్ తెలిపారు. విద్యుత్ వ్యయాన్ని, పునరావృత నిర్వహణ ఖర్చులను తగ్గించే ఆచరణాత్మక మార్గాలను రాష్ట్రాలు సమష్టిగా గుర్తించాలని కోరారు. ఐఐఎం బెంగళూరుకు చెందిన జల్ జీవన్ మిషన్ ప్రొఫెసర్ గోపాల్ నాయక్ "జేజేఎం పథకాల్లో విద్యుత్ వ్యయాన్ని తగ్గించడం"పై అధ్యయనాన్ని సమర్పించారు. గ్రిడ్ విద్యుత్, సౌరశక్తి నమూనాలను పరిశీలించి, నిర్వహణతో పాటు జీవితకాల వ్యయాలపై వాటి ప్రభావాన్ని వివరించారు.

నీటి నాణ్యత నిర్వహణ సమాచార వ్యవస్థ (డబ్ల్యూక్యూఎంఐఎస్) వివరాల ఆధారంగా చేసిన అధ్యయనాలు, జల్ జీవన్ మిషన్ అమలుతో పలు నీటి నాణ్యత ప్రమాణాల్లో మెరుగుదల కనిపించిందని సూచించాయి. ప్రయోగశాల వ్యవస్థలు, స్వతంత్ర పర్యవేక్షణ, సమాజ ఆధారిత నీటి నాణ్యత నిర్వహణను మరింత బలోపేతం చేయాలని సమావేశంలో చర్చించారు.

నీటి నాణ్యత సమాచారాన్ని గ్రామపంచాయతీలు, ప్రజలకు అందుబాటులో ఉంచాలని మీనా సూచించారు. గ్రామసభలు పరీక్షల ఫలితాలను సమీక్షించి, అవసరమైన దిద్దుబాటు చర్యలను గుర్తించాలని అన్నారు. పారదర్శకత, జవాబుదారీతనానికి స్వతంత్ర నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు.

రాష్ట్ర అమలు ప్రణాళికలు, ఆర్థిక లెక్కల సరిచూడటం, పీఎం–జన్‌మన్ గ్రామాల్లో "హర్ ఘర్ జల్" ధ్రువీకరణ, జల్ అర్పణ, డిజిటల్ పాలన, నీటి నాణ్యత నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో సమీక్షించారు. "జల్ అర్పణ"లో భాగంగా పథకాలను గ్రామపంచాయతీలు, గ్రామ నీరు, పారిశుద్ధ్య కమిటీలకు అధికారికంగా అప్పగించే ప్రక్రియను అన్ని హర్ ఘర్ జల్ గ్రామాల్లో పూర్తి చేయాలని సోన్ కోరారు. ఆమోదిత ప్రాంతీయ భాషల్లో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రజా సంస్థల్లో నీటి నాణ్యత పరీక్షలను వేగవంతం చేసి, ఫలితాలను నిర్దేశిత డిజిటల్ వేదికల్లో సకాలంలో నమోదు చేయాలని ఆయన అన్నారు. గ్రామపంచాయతీ స్థాయిలో నిర్వహణ మాన్యువల్‌ను అమలు చేయడం, నీటి వనరుల ప్రణాళిక, పర్యవేక్షణకు నిర్ణయ సహాయక వ్యవస్థను (డీఎస్ఎస్) ఉపయోగించడం, పంచాయతీరాజ్ సంస్థలతో సమన్వయం పెంచడం, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేయడం, ఆర్థిక సంఘం నిబంధనలు పాటించడం వంటి అంశాలపైనా దృష్టి సారించాలని రాష్ట్రాలకు సూచించారు. జీజీవీ 2.0 సంస్కరణల లక్ష్యాలను చేరేందుకు స్పష్టమైన అమలు ప్రణాళికలు రూపొందించాలని సమావేశం ముగింపులో పిలుపునిచ్చారు.

# లైవ్ ఈవెంట్ల రంగం ఏడాదిలో 44 శాతం వృద్ధి

## 2030 నాటికి రంగాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యం: చంచల్ కుమార్

**కోటి మందికి పైగా జీవనోపాధి.. 1.5--2 కోట్ల ఉద్యోగాల కల్పనకు అవకాశం**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
దేశంలో లైవ్ ఈవెంట్ల రంగం గత ఏడాదిలో 44 శాతం వృద్ధి సాధించిందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి చంచల్ కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 34 వేల కార్యక్రమాలు జరిగాయని, ఈ రంగం కోటి మందికి పైగా జీవనోపాధి కల్పిస్తోందని చెప్పారు. 2030 నాటికి రంగాన్ని రెట్టింపు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ప్రత్యక్ష, అనుబంధ రంగాల్లో 1.5 నుంచి 2 కోట్ల ఉద్యోగాలు సృష్టించే అవకాశముందని పేర్కొన్నారు.

లైవ్ ఈవెంట్స్ డెవలప్‌మెంట్ సెల్ (ఎల్‌ఈడీసీ) ఐదో సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలు, రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి పనిచేయడానికి ఎల్‌ఈడీసీ మంచి వేదికగా నిలుస్తోందన్నారు. ఇందులో 14 కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, 21 పరిశ్రమల సంఘాలు భాగస్వాములుగా ఉన్నాయి. సంస్కరణల్లో భాగంగా నమూనా కార్యనిర్వాహక ఉత్తర్వు, ఇండియా సినీ హబ్ పోర్టల్‌లో సింగిల్ విండో విధానం, అనుమతుల సరళీకరణ, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. నోడల్ అధికారులను నియమించిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంఖ్య 16 నుంచి 29కు పెరిగిందని తెలిపారు.

లైవ్ ఈవెంట్లకు అవసరమైన అనుమతులన్నింటినీ ఇండియా సినీ హబ్ (ఐసీహెచ్) పోర్టల్ ద్వారా అందించే విధానాన్ని సమావేశం సమీక్షించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నోడల్ అధికారులను నియమించి, సంబంధిత శాఖల నుంచి అధీకృత అధికారులను నామినేట్ చేయాలని సూచించారు. శాఖల, స్థానిక సంస్థల లైసెన్సింగ్ వ్యవస్థలను ఐసీహెచ్ పోర్టల్‌తో అనుసంధానించి, దరఖాస్తు నుంచి లైసెన్స్ జారీ వరకు మొత్తం ప్రక్రియను ఈ వేదిక ద్వారానే నిర్వహించాలని కోరారు. ఈవెంట్ వేదికలను పోర్టల్‌లో నమోదు చేసి, లైసెన్సుల జారీని గడువుతో కూడిన ప్రజాసేవగా ప్రకటించాలని సూచించారు.

లైవ్ ఈవెంట్ల లైసెన్సులు, అనుమతుల సరళీకరణకు రూపొందించిన 2026 నమూనా కార్యనిర్వాహక ఉత్తర్వును ఇప్పటివరకు ఐదు రాష్ట్రాలు స్వీకరించాయి. మార్చి 13న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపిన ఈ ఉత్తర్వు అమలుపై మహారాష్ట్ర సమావేశంలో వివరించింది. మిగతా రాష్ట్రాలు కూడా త్వరగా ఆమోదించాలని కోరారు. విదేశీ ప్రదర్శకుల స్వల్పకాలిక పర్యటనలకు సంబంధించి ఎఫ్ఆర్ఆర్ఓ పునఃనమోదు నిబంధనలను కేంద్ర హోం శాఖ సరళీకరించినట్లు సమావేశంలో తెలిపారు.

కళాకారులు, సిబ్బందికి గ్రూప్ వీసాలు, ప్రదర్శన పరికరాలపై కస్టమ్స్ సుంకం మినహాయింపు, లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ నైపుణ్యాలను జాతీయ నైపుణ్య అర్హతల చట్రంలో చేర్చడం, శిక్షణ, ధ్రువీకరణ కేంద్రాలు, అప్రెంటిస్‌షిప్ కార్యక్రమాల అమలుపై సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖల సహకారాన్ని కోరారు. ఈవెంట్ ఆధారిత పర్యాటకంలో భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా ప్రోత్సహించడం, జీఎస్టీని సమీక్షించడం, సీఎస్ఆర్ నిధుల అనుసంధానం, వైయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్), మిశ్రమ ఆర్థిక సహాయం, ఎంఎస్ఎంఈ రంగంలో లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు గుర్తింపు వంటి అంశాలూ చర్చకు వచ్చాయి.

తదుపరి దశ సంస్కరణల్లో భాగంగా, పలు హక్కుల సంఘాల నుంచి వచ్చే వేర్వేరు డిమాండ్లకు బదులుగా నిర్ణీత రుసుములతో ఒకే జాతీయ సంగీత లైసెన్స్ విధానాన్ని ప్రతిపాదించారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనల కింద వినోద కార్యక్రమాల ప్రత్యేక ప్రాంతాలను ప్రకటించడం, విదేశీ కళాకారులకు చెల్లింపులపై విదేశీ నగదు బదిలీ పరిమితులను సడలించడం వంటి అంశాలనూ పరిశీలించారు.

భారత పురావస్తు సర్వేక్షణ (ఏఎస్ఐ), భారత క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏఐ) తమ ఆధీనంలోని ప్రాంగణాల్లో లైవ్ ఈవెంట్ల నిర్వహణకు ప్రామాణిక నిర్వహణ విధానాలను జారీ చేశాయి. ప్రధాన వేదికలకు ముందస్తు అనుమతి కల్పిస్తే, ప్రతి కార్యక్రమానికి అదే వేదిక స్థాయి అనుమతులను మళ్లీ పొందాల్సిన అవసరం ఉండదని సమావేశంలో వివరించారు.

ప్రత్యేకంగా కార్యక్రమాల కోసం నిర్మించిన వేదికల కొరతను అధిగమించేందుకు బ్రౌన్‌ఫీల్డ్, గ్రీన్‌ఫీల్డ్ వేదికల అభివృద్ధి ముసాయిదాపై చర్చించారు. రాష్ట్రాలు, పరిశ్రమల ప్రతినిధులు, క్రీడా సంస్థలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. నిర్దిష్ట సామర్థ్యానికి మించిన లైవ్ ఈవెంట్, ప్రదర్శన వేదికలను మౌలిక సదుపాయాల ఉపరంగాల సమగ్ర జాబితాలో చేర్చడం, రాష్ట్రాలు ప్రత్యేక వేదికలను గుర్తించి అభివృద్ధి చేయడం, వీజీఎఫ్ పథకం ద్వారా ప్రాజెక్టులకు సహకారం అందించడం వంటి ప్రతిపాదనలు చర్చించారు.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసీ) ఉపకులపతి అధ్యక్షతన ఉన్న లైవ్ ఈవెంట్ స్కిల్లింగ్ కమిటీ, శిక్షణ పాఠ్యాంశాల పురోగతిని వివరించింది. ఐఐఎంసీ, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్కిల్స్ కౌన్సిల్ (ఎంఈఎస్‌సీ), ఈఈఎంఏ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో పాటు సర్టిఫికెట్, స్వల్పకాలిక కోర్సుల వివరాలను సమర్పించింది. మహిళలు, దివ్యాంగుల భద్రతకు సమ్మిళిత మార్గదర్శకాలు, గ్రీన్ కాన్సర్ట్ ప్రోటోకాల్‌ను పరిశ్రమ సహకారంతో వేవ్స్--2027లో ప్రారంభించే ప్రతిపాదనను సమావేశంలో చర్చించారు.

దేశ లైవ్ ఈవెంట్ల రంగానికి అనుకూలమైన, వృద్ధికి తోడ్పడే వాతావరణాన్ని నిర్మించేందుకు అన్ని భాగస్వాములతో కలిసి పనిచేస్తామని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సమావేశం ముగింపులో పునరుద్ఘాటించింది

## సూరి & నివిన్ పులి నటించిన సప్తసాగరాలు సప్తగిరులు అక్టోబర్ 9న థియేటర్స్ లో విడుదల !!!







నివిన్ పౌలీ, సూరి, అంజలి ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ సినిమాను తెలుగులో సప్తసాగరాలు సప్తగిరులు పేరుతో డబ్ చేసి రిలీజ్ చేయనున్నారు.

సప్తసాగరాలు సప్తగిరులు సినిమాను కలర్స్ అండ్ క్లాప్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ఎం.సుబ్బారెడ్డి ఈ సినిమాను తెలుగులో గ్రాండ్ గా అక్టోబర్ 9న విడుదల చేస్తున్నారు.

ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది, ఇటీవల విడుదలైన మందాడి సినిమాతో సక్సెస్ సాధించిన సూరి అలాగే బెతలహెమ్ కుటుంబ యూనిట్ సినిమాతో సంచలన విజయం సాధించిన నివీన్ పులె ఈ సినిమాలో నటించడం విశేషం

రొమాంటిక్ సైకాలాజికల్ థ్రిల్లర్ నేపథ్యం లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది తమిళ్ లో తంగ మీన్కల్, తారమణి, పెరంబు వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన రామ్ ఈ సినిమాను డైరెక్ట్ చేశాడు, యువన్ శంకర్ రాజా ఈ సినిమాకు సంగీతం అందించారు.

సంచారి పేరుతో ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రం సప్తసాగరాలు సప్తగిరులు పేరుతో అక్టోబర్ 9న థియేటర్స్ లో గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది.

## 3 నిమిషాల 47 సెకండ్ల నిడివితో సర్ ప్రైజింగ్ కంటెంట్ తో రేపు రిలీజ్ కాబోతున్న విజయ్ దేవరకొండ "రణబాలి" ట్రైలర్



ఈ విజయదశమి సెలబ్రేషన్స్ ను మరింత ప్రత్యేకంగా మారుస్తూ ఈ నెల 16న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది విజయ్ దేవరకొండ "రణబాలి" సినిమా. రిలీజ్ కు దగ్గరవుతున్నా కొద్దీ ప్రమోషన్స్ ను ఇంటెన్స్ గా చేస్తున్నారు మూవీ టీమ్. సినిమా ప్రమోషన్ లో ఎంతో ఇంపార్టెంట్ గా భావించే ట్రైలర్ రేపు (ఈనెల 8వ తేదీన) సాయంత్రం 6.03 నిమిషాలకు విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. "రణబాలి" ట్రైలర్ ను 3 నిమిషాల 47 సెకన్ల నిడివితో సర్ ప్రైజింగ్ కంటెంట్ తో తీసుకురాబోతున్నారు. ఇలాంటి ప్రెస్టీజియస్ మూవీకి ఇంత లెంగ్త్ ట్రైలర్ కట్ చేయడం చూస్తుంటే సినిమా కంటెంట్ మీద, మూవీ సాధించబోయో సక్సెస్ మీద టీమ్ కు గట్టి నమ్మకం ఉన్నట్లు తెలుస్తోంది.

భారీ ట్రైలర్ రిలీజ్ చేస్తూ "రణబాలి" టీమ్ తమ కాన్ఫిడెంట్ ను, గట్స్ ప్రూవ్ చేసుకుంటున్నారు. రా, రూటెడ్, స్టోరీటెల్లింగ్ తో వస్తున్న ఈ ట్రైలర్ సినిమా మీద అంచనాలు మరింత పెంచబోతోంది. ఇప్పటికే డాక్యు సిరీస్ ద్వారా ఈ సినిమాపై మంచి హైప్ క్రియేట్ అయ్యింది. సాంగ్స్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. విజయ్, రశ్మిక, డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ చేస్తున్న కాంబో ఇంటర్వ్యూస్ సినిమాను ఆడియెన్స్ లోకి బాగా తీసుకెళ్లాయి. విజయ్, రశ్మిక ఫస్ట్ హిందీ పాడ్ కాస్ట్ వ్యూస్ లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇలా కంప్లీట్ పాజిటివ్ మోడ్ లో "రణబాలి" రిలీజ్ కు రెడీ అవుతోంది.

## సముద్ర రక్షణ సన్నద్ధతపై సమీక్ష.. సారెక్స్--2026ను ప్రారంభించిన రక్షణ శాఖ సహాయ మంత్రి

### 24వ జాతీయ సముద్ర శోధన, రక్షణ బోర్డు సమావేశంలో సన్నద్ధతపై చర్చలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):** బహుళజాతి శోధన, రక్షణ విన్యాసం సారెక్స్--2026ను రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ బుధవారం ప్రారంభించారు. ఈ విన్యాసం అక్టోబర్ 8న పారాదీప్ సముద్ర తీరంలో జరగనుంది. 30 విదేశీ స్నేహపూర్వక దేశాల నుంచి 32 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొనడంతో పాటు పరిశీలించనున్నారు.



అంతర్జాతీయ సంస్థలు, స్నేహపూర్వక దేశాల ప్రతినిధులకు మంత్రి స్వాగతం పలుకుతూ, ప్రాంతీయ సహకారం, సముద్ర భద్రతను బలోపేతం చేయడంలో వారి భాగస్వామ్యం కీలకమని అన్నారు. నౌకాదళం, తీర రక్షక దళం, వాయుసేన, తీరప్రాంత పోలీసులు, ఓడరేవులు, పౌర సంస్థలు, నౌకాయాన రంగం, అంతర్జాతీయ భాగస్వాములు కలిసి పాల్గొనడం ఆధునిక సముద్ర భద్రతకు సమష్టి ప్రభుత్వ, జాతీయ స్థాయి కృషి అవసరమని తెలియజేస్తోందని పేర్కొన్నారు.

సహకారం, సన్నద్ధత, సాంకేతిక పురోగతి ద్వారా భారత్ శోధన, రక్షణ సామర్థ్యాలను నిరంతరం బలోపేతం చేస్తోందని సంజయ్ సేథ్ తెలిపారు. ఉపగ్రహ ఆధారిత శోధన, రక్షణలో లో ఎర్త్ ఆర్బిట్ (లియోసార్) నుంచి జియోస్టేషనరీ ఆర్బిట్ (జియోసార్), ప్రస్తుతం మీడియం ఎర్త్ ఆర్బిట్ (మియోసార్) వ్యవస్థల దిశగా భారత్ ముందుకు సాగుతోందన్నారు. భారత భూ-కక్ష్య లోకల్ యూజర్ టెర్మినల్ (మియోలట్) పూర్తి స్థాయి కార్యాచరణ సామర్థ్యాన్ని సాధించడం దేశ ఉపగ్రహ ఆధారిత శోధన, రక్షణ రంగంలో ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఇస్రో, సంబంధిత బృందాలను ఆయన అభినందించారు.

సముద్రంలో ప్రాణాలను కాపాడటమే ప్రతి శోధన, రక్షణ చర్యకు ప్రధాన లక్ష్యమని, అందుకోసం భాగస్వామ్య సంస్థలు, అంతర్జాతీయ సహచరులు తమ సమష్టి నిబద్ధతను మరింత బలోపేతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. "ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు" స్ఫూర్తితో కృషి చేస్తే మరింత సురక్షితమైన, స్థితిస్థాపకమైన, సహకారంతో కూడిన సముద్ర సమాజాన్ని నిర్మించవచ్చన్నారు.

వికసిత్ భారత్--2047 లక్ష్యం దిశగా సాగుతున్న క్రమంలో దేశ శోధన, రక్షణ సామర్థ్యాలు మరింత వేగవంతంగా, కచ్చితంగా, స్థితిస్థాపకంగా మారాలని సంజయ్ సేథ్ అన్నారు. అభివృద్ధి చెందిన భారత్ సురక్షితమైన, సాంకేతికంగా ముందున్న సముద్ర దేశంగానూ ఎదగాలని, భారత తీర రక్షక దళ నినాదం "వయం రక్షామః" (మేము రక్షిస్తాం) ఈ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

సారెక్స్--2026 బహుళ సంస్థల భాగస్వామ్యంతో జరిగే విన్యాసం. కార్యాచరణ సన్నద్ధతను నిర్ధారించడం, అంతర్జాతీయ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడం, ఉమ్మడి స్పందన విధానాలను పరీక్షించడం, ఉత్తమ పద్ధతులను పంచుకోవడం దీని లక్ష్యాలు.

**4.6 మిలియన్ చదరపు కిలోమీటర్ల ప్రాంతంపై సమీక్ష**

భారత తీర రక్షక దళ డైరెక్టర్ జనరల్, జాతీయ సముద్ర శోధన, రక్షణ బోర్డు ఛైర్మన్ పరమేశ్ శివమణి అధ్యక్షతన 24వ జాతీయ సముద్ర శోధన, రక్షణ బోర్డు సమావేశం కూడా బుధవారం జరిగింది. 4.6 మిలియన్ చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న భారత శోధన, రక్షణ ప్రాంతంలో సన్నద్ధతను బోర్డు సమీక్షించింది.

సాంకేతిక అనుసంధానం, తక్షణ సమాచార మార్పిడి, ప్రమాద సంకేతాల నిర్వహణ, నౌకల పర్యవేక్షణ, వివిధ సంస్థల మధ్య సమన్వయంపై చర్చించారు. గతంలో చేపట్టిన రక్షణ చర్యలు, బహుళ సంస్థల విన్యాసాల నుంచి నేర్చుకున్న పాఠాలను కార్యాచరణ సన్నద్ధత, స్పందన సామర్థ్యాల పెంపునకు నేరుగా వినియోగించాలని ఛైర్మన్ సూచించారు. సముద్రంలో ప్రాణాలను కాపాడటంలో విశేష కృషి చేసిన వారికి జాతీయ సముద్ర శోధన, రక్షణ అవార్డులు--2026ను ఈ సమావేశంలో ప్రదానం చేశారు.

## శ్రీ మహాలక్ష్మి జువెల్లర్స్ అండ్ డైమండ్స్ 'ది ట్రెజర్ చెస్ట్'ను ఆవిష్కరించిన అల్లు స్నేహా రెడ్డి




**అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):** అరుదైన ఆభరణాలు, అద్భుతమైన డిజైన్లు, నైపుణ్యంతో కూడిన కళాత్మకతను ఒకే వేదికపై పరిచయం చేస్తూ శ్రీ మహాలక్ష్మి జువెల్లర్స్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో 'ది ట్రెజర్ చెస్ట్' ప్రత్యేక జువెలరీ షోకేస్ నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో ఈ ప్రత్యేక ప్రదర్శన జరగనుంది.

హెరిటేజ్ డైమండ్ జువెలరీ, ఆకట్టుకునే సోలిటైర్ డైమండ్స్, అందమైన పోల్కీ ఆభరణాలతో పాటు విలువైన రత్నాలతో రూపొందించిన ప్రత్యేకమైన నగలను ఈ షోకేస్‌లో ప్రదర్శిస్తున్నారు. కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా ప్రత్యేకంగా డిజైన్ చేసే అవకాశం, వ్యక్తిగత జువెలరీ కన్సల్టేషన్ వంటి ప్రత్యేక సేవలు కూడా అందుబాటులో ఉంటాయి.




అక్టోబర్ 7న శ్రీమతి అల్లు స్నేహా రెడ్డి చేతుల మీదుగా 'ది ట్రెజర్ చెస్ట్' ఘనంగా ప్రారంభమైంది. సంప్రదాయ ఆభరణాల కళాత్మకతకు ఆధునిక డిజైన్లను జోడిస్తూ రూపొందించిన ఈ ప్రత్యేక ప్రదర్శనలో జీవితంలోని అరుదైన, ప్రత్యేక సందర్భాల కోసం రూపొందించిన అద్భుతమైన ఆభరణాలను జువెలరీ ప్రియులు వీక్షించవచ్చు.

## గ్రామీణ రహదారుల నాణ్యత, నిర్వహణకు సాంకేతికతను విస్తరించాలి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):** గ్రామీణ ప్రాంతాలకు అన్ని కాలాల్లోనూ రాకపోకలు సాగించే రహదారులను అందించేందుకు సాంకేతికతను మరింతగా వినియోగించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ--రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సూచించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో అక్టోబర్ 5, 6 తేదీల్లో నిర్వహించిన ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) చింతన్ శిబిరంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులు, విధాన రూపకర్తలు, సాంకేతిక నిపుణులు, ఇతర భాగస్వాములు ఈ సమావేశంలో పాల్గొన్నారు.




గత 25 ఏళ్లలో పీఎంజీఎస్‌వై వివిధ దశల కింద సుమారు 8 లక్షల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు నిర్మించారని మంత్రి తెలిపారు. పక్కా రహదారి కేవలం ప్రయాణ సౌకర్యాన్నే కాకుండా, గ్రామీణ ప్రజలకు అనేక అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని పేర్కొన్నారు. పథకానికి అర్హత ఉన్న ప్రతి ఆవాసానికి రహదారి అనుసంధానం కల్పించడంపై దృష్టి పెట్టాలని అన్నారు.

పీఎంజీఎస్‌వై--IV కింద రూ.70,125 కోట్ల వ్యయంతో 25 వేల అర్హతగల, రహదారి అనుసంధానం లేని ఆవాసాలకు సుమారు 62,500 కిలోమీటర్ల అన్ని కాలాల రహదారులు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనుల పురోగతి, క్షేత్రస్థాయి పరిస్థితుల తనిఖీ, సకాలంలో నిర్ణయాల కోసం డిజిటల్ సాంకేతికత, జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ, కృత్రిమ మేధ వినియోగాన్ని పెంచాలని చౌహాన్ సూచించారు. అమలులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి నిపుణులు, విధాన రూపకర్తల మార్గదర్శకత్వం తీసుకోవాలని అన్నారు.

కొనసాగుతున్న పనులను గడువులోగా పూర్తి చేయడం, వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) త్వరగా సిద్ధం చేయడం, టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడం, నిర్మాణ నాణ్యతను మెరుగుపరచడం, ముందస్తు నిర్వహణ చేపట్టడం అవసరమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి స్థాయిలో జవాబుదారీతనాన్ని పెంచాలని సూచించారు.

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాస్వాన్ మాట్లాడుతూ, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు, క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో ఆలస్యమైన, పెండింగ్ పనులపై నిరంతర పర్యవేక్షణ అవసరమని అన్నారు. రహదారుల నిర్మాణం పూర్తయిన తర్వాత ఐదేళ్ల నిర్వహణ కాలంలో కాంట్రాక్టర్ల బాధ్యతను పక్కాగా అమలు చేయాలని సూచించారు. పీఎంజీఎస్‌వై--IIIలో కింద వాస్తవంగా మిగిలిన అనుసంధాన లోటులను పరిశీలించి, పనుల్లో అడ్డంకులను సకాలంలో పరిష్కరించేందుకు భాగస్వామ్య సంస్థల మధ్య సమన్వయం పెంచాలని కోరారు. పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు పర్యావరణహిత సాంకేతికతలను వినియోగించాలని రాష్ట్రాలకు సూచించారు.

గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి రోహిత్ కన్సల్ పథకం అమలును మరింత పారదర్శకంగా, బలోపేతంగా చేసేందుకు చేపట్టిన కొత్త కార్యక్రమాలను వివరించారు. నిర్మాణ నాణ్యత మెరుగుదలకు, సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఉపయోగపడే కొత్త సాంకేతిక సాధనాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు త్వరగా స్వీకరించాలని కోరారు.

నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవడానికి రాష్ట్రాలు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో మిషన్ తరహాలో పనిచేయాలని కన్సల్ అన్నారు. రహదారుల నాణ్యత, నిర్వహణ విషయంలో రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. పథకం కింద సాధించిన పురోగతిని అభినందిస్తూ, తదుపరి లక్ష్యాల సాధనకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న రాష్ట్రాల ప్రతినిధులు, ఇతర భాగస్వాముల అనుభవం, చురుకైన భాగస్వామ్యం పథకం లక్ష్యాలను చేరుకోవడంలో కీలకమని తెలిపారు.

## అనుబంధ ఆరోగ్య విద్య, వృత్తుల్లో ప్రమాణాల బలోపేతానికి ఎన్‌సీఏహెచ్‌పీ చర్యలు

**సంస్థల నాణ్యత అంచనాకు స్వతంత్ర బోర్డులు, కేంద్ర మదింపు కమిటీ**
**మెడికల్ రేడియాలజీ డిప్లొమాకు ఏకరీతి పాఠ్యప్రణాళిక..**
**యూఐడీ, క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ రిజిస్ట్రేషన్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):** అనుబంధ, ఆరోగ్య వృత్తుల విద్యలో ప్రమాణాలు, పారదర్శకత, నాణ్యతను పెంచేందుకు జాతీయ అనుబంధ, ఆరోగ్య వృత్తుల కమిషన్ (ఎన్‌సీఏహెచ్‌పీ) కొత్త నిబంధనలు, పాఠ్యప్రణాళికను ప్రకటించింది. స్వతంత్ర బోర్డులు, కేంద్ర మదింపు కమిటీ ఏర్పాటు; మెడికల్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ డిప్లొమాకు సామర్థ్య ఆధారిత పాఠ్యప్రణాళిక; వృత్తి నిపుణుల డిజిటల్ రిజిస్ట్రేషన్ ఇందులో ఉన్నాయి.

2021 జాతీయ అనుబంధ, ఆరోగ్య వృత్తుల కమిషన్ చట్టం కింద స్వతంత్ర బోర్డులు, కేంద్ర మదింపు కమిటీ ఏర్పాటు, నిర్మాణం, విధులు, అధికారాలకు సంబంధించిన నిబంధనలను కమిషన్ జారీ చేసింది. గుర్తింపు పొందిన కోర్సుల ప్రమాణాల అమలు, విద్యా నాణ్యత, సంస్థల తనిఖీ, మదింపు, రేటింగ్ కోసం ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

**విద్య, మదింపు, నైతిక ప్రమాణాల పర్యవేక్షణ**

రాష్ట్ర అనుబంధ, ఆరోగ్య వృత్తుల మండళ్ల పరిధిలో ఏర్పాటు చేసే స్వతంత్ర బోర్డుల్లో అధ్యక్షుడితో పాటు 10 నుంచి 20 మంది సభ్యులు ఉంటారు. గుర్తింపు పొందిన వృత్తి విభాగాలకు ప్రాతినిధ్యం కల్పిస్తారు. అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ బోర్డులు కోర్సుల ప్రమాణాలు, సామర్థ్య ఆధారిత విద్య, అధ్యాపకుల శిక్షణ, పరిశోధనను ప్రోత్సహిస్తాయి.

అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు సంస్థల గుర్తింపు దరఖాస్తులు, అనుమతులను పరిశీలించడం, తనిఖీలు నిర్వహించడం, వార్షిక వివరాలను సమీక్షించడం, మదింపుదారులను ఎంపిక చేయడం, సంస్థలకు రేటింగ్ ఇవ్వడం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తుంది. ఈ సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచుతారు.

ఎథిక్స్ అండ్ రిజిస్ట్రేషన్ బోర్డు వృత్తి నిపుణుల పత్రాలను పరిశీలించి రిజిస్ట్రేషన్‌కు సిఫారసు చేయడంతో పాటు, నైతిక నియమాలు, ఫిర్యాదులు, ఉల్లంఘనలపై చర్యలకు సిఫారసు చేస్తుంది.

క్రియాశీల రాష్ట్ర మండలి లేని రాష్ట్రాల్లో ఎన్‌సీఏహెచ్‌పీ పర్యవేక్షణలో కేంద్ర మదింపు కమిటీ (సీఏసీ) ఈ బాధ్యతలు చేపడుతుంది. ఇందులో అధ్యక్షుడితో సహా 10 నుంచి 30 మంది సభ్యులు ఉంటారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తారు. సభ్యుల తొలగింపునకు కారణాలు, విచారణ ప్రక్రియ, తమ వాదన వినిపించే అవకాశం వంటి అంశాలనూ నిబంధనలు నిర్దేశించాయి.

**డి.ఎంఆర్ఐటీకి రెండేళ్ల కోర్సు, ఆరు నెలల ఇంటర్న్‌షిప్**

"వన్ నేషన్ వన్ కరిక్యులమ్"లో భాగంగా మెడికల్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ డిప్లొమా (డి.ఎంఆర్ఐటీ)కు సామర్థ్య ఆధారిత పాఠ్యప్రణాళికను సెప్టెంబర్ 30న ఎన్‌సీఏహెచ్‌పీ ప్రకటించింది. ఈ కోర్సు నిర్వహిస్తున్న, ప్రారంభించాలనుకునే సంస్థలు 2027--28 విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠ్యప్రణాళికను తప్పనిసరిగా అమలు చేయాలి. 2026--27లోనే అమలు చేయాలనుకునే సంస్థలు అప్పటి నుంచే స్వీకరించవచ్చు.

ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీతో ఇంటర్మీడియట్ లేదా సమాన విద్యార్హత ఉన్నవారు ఈ రెండేళ్ల డిప్లొమాకు అర్హులు. ఇందులో ఆరు నెలల క్లినికల్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, డయాగ్నస్టిక్ కేంద్రాల్లో పనిచేసే నిపుణుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కోర్సును రూపొందించారు. ఎక్స్‌రే, సీటీ స్కాన్, సోనోగ్రఫీ, మామోగ్రఫీ, ఫ్లోరోస్కోపీ వంటి పరీక్షల్లో అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యాలతో పాటు రోగి భద్రత, రేడియేషన్ రక్షణ, నాణ్యతా ప్రమాణాలపై శిక్షణ ఇస్తారు.

రేడియాలజీ, ఇమేజింగ్ టెక్నాలజీలో బ్యాచిలర్, మాస్టర్స్ కోర్సుల పాఠ్యప్రణాళికలను కమిషన్ గతంలో ప్రకటించింది. వివిధ అనుబంధ, ఆరోగ్య వృత్తుల కోసం ఇప్పటివరకు 20 సామర్థ్య ఆధారిత పాఠ్యప్రణాళికలను విడుదల చేసింది.

**యూఐడీ, క్యూఆర్ కోడ్‌తో వృత్తి నిపుణుల గుర్తింపు**

2026 రిజిస్ట్రేషన్ నిబంధనలు రాష్ట్ర, కేంద్ర రిజిస్టర్లలో వృత్తి నిపుణుల నమోదుకు ఆన్‌లైన్ విధానాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. ఈ నిబంధనలు సెప్టెంబర్ 15న గెజిట్‌లో ప్రచురితమయ్యాయి. గుర్తింపు పొందిన ప్రాథమిక అర్హత ఉన్నవారే సంబంధిత వృత్తిలో పనిచేయడానికి రిజిస్ట్రేషన్ పొందాలి. క్రియాశీల రాష్ట్ర మండలి లేని ప్రాంతాల్లోని నిపుణులు నేరుగా కేంద్ర రిజిస్టర్‌లో నమోదు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్ ఐదేళ్లపాటు చెల్లుబాటు అవుతుంది. ఆమోదిత నిరంతర వృత్తి అభివృద్ధి (సీపీడీ) శిక్షణ పూర్తి చేసిన అనంతరం పునరుద్ధరించుకోవచ్చు. ప్రతి నమోదిత నిపుణుడికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఐడీ) ఇస్తారు. యూఐడీ, సురక్షిత క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ సర్టిఫికెట్‌ను కమిషన్ లేదా సంబంధిత రాష్ట్ర మండలి జారీ చేస్తుంది. రాష్ట్ర, కేంద్ర రిజిస్టర్ల వివరాలు ఆన్‌లైన్‌లో పరస్పరం సమకాలీకరించబడతాయి; కమిషన్, రాష్ట్ర మండళ్ల వెబ్‌సైట్లలో ప్రజలు రిజిస్ట్రేషన్ స్థితిని తనిఖీ చేయవచ్చు.

గుర్తింపు పొందిన సంస్థల్లో చదువుతూ ఇంటర్న్‌షిప్, క్లినికల్ శిక్షణ లేదా ప్రాయోగిక కోర్సులు చేస్తున్న విద్యార్థులకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పిస్తారు. దీని కోసం విద్యార్థులు సంబంధిత రాష్ట్ర మండలిని సంప్రదించాలి; దరఖాస్తుకు రుసుము ఉండదు. విదేశీ అర్హతలు పొందిన భారతీయులకు గుర్తింపు, సమానత్వ పరిశీలన, అవసరమైన పరీక్షల ఆధారంగా రిజిస్ట్రేషన్ పొందే మార్గాన్ని కూడా నిబంధనలు కల్పిస్తున్నాయి. విదేశీ నిపుణులకు నిర్దిష్ట, కాలపరిమిత కార్యక్రమాల కోసం తాత్కాలిక నమోదు, విదేశాల్లో చదువు లేదా వృత్తి కార్యకలాపాల కోసం గుడ్ స్టాండింగ్ సర్టిఫికెట్ పొందే అవకాశాలున్నాయి.

ప్రస్తుతం రంగంలో పనిచేస్తూ నిర్దేశిత ప్రాథమిక అర్హతలు లేని నిపుణుల కోసం ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ ప్రవేశపెట్టే చర్యలను కమిషన్ పరిశీలిస్తోంది. వీరు బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసి సాధారణ రిజిస్ట్రేషన్‌కు అర్హత పొందే అవకాశం కల్పించనున్నారు. రిజిస్ట్రేషన్, రుసుము చెల్లింపులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నిర్వహిస్తారు.

ఈ చర్యలతో విద్యా సంస్థల నాణ్యత మదింపు, సామర్థ్య ఆధారిత శిక్షణ, వృత్తి నిపుణుల పారదర్శక నమోదు, ప్రజలకు వారి అర్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలను ధ్రువీకరించే సదుపాయం బలోపేతం కానుంది.

# దేశవ్యాప్తంగా అందుబాటు ధరల్లో ఉల్లిపాయలు

## ఖరీఫ్ ఉల్లిపాయల రాకతో మార్కెట్లకు ఊరట

**-123 నగరాలకు బఫర్ నిల్వల సరఫరా.. 8 కందా ఎక్స్‌ప్రెస్‌లు, 467 ట్రక్కుల ద్వారా పంపిణీ**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
దేశవ్యాప్తంగా ఉల్లిపాయల సరఫరా మెరుగుపడటంతో మార్కెట్ యార్డులు, ప్రధాన వినియోగ కేంద్రాల్లో ధరలు తగ్గుముఖం పట్టాయి. ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరగడం, పంట పరిస్థితులు అనుకూలంగా ఉండటం, కొత్త పంట రాక ప్రారంభం కావడం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. పండుగల సీజన్ నేపథ్యంలో ప్రభుత్వం బఫర్ నిల్వల పంపిణీని కూడా విస్తరించింది.

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ వంటి ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల నుంచి తాజా ఖరీఫ్ ఉల్లిపాయలు మార్కెట్లకు చేరుతున్నాయి. నిల్వల్లోని ఉల్లిపాయలు కూడా డిమాండ్‌ను తీర్చేందుకు అందుబాటులో ఉన్నాయి. రానున్న వారాల్లో కొత్త పంట రాక మరింత పెరిగే అవకాశం ఉందని, దీంతో వినియోగ మార్కెట్లలో సరఫరా మెరుగుపడుతుందని అంచనా.

దేశవ్యాప్తంగా ఖరీఫ్ ఉల్లిపాయల సాగు విస్తీర్ణం గత ఏడాది నమోదైన అధిక స్థాయితో పోలిస్తే ఈసారి సుమారు 5 శాతం పెరిగినట్లు అంచనా. ప్రధాన ఉత్పత్తి ప్రాంతాల్లో పంట పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. కోత సమయంలో అధిక వర్షాలు కురిసే సూచనలు లేకపోవడం కోత, ఎండబెట్టడం, రవాణాకు తోడ్పడుతుందని అధికారులు తెలిపారు. దీంతో తేమ వల్ల పంట దెబ్బతినే ప్రమాదం తగ్గనుంది.

మహారాష్ట్రలోని ప్రధాన మార్కెట్లకు ఉల్లిపాయల రాక బలంగా కొనసాగుతోంది. అక్కడి మండీల్లో సగటు ధర సెప్టెంబర్ 16న క్వింటాల్‌కు సుమారు రూ.4,030 ఉండగా, అక్టోబర్ 3 నాటికి రూ.3,475కు తగ్గింది. అంటే దాదాపు 13 శాతం తగ్గుదల నమోదైంది.

చిల్లర మార్కెట్లలోనూ ధరలు తగ్గుతున్నాయి. గత రెండు వారాల్లో 126 నగరాల్లో కిలో ఉల్లిపాయ ధర రూ.1 నుంచి రూ.21 వరకు తగ్గినట్లు నమోదైంది. తమిళనాడు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్ సహా పలు ప్రధాన వినియోగ రాష్ట్రాల్లో ఈ తగ్గుదల కనిపించింది.

వినియోగ కేంద్రాలకు బఫర్ నిల్వల సరఫరాను ప్రభుత్వం పెంచింది. ఇప్పటివరకు 123 నగరాలకు 8 కందా ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 467 ట్రక్కుల ద్వారా 2 లక్షల క్వింటాళ్లకు పైగా ఉల్లిపాయలను పంపిణీ చేసింది. అధిక వినియోగం ఉన్న మార్కెట్లకు మరింత సరఫరా చేరేలా అదనపు రైలు రవాణాను కూడా ప్రణాళిక చేస్తున్నారు.

తాజా ఖరీఫ్ పంట రాక, నిల్వల్లోని ఉల్లిపాయలు, బఫర్ నిల్వల పంపిణీతో మార్కెట్లకు పలు మార్గాల్లో సరఫరా అందుతోంది. పంట రాక, నిల్వలు, ధరల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతోంది. రానున్న వారాల్లో ఖరీఫ్ పంట రాక పెరుగుతుందని, పండుగల సీజన్‌కు ముందే పంపిణీని బలోపేతం చేస్తున్నందున సరఫరా నిలకడగా ఉండి ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని అంచనా.

# ఆర్ఐఎన్ఎల్ భూముల ఈ-వేలానికి మాక్ శిక్షణ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నిర్వహణ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)కు చెందిన 459 భూముల ఈ-వేలానికి ముందు, సంభావ్య బిడ్డర్లకు నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) మాక్ శిక్షణ నిర్వహించింది. అక్టోబర్ 6న విశాఖపట్నంలో ప్రత్యక్షంగా, అక్టోబర్ 7న ఆన్‌లైన్‌లో ఈ శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రక్రియను ముందుగా తెలుసుకునేందుకు ఈ శిక్షణను నిర్వహించారు. బిడ్డింగ్ ఇంటర్‌ఫేస్, వేలంలో పాల్గొనే విధానం, ఇతర కీలక అంశాలను ప్రత్యక్షంగా సాధన చేసే అవకాశం కల్పించారు. ప్రత్యక్ష శిక్షణకు హాజరు కాలేని ఆసక్తిగల వారికి ఆన్‌లైన్ సెషన్ ద్వారా వేదికను పరిచయం చేశారు.

వేలం రెండు విడతల్లో జరగనుంది. తొలి విడత అక్టోబర్ 12న, రెండో విడత అక్టోబర్ 16న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తారు. తొలి విడత వేలానికి రిజిస్ట్రేషన్, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) సమర్పణకు అక్టోబర్ 8 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది.

మాక్ శిక్షణలు బిడ్డర్లు డిజిటల్ ప్రక్రియపై అవగాహన పెంచుకుని, అవసరమైన విధివిధానాలను గడువులోగా పూర్తి చేసేందుకు తోడ్పడతాయని ఎన్ఎల్ఎంసీ సీఈవో రోహన్ చంద్ ఠాకూర్ తెలిపారు. వేలం ప్రక్రియను పారదర్శకంగా, అందరికీ అందుబాటులో ఉండేలా, పాల్గొనేవారికి



అనుకూలంగా నిర్వహించేందుకు సంస్థ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

**93,572 చదరపు గజాల్లో 459 స్థలాలు**

విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం, గాజువాకలోని ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న 459 స్థలాల మొత్తం విస్తీర్ణం 93,572.21 చదరపు గజాలు. ఈ స్థలాలు ఎలాంటి భారాలు లేనివని, ఒక్కో ప్లాటు విస్తీర్ణం సుమారు 128.94 నుంచి 2,728 చదరపు గజాల వరకు ఉంటుందని ఎన్ఎల్ఎంసీ తెలిపింది.

రైల్‌టెల్ ఈ-నివిదా ఈ-ప్రొక్యూర్‌మెంట్ వేదికపై పారదర్శక ఈ-టెండర్-కమ్-ఈ-వేలం విధానంలో స్థలాలను విక్రయించనున్నారు. ఈ ప్రక్రియకు క్వికర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లావాదేవీ సలహాదారుగా వ్యవహరిస్తోంది.

# హిందీని బలవంతంగా రుద్దడం కాదు.. అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలి

## సరళంగా, ప్రజల రోజువారీ భాషకు దగ్గరగా అధికారిక హిందీ ఉండాలి: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
హిందీ భాషను ప్రోత్సహించాలంటే దాని వినియోగాన్ని బలవంతంగా రుద్దడం కంటే, భాష ద్వారా ఉపాధి, వృత్తిపరమైన అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ హిందీ సలహా సంఘం మూడో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ) రూపొందించిన "కౌశల్ పత్రిక"ను ఆవిష్కరించారు.

హిందీ పరిజ్ఞానం ఉద్యోగ, వృత్తి అవకాశాలకు దోహదపడితే ప్రజలు సహజంగానే ఆ భాషను నేర్చుకుని వినియోగిస్తారని మంత్రి పేర్కొన్నారు. హిందీ సలహా సంఘం సభ్యులు చేసిన సూచనలను శాఖ పరిశీలించి, అమలుకు గంభీరంగా కృషి చేస్తుందని తెలిపారు. తమ పరిధికి చెందని అంశాలను సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలకు పంపి పరిశీలనకు అందిస్తామని చెప్పారు.

నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహించే పోటీల్లో భాషా ఎంపికలు కల్పించాలన్న సూచనను ప్రస్తావిస్తూ, చిన్న పట్టణాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల వారికి ఇది ఉపయోగపడుతుందని జితేంద్ర సింగ్ అన్నారు. అవసరమైన చోట మౌఖిక పరీక్షలకు కూడా భాషా ఎంపికలు ఇవ్వడం ద్వారా కార్యక్రమాలను మరింత అందుబాటులోకి తీసుకురావచ్చని చెప్పారు. పాఠశాలల్లో హిందీ బోధనకు హిందీ సలహా సంఘం సభ్యుల సహకారం తీసుకోవాలన్న ప్రతిపాదనను విద్యా మంత్రిత్వ శాఖతో చర్చించవచ్చని తెలిపారు.

శాఖలో ఇప్పటికే పెద్దఎత్తున పనులు హిందీలో జరుగుతున్నాయని, అయితే హిందీ మాట్లాడని రాష్ట్రాలతో అధికారికంగా ఉత్తరప్రత్యుత్తరాలు చేసేటప్పుడు 100 శాతం హిందీ వినియోగాన్ని తప్పనిసరి చేయడం ప్రతిసారి సాధ్యం కాకపోవచ్చని మంత్రి పేర్కొన్నారు. వివిధ భాషా ప్రాంతాల ప్రజలు, అధికారుల సౌలభ్యం, భాషా సున్నితత్వాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ వ్యవహారాల్లో ఉపయోగించే హిందీ సరళంగా, సులభంగా అర్థమయ్యేలా ఉండాలని ఆయన అన్నారు. అవసరంలేని క్లిష్ట పదాలు, అతిగా అధికారికమైన భాషను వాడకుండా, రోజువారీ సంభాషణకు దగ్గరగా ఉండే పదాలను ఉపయోగించాలని సూచించారు. ఇంగ్లీషు నుంచి పదానికి పదం అనువదించినట్టుగా కాకుండా సహజమైన భాషలో సమాచారాన్ని అందించాలని చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత గత 10--12 ఏళ్లలో అధికారిక పనుల్లో హిందీ వినియోగం




గణనీయంగా పెరిగిందని జితేంద్ర సింగ్ తెలిపారు. దక్షిణ భారత ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు కూడా హిందీని విస్తృతంగా ఉపయోగిస్తున్నారని, శాస్త్ర, సాంకేతిక సంస్థల్లోని అధికారులు, సిబ్బంది హిందీలో విధులు నిర్వహిస్తున్న ఉదాహరణలను ప్రస్తావించారు.

ప్రభుత్వ పనుల్లో అనువాదాల నాణ్యత కూడా మెరుగుపడిందని మంత్రి చెప్పారు. గతంలో తప్పులు, కొన్నిసార్లు తప్పుదారి పట్టించే అనువాదాలు కనిపించేవని, ప్రస్తుతం ఆ సమస్యలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. సాంకేతికత, కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలు, విస్తృతమైన సమాచార నిధులు అనువాద నాణ్యతను పెంచుతున్నాయని, సాంకేతిక అంశాల అనువాదంలోనూ పురోగతి కనిపిస్తోందని పేర్కొన్నారు. అయితే, హిందీ వినియోగాన్ని జ్ఞానం, వృత్తి నైపుణ్యాల నుంచి వేరుచేసి చూడరాదని మంత్రి స్పష్టం చేశారు. ప్రత్యేక రంగాల్లో అవసరమైన సాహిత్యం, పదజాలం అందుబాటులో లేనప్పుడు కేవలం హిందీకి పట్టుబట్టడం జ్ఞానార్జనకు అడ్డంకి కాకూడదన్నారు. వైద్య విద్యలో హిందీ వినియోగంపై వచ్చిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ, అవసరమైన చోట సాంకేతిక పదాలను యథాతథంగా ఉంచి, వివరణలు, బోధనను హిందీలో అందించవచ్చని చెప్పారు.

భాష ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగినప్పుడు దాన్ని నేర్చుకోవాలనే ఆసక్తి సహజంగా వస్తుందని జితేంద్ర సింగ్ అన్నారు. గతంలో హిందీ తక్కువగా వినియోగంలో ఉన్న ప్రాంతాల్లోనూ ఆ భాష నేర్చుకోవాలనే డిమాండ్ పెరుగుతోందని, దీనికి కొత్త ఉపాధి అవకాశాలు ఒక కారణమని పేర్కొన్నారు.

హిందీని సరళంగా, సహజంగా, అందరికీ చేరువయ్యేలా ప్రోత్సహించడమే లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. దేశ భాషా వైవిధ్యాన్ని, ప్రజల రోజువారీ అవసరాలను గౌరవిస్తూ హిందీ వినియోగాన్ని విస్తరించేందుకు హిందీ సలహా సంఘం సభ్యులు తమ సూచనలను కొనసాగించాలని కోరారు.

# ఐగాట్ కోర్సుల రూపకల్పన, డిజిటలీకరణపై ఐసీఏఆర్ సమీక్ష

## నాణ్యత, గడువులోగా కోర్సుల అప్‌లోడ్, నిరంతర అభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వాలి: డాక్టర్ ఎం.ఎల్. జాట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
ఐగాట్ కర్మయోగి వేదిక కోసం విభాగాల వారీ కోర్సుల రూపకల్పన, డిజిటలీకరణపై భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) వ్యవసాయ విద్యా విభాగం ఆన్‌లైన్ సమీక్షా సమావేశం నిర్వహించింది. వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగం కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఐసీఏఆర్ సంస్థల్లో రూపొందుతున్న విభాగాల వారీ కోర్సుల పురోగతిని సమీక్షించడంతో పాటు, నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని గడువులోగా ఐగాట్ కర్మయోగి వేదికపై అప్‌లోడ్ చేయడమే సమావేశ లక్ష్యమని అధికారులు తెలిపారు.

కోర్సులను నాణ్యతా ప్రమాణాలతో రూపొందించి, అంతర్గత సమీక్ష అనంతరం నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ వేదికపై అప్‌లోడ్ చేయాలని డాక్టర్ జాట్ అన్ని ఐసీఏఆర్ సంస్థలకు సూచించారు. అప్పగించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ఐగాట్ కర్మయోగి వేదిక ద్వారా నిరంతర అభ్యాసాన్ని ప్రోత్సహించాలని



అన్నారు.

ఐసీఏఆర్ ఉద్యోగులందరూ ఈ వేదికపై క్రమం తప్పకుండా కనీసం రెండు గంటలపాటు అభ్యసించాలని ఆయన పేర్కొన్నారు. నిర్దేశించిన అభ్యాస గంటలు, కోర్సుల అప్‌లోడ్ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా సంస్థలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రారంభ వ్యాఖ్యల్లో ఐసీఏఆర్ వ్యవసాయ విద్యా ఉప డైరెక్టర్ జనరల్ డాక్టర్ యశ్‌పాల్ సింగ్ మాలిక్.. మిషన్ కర్మయోగి కింద ఐసీఏఆర్ పనితీరును మెరుగుపరచేందుకు అన్ని సంస్థలు సకాలంలో చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో చురుకైన భాగస్వామ్యం ద్వారా జాతీయ స్థాయిలో ఐసీఏఆర్ ర్యాంకింగ్‌ను మెరుగుపరచాలని సూచించారు.

కోర్సుల కంటెంట్ రూపకల్పన, డిజిటలీకరణ ప్రక్రియపై కర్మయోగి భారత్ నిపుణుడు అశ్విన్ వివరించారు. కోర్సుల అభివృద్ధికి అందుబాటులో ఉన్న ఎంప్యానెల్డ్ సంస్థల వివరాలతో పాటు, నాణ్యమైన అభ్యసన కంటెంట్ రూపొందించి అప్‌లోడ్ చేసేందుకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించారు.

కోర్సుల రూపకల్పన, డిజిటలీకరణను వేగవంతం చేయడం, అంతర్గత సమీక్ష ద్వారా నాణ్యతను నిర్ధారించడం, అభ్యాస గంటలను పూర్తి చేయడం, విభాగాల వారీ కోర్సులను నిర్ణీత గడువులోగా అప్‌లోడ్ చేయాలని సమావేశం ముగింపులో ఆదేశించారు. మిషన్ కర్మయోగి కింద సామర్థ్య నిర్మాణం, అభ్యాసాన్ని బలోపేతం చేసేందుకు అన్ని ఐసీఏఆర్ సంస్థల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రాధాన్యంగా పేర్కొన్నారు.

# జీఎస్ఎంఏ బోర్డు సభ్యులతో ప్రధాని మోదీ భేటీ

## సమగ్ర, సుస్థిర అభివృద్ధికి సాంకేతికత సాధనంగా మారాలి: ప్రధాని

**సైబర్ మోసాల నియంత్రణకు సాంకేతిక పరిష్కారాలు అవసరం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)--2026కు ముందు, సేవా తీర్థ్‌లో గ్లోబల్ సిస్టమ్ ఫర్ మొబైల్ కమ్యూనికేషన్స్ అసోసియేషన్ (జీఎస్ఎంఏ) బోర్డు సభ్యులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. కేంద్ర సమాచార, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సమాచార, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



మొబైల్ రంగంలోని ఆపరేటర్లు, సంస్థలు, అనుబంధ పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహించే అంతర్జాతీయ సంస్థ జీఎస్ఎంఏ. సాంకేతికత సమగ్ర, సుస్థిర అభివృద్ధికి సాధనంగా మారాలని ప్రధాని అన్నారు. సమాజంలోని ఏ వర్గమూ వెనుకబడకుండా సాంకేతికతను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో డిజిటల్ సేవలు అందుబాటు ధరల్లో లభించేలా చూడాలని, చివరి అంచె వరకు సాంకేతికతను చేర్చి డిజిటల్ అంతరాన్ని పెరగకుండా నిరోధించాలని సూచించారు.

అభివృద్ధి చెందుతున్న దేశాల పరివర్తనలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) కీలక పాత్ర పోషించగలదని ప్రధాని తెలిపారు. పలువురు ప్రపంచ నాయకులతో జరిగిన చర్చల్లో డీపీఐ ప్రాధాన్యం వెల్లడైందని, గ్లోబల్ సౌత్ దేశాల అభివృద్ధికి ఈ వేదికలు దోహదపడతాయని అన్నారు.

డిజిటల్, సైబర్ మోసాల పెరుగుతున్న ముప్పును ఎదుర్కొనేందుకు సాంకేతిక ఆధారిత పరిష్కారాలు అవసరమని ప్రధాని పేర్కొన్నారు. మోసపూరిత కాల్స్‌పై ప్రజలను అప్రమత్తం చేసే అవగాహన సందేశాలను నిరంతరం పంపాలని సూచించారు. డీప్‌ఫేక్‌లు, కృత్రిమ మేధతో రూపొందించిన కంటెంట్ మూలాన్ని వినియోగదారులు వెంటనే గుర్తించే విధానాలపై పరిశీలన జరగాలని, కొత్త సాంకేతికతలకు ప్రపంచవ్యాప్త ప్రమాణాలు, ఉమ్మడి నియమాలు రూపొందించాలని అన్నారు.

**భారత్ డిజిటల్ పరివర్తనకు జీఎస్ఎంఏ సభ్యుల ప్రశంసలు**

డిజిటల్ కనెక్టివిటీ, మొబైల్ రంగాల్లో భారత్ ప్రపంచ నాయకత్వ స్థానానికి ఎదుగుతోందని జీఎస్ఎంఏ బోర్డు సభ్యులు పేర్కొన్నారు. 4జీ, 5జీ సేవల వేగవంతమైన విస్తరణ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్థాయి, టెలికాం, మొబైల్ తయారీ రంగాల పురోగతిని వారు అభినందించారు.

పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను ప్రశంసిస్తూ, డిజిటల్ రంగం మరింత అభివృద్ధి చెందేందుకు సురక్షితమైన, స్థిరమైన, విశ్వసనీయ డిజిటల్ మౌలిక సదుపాయాలు అవసరమని తెలిపారు. 5జీ, 6జీ, కృత్రిమ మేధ, సైబర్ భద్రత, డిజిటల్ సమ్మిళితత్వం, ఉపగ్రహ కనెక్టివిటీ రంగాల్లో భారత్‌తో అంతర్జాతీయ సహకారానికి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఇండియా మొబైల్ కాంగ్రెస్ పదో సంచికకు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. తదుపరి తరం కనెక్టివిటీ, డిజిటల్ సాంకేతికతలపై భారత్ అంతర్జాతీయ భాగస్వామ్యాలను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ముందుండి బలోపేతం చేస్తున్నారు. 2026లో బార్సిలోనాలో జరిగిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన ఆయన, కనెక్టివిటీని అందుబాటు ధరల్లో, సమ్మిళితంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంపై జీఎస్ఎంఏ మంత్రుల కార్యక్రమంలో ప్రసంగించారు.

తదుపరి తరం కనెక్టివిటీ, 6జీ, సురక్షిత డిజిటల్ మౌలిక సదుపాయాలు, కృత్రిమ మేధ, ప్రపంచవ్యాప్తంగా పరస్పర అనుసంధానానికి వీలైన సాంకేతిక ప్రమాణాల రూపకల్పనపై అంతర్జాతీయ చర్చల్లో భారత్ పాత్ర పెరుగుతోందని ఈ సమావేశం వెల్లడించింది. ప్రపంచ మొబైల్ రంగంతో భారత్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు జీఎస్ఎంఏ బోర్డుతో జరిగిన భేటీ దోహదపడనుంది.

# భారత్--ఈఎఫ్‌టీఏ ఒప్పంద అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

## భారత ఎగుమతుల్లో 99.6 శాతానికి మార్కెట్ ప్రవేశం కల్పిస్తున్న టెపా: వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
భారత్--యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ) వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టెపా) ద్వారా కలిగే అవకాశాలను భారత ఎగుమతిదారులు మరింతగా వినియోగించుకోవాలని కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో మంగళవారం ప్రధాన ఎగుమతిదారుల కోసం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు, పరిశ్రమల సంఘాలు, ఎగుమతిదారులు, ఈఎఫ్‌టీఏ దేశాల వ్యాపార ప్రతినిధులను ఉద్దేశించి ఆయన కీలక ప్రసంగం చేశారు. రెండో భారత్--ఈఎఫ్‌టీఏ ప్రాస్పెరిటీ సమ్మిట్--2026లో భాగంగా వాణిజ్య శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఐస్‌లాండ్, లీచ్టెన్‌స్టైన్, నార్వే, స్విట్జర్లాండ్ దేశాలతో కూడిన ఈఎఫ్‌టీఏతో టెపా 2025 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఒప్పందం తొలి వార్షికోత్సవం సందర్భంగా ఈ నాలుగు దేశాల నాయకులు న్యూఢిల్లీకి వచ్చారని, ఒప్పంద అమలును సమీక్షించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనున్నారని అగర్వాల్ తెలిపారు.

ఈ ఒప్పందం కింద ఈఎఫ్‌టీఏ దేశాలు తమ సుంకాల పట్టికలోని 92.2 శాతం ఉత్పత్తులకు రాయితీలు కల్పిస్తున్నాయని, దీంతో భారత ఎగుమతుల్లో 99.6 శాతానికి మార్కెట్ ప్రవేశం లభిస్తుందని ఆయన వివరించారు. వ్యవసాయేతర ఉత్పత్తులన్నింటికీ పూర్తి కవరేజీ ఉందన్నారు. భారత్ తన సుంకాల పట్టికలోని 82.7 శాతం ఉత్పత్తులపై రాయితీలు కల్పించడంతో, ఈఎఫ్‌టీఏ ఎగుమతుల్లో 95.3 శాతానికి ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

టెపా కేవలం సుంకాల తగ్గింపునకు మాత్రమే పరిమితం కాదని, వ్యాపారాలకు భరోసా, ముందస్తు అంచనాలకు వీలు కల్పించడం దీని ప్రధాన ప్రయోజనమని వాణిజ్య కార్యదర్శి పేర్కొన్నారు. రాబోయే కాలంలో సుంకాలు స్థిరంగా ఉంటాయన్న నమ్మకంతో సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు, సరఫరా గొలుసులను నిర్మించేందుకు, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇరు దేశాల సంస్థలు భాగస్వామ్యాలు కుదుర్చుకుని, ముడి సరుకుల నుంచి తుది ఉత్పత్తుల వరకు ఉమ్మడి విలువ గొలుసులను నిర్మించాలని సూచించారు.

ఈఎఫ్‌టీఏ దేశాలు అధిక ఆదాయమున్న మార్కెట్లు కావడంతో నాణ్యతకు పెద్దపీట వేస్తాయని అగర్వాల్ అన్నారు. అక్కడి వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించగలిగితే, ఇతర మార్కెట్లలోనూ వాటికి ఆదరణ లభిస్తుందని చెప్పారు. సుంకాలు సున్నాకు తగ్గిన అనేక ఉత్పత్తులకు వ్యవసాయ రంగంలోనూ పెద్ద ఎగుమతి అవకాశం ఉందని, అటువంటి ఉత్పత్తులను గుర్తించి దీర్ఘకాలిక సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని ఎగుమతిదారులకు సూచించారు.

ఈఎఫ్‌టీఏ దేశాలు ఏటా అర ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పైగా విలువైన వస్తువులు, సేవలను దిగుమతి చేసుకుంటున్నాయని, ఇది భారత ఎగుమతులకు కీలక మార్కెట్ అని ఆయన పేర్కొన్నారు. ఒప్పంద ప్రయోజనాలను దేశంలోని అన్ని ప్రాంతాల వ్యాపారాలకు చేరవేసేలా ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు, పరిశ్రమల సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి భాగస్వామ్య దేశం, మార్కెట్ కోసం వచ్చే ఐదేళ్లకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఎగుమతుల వృద్ధి లక్ష్యాలు, పరిష్కరించాల్సిన సుంకేతర అడ్డంకులను అందులో చేర్చాలని సూచించారు.

ఈఎఫ్‌టీఏ దేశాల వ్యాపారాలు భారత్‌ను తమ మార్కెట్ విస్తరణగా చూడటమే కాకుండా, భారత వ్యాపారాలు కూడా ఆ దేశాల మార్కెట్లను తమ విస్తృత మార్కెట్‌గా భావించాలని అగర్వాల్ అన్నారు. ఇతర ఒప్పందాల నుంచి టెపాను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో పెట్టుబడి హామీ ఒకటని ఆయన వివరించారు. ఒప్పందంలోని ఆర్టికల్ 7.1 ప్రకారం, అమల్లోకి వచ్చిన పదేళ్లలో ఈఎఫ్‌టీఏ పెట్టుబడిదారుల నుంచి భారత్‌లోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 50 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచాలని, ఆ తర్వాతి ఐదేళ్లలో మరో 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే 15 ఏళ్లలో భారత్‌లో 10 లక్షల ఉద్యోగాల కల్పనకు తోడ్పడాలని ఒప్పందం నిర్దేశిస్తోంది. వివిధ రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్న భారత మార్కెట్‌లో ఇరు పక్షాల వ్యాపార భాగస్వామ్యాలు మరింతగా బలోపేతమైతే ఈ లక్ష్యాలను మించగలమని అగర్వాల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పీఎం మెమెంటోస్‌లో ఛత్తీస్‌గఢ్ సంస్కృతికి అద్దం

**4,000 ఏళ్ల చరిత్రగల డోక్రా కళ నుంచి గిరిజన వారసత్వం వరకు**
**16 ప్రత్యేక జ్ఞాపికలు**
**అధికారిక పీఎం మెమెంటోస్ పోర్టల్‌లో వేలం.. అక్టోబర్ 31 వరకు గడువు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ట్రైనెట్ న్యూస్):**
ఛత్తీస్‌గఢ్ ప్రాచీన లోహపు పోత కళ, గిరిజన వారసత్వం, భక్తి సంప్రదాయాలు,ఆధునికసాంస్కృతిక గుర్తింపును ప్రతిబింబించే 16 జ్ఞాపికలు ఎనిమిదో పీఎం మెమెంటోస్ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సేకరణలో ప్రధానంగా 4,000 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న డోక్రా కళాకృతులు చోటు చేసుకున్నాయి. మైనపు అచ్చుతో లోహాన్ని పోసే సంప్రదాయ పద్ధతిలో రూపొందించిన ఏనుగు తల నంది, నిలబడి ఉన్న నంది, మాడియా--మాడిన్ గిరిజన జంట ప్రతిమలు ఈ కళలోని వైవిధ్యాన్ని చాటుతున్నాయి.
నెమలి ఈకల గుత్తి, గవ్వలు, లోహపు చక్రాలు, ఇత్తడి గంటలతో అలంకరించిన సంప్రదాయ వేడుకల శిరోభూషణం ఛత్తీస్‌గఢ్ గిరిజన సంస్కృతిని ప్రతిబింబిస్తోంది. "రామ్ రామ్" అని పదేపదే రాసిన రామ్‌నామీ సమాజ్ జప వస్త్రం ఆ ప్రాంత భక్తి సంప్రదాయానికి ప్రత్యేక నిదర్శనంగా నిలుస్తోంది. హట్కేశ్వర్ మహాదేవ్, బుడేశ్వర్ మహాదేవ్, జై మా కుదర్‌గఢి, మధేశ్వర్ మహాదేవ్ వంటి ఆలయాలు, పుణ్యక్షేత్రాలను ప్రతిబింబించే జ్ఞాపికలూ ఈ సేకరణలో ఉన్నాయి.
సంప్రదాయంతో పాటు ఆధునిక ఛత్తీస్‌గఢ్ రూపురేఖలనూ ఈ కళాఖండాలు చూపిస్తున్నాయి. మహతారి వందన్ యోజనను చిత్రించిన చెక్క ప్యానెల్, ఛత్తీస్‌గఢ్ శాసనసభ రజతోత్సవాన్ని గుర్తుచేసే జ్ఞాపిక, నయా రాయ్‌పూర్‌లోని సంస్థల నమూనాలు రాష్ట్ర ప్రస్తుత అభివృద్ధి, సాంస్కృతిక పరిణామాన్ని ప్రతిబింబిస్తున్నాయి.
తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు నేటి కళారూపాల్లోనూ కొనసాగుతూ ఛత్తీస్‌గఢ్ సాంస్కృతిక జ్ఞాపకాలను భవిష్యత్తుకు చేరవేస్తున్నాయన్నది ఈ సేకరణ ప్రధాన సందేశం.
ఈ జ్ఞాపికల వేలం ప్రస్తుతం కొనసాగుతోంది. వేలం గడువును 2026 అక్టోబర్ 31 వరకు పొడిగించారు. ఆసక్తి ఉన్నవారు అధికారిక పీఎం మెమెంటోస్ పోర్టల్ ద్వారా వేలంలో పాల్గొనవచ్చు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని నమామి గంగే ప్రాజెక్టుకు వినియోగించనున్నారు.

## కర్ణాటక కళా వారసత్వానికి పీఎం మెమెంటోస్‌లో ప్రత్యేక స్థానం

### కిన్నాల్ కళ, బిద్రీ కళాఖండాలు, కంబళ పండుగకు గుర్తింపు





**న్యూఢిల్లీ:ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7 :**
8వ విడత పీఎం మెమెంటోస్ ఈ-వేలంలో కర్ణాటకకు చెందిన కళలు, హస్తకళలు, సంప్రదాయాలకు ప్రత్యేక స్థానం లభించింది. కర్ణాటకకు సంబంధించిన 30 మెమెంటోలు రాష్ట్రంలోని వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. శృంగేరి శారదాంబకు సంబంధించిన కళాఖండాలు, బంజారా సమాజానికి సంబంధించిన వస్తువులు, కిన్నాల్ కళ, బిద్రీ కళాఖండాలు ఇందులో ఉన్నాయి. కర్ణాటక గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే కంబళ పండుగకు సంబంధించిన ఫొటో ప్రింట్ కూడా ఈ సేకరణలో చోటు చేసుకుంది. సంప్రదాయ కళాకారుల నైపుణ్యాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయని సాంస్కృతిక వర్గాలు పేర్కొంటున్నాయి

## నీరు--సంగీతం--సంస్కృతికి వేదికగా కొల్లం ఉత్సవం

### అస్థముడి వాటర్ గేట్ మ్యూజిక్ ఫెస్టివల్ ప్రారంభం

**కొల్లం:ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7 :**
కేరళలోని కొల్లం నగరంలో అస్థముడి వాటర్ గేట్ మ్యూజిక్ ఫెస్టివల్ ప్రారంభమైంది. అక్టోబర్ 7 నుంచి 11 వరకు ఐదు రోజుల పాటు ఈ సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నీరు, మానవ జీవితం, సంస్కృతి, సంగీతం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలను రూపొందించారు. రాజస్థాన్‌కు చెందిన మంగనియార్ సంగీత సంప్రదాయం నుంచి కేరళ సంప్రదాయ వాద్య సంగీతం వరకు వివిధ సంగీత రూపాలకు ఈ ఉత్సవంలో స్థానం కల్పించారు. సంగీత కార్యక్రమాలతో పాటు సంగీతానికి సంబంధించిన సినిమాలను కూడా ప్రదర్శిస్తున్నారు.



భారతదేశంలోని భిన్న ప్రాంతాల సంగీత సంప్రదాయాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ ఉత్సవం ప్రత్యేకతగా నిలుస్తోంది.







## తపస్ సొసైటీ ఫర్ ఏ స్మైల్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు..

### దివ్యాంగుల పట్ల ఆదరణ, సేవా దృక్పథం అలవర్చుకోవాలి..

**తార్నాక, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7 :**
తపస్ సొసైటీ ఫర్ ఏ స్మైల్ నాలుగో వార్షికోత్సవ వేడుకలను తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి హాల్ లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సర్ప్ (ఎస్ఈఆర్‌పీ) సీఈఓ, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఐఏఎస్ దివ్య ఆన్లైన్ ద్వారా ఆమె సందేశాన్ని అందించారు. గాంధీనగర్ ఏసీపీ యాదగిరి అనికేష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని, మానసిక దివ్యాంగుల పట్ల ఆదరణ, ఆప్యాయతతో వ్యవహరించాలని సూచించారు. దివ్యాంగులను సమాజంలో చిన్నచూపు చూడకుండా వారికి అండగా నిలవాలని కోరారు. ప్రస్తుత సమాజంలో



అన్ని రంగాల్లో దివ్యాంగులు సైతం ప్రతిభను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. వారికి సరైన ప్రోత్సాహం, చేయూత అందిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. మానసిక ఎదుగుదలలో ప్రత్యేక అవసరాలు ఉన్న వారిని అక్కున చేర్చుకుని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్న తపస్ సొసైటీ ఫర్ ఏ స్మైల్ సేవలను ముఖ్య



అతిథులు అభినందించారు. అనంతరం మానసిక దివ్యాంగులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తపస్ సొసైటీ ఫర్ ఏ స్మైల్ ప్రెసిడెంట్ భావన గండ్రేటు, డైరెక్టర్ నాగేంద్ర, ట్రెజరర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బతుకమ్మ సంబరాలకు భారీ ఏర్పాట్లు

### అక్టోబర్ 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజుల వేడుకలు



**హైదరాబాద్:ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7 :**
తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన బతుకమ్మ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది బతుకమ్మ వేడుకలు అక్టోబర్ 10 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ప్రధాన వేడుకలకు వేదిక కానుంది.



అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మ సందర్భంగా వేలాది మంది మహిళలు పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యాలు చేయడం ఈ పండుగ ప్రత్యేకత. ఈ సందర్భంగా వందలాది మంది కళాకారులు సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించనున్నారు.



నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మ నమూనాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్య ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించేందుకు కూడా చర్యలు చేపట్టారు. తెలంగాణ సంస్కృతి, మహిళల సామాజిక ఐక్యత, ప్రకృతితో అనుబంధాన్ని ప్రతిబింబించే ఈ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది

## దుర్గాపూజ వెనుక ఉన్న బెంగాలీ సంస్కృతిని పరిచయం చేస్తున్న హెరిటేజ్ వాక్స్

### విగ్రహ తయారీ నుంచి ధునుచి నృత్యం వరకు ప్రత్యేక కార్యక్రమాలు





**న్యూఢిల్లీ:ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7 :**
దుర్గాపూజ సందర్భంగా ఢిల్లీలోని చిత్తరంజన్ పార్క్‌లో బెంగాలీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రజలకు పరిచయం చేసే ప్రత్యేక హెరిటేజ్ వాక్స్ నిర్వహిస్తున్నారు. సాధారణంగా పండుగ పందిళ్లను సందర్శించడంతో మాత్రమే పరిమితం కాకుండా దుర్గాపూజకు సంబంధించిన చరిత్ర, పురాణాలు, ఆచారాలు, విగ్రహ తయారీ విధానం, కళాకారుల జీవితం వంటి అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు. మట్టి నుంచి దుర్గాదేవి విగ్రహం తయారయ్యే ప్రక్రియ, సంప్రదాయ పూజా విధానాలు, ధునుచి నృత్యం వంటి అంశాలను ఈ



కార్యక్రమాల్లో చూపిస్తున్నారు. పండుగ వెనుక



ఉన్న కళ, శ్రమ, సంప్రదాయాలను ప్రజలకు మరింత దగ్గర చేయడమే కార్యక్రమాల ఉద్దేశం.

## హైదరాబాద్‌లో జపాన్--భారత్ సాంస్కృతిక వేడుక



**హైదరాబాద్:ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 7 :**
న హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. జపాన్ సంప్రదాయ కళలు, ఆహారం, భాష, సంగీతం, నృత్యం, మార్షల్ ఆర్ట్స్‌తో పాటు ఆధునిక పాప్ కల్చర్, అనిమే, కాస్ప్లే, రోబోటిక్స్ వంటి అంశాలను




కూడా ఇందులో ప్రదర్శించనున్నారు. భారత్--జపాన్ సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేసే వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA.
www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136